ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

14-10-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 255 పేజీలు: 10+4 వెల: 6.50



దసరా తర్వాత ఓటు చోరీపై భారీసభ: సిఎం 2

హైవే హోటళ్లు, ధాబాల్లో ఎలుకలు, బొద్దింకలు, ఈగలు 3





3 2029లోనూ ఎన్డీయేదే విజయం


'సర్' మాటున చొరబాటుదార్లను రక్షిస్తున్న కాంగ్రెస్
విపక్షాల వ్యూహాలు ప్రజలకు అర్థమవుతున్నాయి: అమిత్‌షా




5 'పవర్ టు ఎంపవర్' బాటలో సాగుతున్నాం


డిజిటల్ నైపుణ్యాలు భారత్‌కు గేమ్‌ఛేంజర్
'బ్లూమ్‌బెర్గ్ న్యూఎకానమీ ఫోరం'లో ప్రధాని మోడీ

## ఉచ్చు బిగుస్తోంది

ప్రధాని మోడీ, అమిత్ షా, జ్ఞానేశ్ తప్పించుకోలేరు..

ప్రజాస్వామ్య పరిరక్షణకే మా పోరాటం

సమైక్యంగా ఇండియా కూటమి: రాహుల్

సిఇసి రాజీనామా చేయాలి లేదా తొలగించాలి: ఖర్గే



**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌లు తమ చుట్టూ ఉచ్చు బిగుస్తోందనే విషయాన్ని అర్థం చేసుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. మంగళవారం తన నివాసంలో ప్రతిపక్ష నేతలు, విద్యార్థి సంఘాలు, పౌర సమాజ ప్రతినిధులతో నిర్వహించిన హైటీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, జేఎంఎం ఎంపీ మహువా మాజి, వామపక్ష నేతలు ఎం.ఎ. బేబీ, డి. రాజా, ఎన్సీపీ (శరద్ పవార్) ఎంపీ సుప్రియా సూలే, ఏఐఎస్‌ఏ అధ్యక్షురాలు నేహా బోరా తదితరులు పాల్గొన్నారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలతో దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని ప్రతిపక్ష నేతలు మరోసారి డిమాండ్ చేశారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగే విధానాన్ని ఎన్నికల సంఘం దెబ్బతీస్తోందని ఆరోపించారు. సమావేశం అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఇండియా కూటమి ఐక్యంగా ఉందని, వేర్వేరు వర్గాలు వేర్వేరుగా నిరసనలు చేపడుతున్నాయన్న వాదనలను తోసిపుచ్చారు. 'మేమంతా ఇక్కడ ఒకే వేదికపై ఐక్యంగా నిలబడ్డాం. నిన్న చెప్పినట్లుగానే, సమాంతర నిరసనలు ఏవీ లేవు. ఇది ఒకే నిరసన. భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడమే ఈ ఉద్యమం లక్ష్యం అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. నిరసనలకు మద్దతు తెలిపిన ఢిల్లీ ప్రజలకు, ఇతరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఉద్యమం రాజకీయ పార్టీలకు మాత్రమే పరిమితం కాదని పేర్కొన్నారు. ఇది మా గురించి కాదు. భారత ప్రజల గురించి, వారి భవిష్యత్తు గురించని రాహుల్ గాంధీ అన్నారు. సుప్రీంకోర్టు, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) పట్ల తమకు అపారమైన గౌరవం ఉందని, ఈ ప్రక్రియలో వారు తమ పాత్రను సమర్థంగా పోషిస్తారని ఆశిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత నిరసనలను ప్రజలకు, అధికారంలో ఉన్న బీజేపీకి మధ్య జరుగుతున్న ఉమ్మడి పోరాటంగా ఏఐఎస్‌ఏ అధ్యక్షురాలు నేహా బోరా అభివర్ణించారు. ప్రజలమైన మేము వర్సెస్ బీజేపీ అని చెప్పినప్పుడు, మేము ఒకే పోరాటం గురించి మాట్లాడుతున్నామని ఆమె అన్నారు. ప్రజాస్వామ్య పునాదులపై

>>2

ఎల్బీనగర్ - హయత్‌నగర్

## డబుల్ డెక్కర్ కారిడార్‌కు ఓకే

కృష్ణపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జ్ శంకుస్థాపనకు గడ్కరీ సమ్మతి

శ్రీశైలం మార్గంలో ఎలివేటెడ్ కారిడార్‌కు కొత్త డిపిఆర్

రైల్వే క్రాసింగ్ సమస్యలకు పరిష్కారం..

కేంద్ర మంత్రి గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి భేటీ



మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి గడ్కరీతో భేటీ అయిన మంత్రులు కోమటిరెడ్డి, జూపల్లి

**హైదరాబాద్, అక్టోబరు13, ప్రభాతవార్త:** ఎల్బీనగర్ – హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు ఆమోదం తెలపడంతోపాటు కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్‌బ్రిడ్జ్ శంకుస్థాపన ప్రతిపాదనకు గడ్కారి సమ్మతి తెలిపారు. రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో

>>2



ఆ రెండు సీట్లు

## గెలవాలి

ఢిల్లీలో పార్టీ నేతలతో సిఎం రేవంత్ భేటీ

నియోజకవర్గాల వారీగా 77 మంది కాంగ్రెస్ కోఆర్డినేటర్ల నియామకం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు13:** తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న కరవు, విద్యుత్ కొరత, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు తదితర అంశాలపై నేతలతో సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. దిల్లీలోని తన నివాసంలో నేతలతో సమీక్ష సమావేశం

>>2



## ఇక ఆశలు ఈశాన్యం పైనే

17 నుంచి వర్షాలకు ఛాన్స్

హనుమకొండలో అత్యధికంగా 37° ఉష్ణోగ్రత

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాత వార్త:** నైరుతి రుతుపవనాలు నిష్క్రమిస్తున్న తరుణంలో తెలంగాణ వైపు ఈశాన్య రుతుపవనాలు వేగంగా దూసుకు వస్తున్నాయి. మరోపక్క సాధారణం మించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇక ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రోజుల్లో వర్షాల తీవ్రత గణనీయంగా పెరగనుందని వెదర్ మ్యాన్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో వర్షాల ప్రభావం క్రమంగా పెరగనుంది. ముఖ్యంగా ఈ నెల 17వ తేదీ నుంచి రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశమున్నట్లు తెలంగాణ వెదర్ మ్యాన్ అంచనా వేశారు.

>>2

## 'సింగరేణి'కి దసరా కానుక



మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో డి.సిఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు

ఉద్యోగులు ఒక్కొక్కరికి రూ.1,53,912 లాభాల వాటా

కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్

కార్మికుల సొంతింటి కల సాకారం

సింగరేణి భవిష్యత్తు కోసం కొత్త బొగ్గు బ్లాక్‌లు: డి.సిఎం భట్టి

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** దసరా పండుగ సందర్భంగా సింగరేణిలో పనిచేస్తున్న ఉద్యోగులకు లాభాల్లో వాటాగా ఒక్కొక్కరికి సగటున రూ.1,53,912 చెల్లించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. మొత్తం 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులు ఈ ప్రయోజనం పొందనున్నారని చెప్పారు. అలాగే 29,717 మంది కాంట్రాక్ట్ కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున దసరా బోనస్ చెల్లించనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లో మంత్రి డి శ్రీధర్‌బాబుతో కలిసి మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాది కూడా సింగరేణి లాభాల్లో 34 శాతాన్ని కార్మికులకు లాభాల వాటాగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ ఏడాది 1,754 కోట్ల నికర లాభా రాగా, ఇందులో 34 శాతం రూ.596 కోట్ల కార్మికులకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. అలాగే కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్‌గా చెల్లిస్తామన్నారు. కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. కార్మికులకు సొంత ఇళ్లు నిర్మించుకునే అవకాశం కల్పించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. సింగరేణి సంస్థకు చెందిన భూముల్లో ఇప్పటి వరకు మైనింగ్ చేపట్టని ప్రాంతాలను గుర్తించి, అక్కడ ఇళ్ల నిర్మాణానికి అనువైన లేఅవుట్లు సిద్ధం చేయాలని సూచించారు. సుమారు 1,250 ఎకరాలకు సంబంధించి జీవో నంబర్ 76 ప్రకారం అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న సుమారు 300 డిపెండెంట్ ఆర్డర్లు, ఇతర చట్టపరమైన ప్రక్రియలను రాబోయే 15 రోజుల్లో పూర్తి చేసి అర్హులైన అభ్యర్థులకు ఉత్తర్వులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్మికుల పేర్ల మార్పులకు సంబంధించి పెండింగ్‌లోని 136 నుంచి

>>2



## 3 పిటిషన్లు డిస్మిస్

డిఎస్సీ నియామకాల న్యాయవిచారణలో కీలక పరిణామం

2008 నాటి నోటిఫికేషన్‌పై హైకోర్టు సంచలన తీర్పు

**హైదరాబాద్,అక్టోబరు13,ప్రభాతవార్త:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన డీఎస్సీ 2008 ఉపాధ్యాయ నియామకాల వివాదానికి సంబంధించి మంగళవారం తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రభుత్వ జీవో నంబర్ 28.. నియామక నిబంధనల్లో చేసిన మార్పులను సవాల్ చేస్తూ దాఖలైన 3 రిట్ పిటిషన్లను ధర్మాసనం కొట్టివేసింది. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత నిబంధనల్లో మార్పులు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. సుదీర్ఘ విచారణ అనంతరం ఈ నిర్ణయం వెలువడింది. దీంతో డీఎస్సీ 2008 నియామకాలకు సంబంధించిన న్యాయ వివాదంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2008 డిసెంబర్‌లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 52,655 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా.. వాటిలో 30,558 సెకండరీ గ్రేడ్ టీచర్

>>2



## 'గంగ' నీటికోటా పెంచండి

ఎపి సిఎం చంద్రబాబును కోరిన తమిళ సిఎం విజయ్

గోదావరి- కావేరి అనుసంధానంపై సమన్వయంతో సాగుదాం

చెన్నైకి ఇప్పటికే 4.08 టిఎంసిల నీరు ఇచ్చామన్న చంద్రబాబు

9






ధరణి' పోయినా.. భూభారతి మాయ

## రైతులు లబోదిబో




ప్రభుత్వం మారినా తొలగని భూ సమస్యలు

వారసత్వ భూమికి కొత్తగా హక్కును నిరూపించుకోవాల్సిన దుస్థితి

1954 ముందు రికార్డుల కోసం రైతుల అగచాట్లు

కొందరి జేబులు నింపడానికే 22ఎ పేరిట నిషేధిత జాబితా!

**హైదరాబాద్ (ఎల్‌బినగర్ జోన్ ప్రతినిధి), అక్టోబరు 13 ప్రభాత వార్త:** ధరణి పోయి భూ భారతి వచ్చినా రైతులకు మాత్రం తిప్పలు తప్పడం లేదు. ముత్తాతల నుండి వారస్వతంగా వస్తున్న భూమిని 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడంతో వారంతా ఇప్పుడు ఆ భూమి తమదేనని నిరూపించుకోవాల్సిన దుర్భర పరిస్థితి నెలకొంది. నిషేధిత జాబితా నుండి తొలగించాలంటే చేత్వార్ కావాలని అధికారులు అడుగుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణి స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతిని తీసుకువచ్చింది. అయితే ప్రభుత్వం మారిన, వ్యవస్థ పేరు మారినా రైతులు, భూ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. ధరణితో మొదలైన సమస్యలు భూ భారతితో మరింత పెరిగాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ స్వంత పట్టా భూమి విషయంలో ఎలాంటి

>>2



మంగళవారం విజయవాడలో దుర్గమ్మను దర్శించుకున్న తమిళ సిఎం విజయ్

## తాగునీటి సరఫరాకు లోటు రానివ్వం

### ప్రజలు సహకరించాలి: సిఎస్ సంజయ్ జాజు

**హైదరాబాద్,అక్టోబరు13,ప్రభాతవార్త:** ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా హైదరాబాద్ కోర్ ఏరియాలో అన్ని ముందస్తు చర్యలు చేపట్టామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ, ప్రభుత్వ చర్యలకు ప్రజలందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి(ఎంఎంసి), సైబరాబాద్(సిఎంసి) మున్సిపల్ కార్పొరేషన్లలో తాగునీటి సరఫరా సన్నద్ధతపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ స్పెషల్ సిఎస్ దాన కిషోర్, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ కార్పొరేషన్ల కమిషనర్లు ఆర్.వి. కర్ణన్, వినయ్ కృష్ణారెడ్డి, సృజనతో పాటు నీటిపారుదల, గ్రామీణ నీటి సరఫరా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రిజర్వాయర్లలో నీటి లభ్యత తగ్గినప్పటికీ, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ నగర ప్రజలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ కోర్ ఏరియాకు ప్రధానంగా ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, మంజీరా, కృష్ణా, గోదావరి నదుల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామని, ఈ నీటి వనరుల పరిధిలో ప్రస్తుతం 560ఎంజీడీల నీటిలభ్యత ఉందని వివరించారు.

## ఇక ఆశలు ఈశాన్యం పైనే

>> రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు విస్తరించే అవకాశాలున్నాయని తెలిపారు. దక్షిణ, తూర్పు తెలంగాణ పరిధిలోని జిల్లాలతో పాటు, మధ్య తెలంగాణ ప్రాంతాల్లోనూ అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. అప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణం, రాత్రిపూట స్వల్ప చలి గాలులు కొనసాగినప్పటికీ, 17వ తేదీ తర్వాత ఆకాశం మేఘావృతమై ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉన్నట్లు అంచనా వేశారు. ఈశాన్య రుతుపవనాల రాకతో సీజనల్ మార్పులు చోటుచేసుకుంటున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడే వాతావరణ మార్పులు, తేమతో కూడిన గాలుల తీవ్రత వల్ల వివిధ జిల్లాలో వీటి ప్రభావం ఉంటుందని వెల్లడించారు. కాగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సాధారణం మించి గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గడచిన 24 గంటల్లో రాష్ట్రంలోని 20 జిల్లాల్లో 36 డిగ్రీల నుండి 37 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు చోటు చేసుకున్నాయి. మిగిఇన జిల్లాల్లో 34.8 డిగ్రీల నుండి 35.9 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు చోటు చేసుకున్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా హన్మకొండ జిల్లాలో 37.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

## 'సింగరేణి'కి దసరా కానుక

>> గరిష్ఠంగా 170 మంది సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన సింగరేణి అధికారుల కమిటీ సిఫార్సుల ఆధారంగా తగిన నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మెడికల్ ఇన్వాలిడేషన్ కోసం కార్మికులు కొత్తగూడెం వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సింగరేణి పరిధిలోని అన్ని ఏరియా ఆసుపత్రుల్లో ప్రతి నెలా నిర్ణీత రోజున మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కరోనా, ఇతర స్థానిక కారణాలతో ఉద్యోగాలు కోల్పోయిన కార్మికులను వన్‌టైమ్ ఆప్షన్ కింద తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు. కార్మికులకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి సేఫ్టీ కిట్స్ తప్పనిసరిగా పంపిణీ చేయాలని, కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి నిరక్ష్యానికి తావుండకూడదన్నారు. కార్మికుల పెర్క్స్, అలవెన్స్ లపై ఆదాయపన్ను సంస్థ తరఫున చెల్లించేలా చూడాలన్నారు. సింగరేణి పరిధిలోని ఏరియా ఆసుపత్రులను కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. సామాన్య కార్మికులకు సింగరేణి ఆసుపత్రుల్లోనే అత్యుత్తమ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. అత్యవసర వైద్యం కోసం కార్డియాక్, క్యాథ్ ల్యాబ్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామన్ని వెల్లడించారు. సింగరేణి పరిధిలోని పాత జిల్లాల్లో ప్రతి గ్రామంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్మికులతోపాటు వారి కుటుంబాలు, స్థానిక ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అధికారులకు పీఆర్పీ ను చెల్లించేలా యాజమాన్యం చర్యలు చేపడుతుందని వివరించారు. సింగరేణి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, ఆసుపత్రులు, ఇతర ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసి సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచాలని, ఓవర్‌బర్డెన్ గుట్టలను ఇందుకు ఉపయోగించుకోవాలని సూచించారు. సింగరేణి బొగ్గు ధరలు అధికంగా ఉండటంతో కొన్ని సంస్థలు ఇతర వనరుల నుంచి బొగ్గు కొనుగోలు చేసేందుకు మొగ్గుచూపుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో మార్కెట్ ధరలకు అనుగుణంగా సింగరేణి బొగ్గు ధరలను హేతుబద్ధీకరించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ధరలను సర్దుబాటు చేయకపోతే బొగ్గు కొనుగోలుదారులను కోల్పోయే ప్రమాదం ఉందని, తద్వారా సంస్థ ఆదాయం మరింత తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

## చంచల్‌గూడ జైలుకు అబ్దుల్లాపూర్‌మెట్ ఎమ్మార్వో, సర్వేయర్

**హైదరాబాద్,అక్టోబరు13,ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ ఎమ్మార్వో సుదర్శన్‌రెడ్డి, సర్వేయర్ శ్రీనివాసులుకు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. రూ.20 లక్షల లంచం తీసుకున్న కేసులో అరెస్ట్ అయిన ఎమ్మార్వో, సర్వేయర్‌లను ఏసీబీ అధికారులు న్యాయమూర్తి నివాసంలో హాజరుపరిచారు. న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారు.
అనంతరం ఆ ఇద్దరిని చంచల్ గూడా జైలుకు పోలీసులు తరలించారు. విచారణలో భాగంగా నింది తులకు మరోసారి ఏసీబీ కస్టడీకి తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

## 3 పిటిషన్లు డిస్మిస్

>> (ఎస్జీటీ) పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టులకు బీఈడీ, డీఈడీ అర్హతలున్న అభ్యర్థులు పోటీపడే అంశం వివాదానికి ప్రధాన కారణం అయింది. నోటిఫికేషన్ రిలీజ్ అయిన తర్వాత 2009 జనవరి 29వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 28ను జారీ చేసింది. ఈ జీవో నంబర్ 28 ద్వారా ఎస్జీటీ పోస్టుల్లో 30 శాతం పోస్టులను డీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులకు కేటాయిస్తూ.. మిగిలిన 70 % పోస్టులకు బీఈడీ, డీఈడీ అభ్యర్థులు పోటీపడే విధంగా నిబంధనల్లో మార్పులు చేసినట్లు పిటిషనర్లు పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత నియామకాలకు సంబంధించిన నిబంధనలను మార్చడం వల్ల తమకు నష్టం జరిగిందని కొందరు బీఈడీ అభ్యర్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యంగా రూల్ 7కు ప్రొవిజన్ జోడించడం.. జీవో నంబర్ 28 ద్వారా తీసుకొచ్చిన మార్పులు న్యాయబద్ధమైనవి కావని వారు వాదించారు. అసలు నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనల ప్రకారమే ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని కోరుతూ పలువురు అభ్యర్థులు న్యాయపోరాటం ప్రారంభించారు. తొలుత అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిన అనంతరం.. ఈ వివాదం న్యాయస్థానాల ముందుకు వెళ్లింది. డీఎస్సీ 2008 ప్రక్రియలో మెరిట్ సాధించినప్పటికీ.. నిబంధనల మార్పుల కారణంగా ఉద్యోగావకాశాలు కోల్పోయామని బీఈడీ అభ్యర్థులు తమ వాదనల్లో పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులను రద్దు చేసి.. మొదట ప్రకటించిన విధానం ప్రకారం ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. తాజాగా ఈ అంశానికి సంబంధించి దాఖలైన 3 రిట్ పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం ధర్మాసనం వాటిని కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయిన తర్వాత ఆయా ప్రభుత్వాలు తమ పరిధిలో నియామకాలకు సంబంధించిన చర్యలను కొనసాగించాయి. ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగులు కూడా ఇచ్చిన నేపథ్యంలో.. జీవో నంబర్ 28 సవరణకు సంబంధించి పిటిషనర్లు కోరిన విధంగా ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టుస్పష్టం చేసింది. ఈ తీర్పు వెలువడటంతో జీవో నంబర్ 28 రూల్ 7లోని నిబంధనలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ దాఖలైన తాజా 3 పిటిషన్లపై విచారణ ముగిసింది. అయితే ఈ తీర్పు ప్రభావం ఇప్పటికే నియామకాలు పొందినవారి పరిస్థితులు, భవిష్యత్ ప్రయోజనాలు, ఇతర సంబంధిత అంశాలపై ఎలా ఉంటుందన్నది పూర్తి తీర్పు, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వుల ఆధారంగా నిర్ధారించాల్సి ఉంటుంది. మొత్తంగా జీవో నంబర్ 28 సవరణను.. రూల్ 7కు ప్రొవిజన్ జోడించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన మూడు పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టివేయడం డీఎస్సీ 2008 నియామకాల అంశంలో ముఖ్యమైన పరిణామంగా నిలిచింది.

### వారం - వర్జ్యం

14-10-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆశ్వీయుజ మాసం, దక్షిణాయణం,
శరదృతువు, శుక్లపక్షం, చిత్త కార్తె,
తి. చవితి రా.1.15
న. అనూరాధ తె.4.04
వ.ఉ.6.08-ఉ.7.53
దు. ఉ.11.29-మ.12.16
రాహు మ.12.00-మ.1.30
శుభ లేదు

### వార్తాఫలం

**మేషం :** పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటారు. ఆర్థికంగా చెప్పుకోదగిన ఇబ్బందులేవీ ఏర్పడవు.

**వృషభం :** వాయిదాల మీద వాయిదా పడుతున్న కార్యక్రమాలను సానుకూల పరచుకుంటారు. చిరుతిండ్లకు ప్రాముఖ్యతనిస్తారు.

**మిథునం :** ధన వ్యయం అధికంగా వుంటుంది. వ్యాపారస్తులకు అనుకూలం. జీవితాన్ని కొత్తకోణంలో చూస్తారు.

**కర్కాటకం :** చిన్నపాటి ప్రయాణాలను సాగిస్తారు. గతానుభవం నేడు ఉపకరిస్తుంది. వాహనాలు కొనుగోలు చేస్తారు.

**సింహం :** స్థిరాస్తులకు సంబంధించిన అంశాలు సానుకూల పడతాయి. ప్రచారంలో ఉన్న పుకార్లను నమ్ముతారు.

**కన్య :** సాంకేతిక కారణాల వలన అపార్థాలు చోటు చేసుకుంటాయి. వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండండి.

**తుల :** సమాజంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. కొనుగోలు అమ్మకాల వలన లాభపడతారు.

**వృశ్చికం :** ఆర్థికంగా ఇబ్బందులేవీ ఏర్పడవు. వృత్తి, ఉద్యోగ వ్యాపారాల పరంగా కొత్త నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

**ధనుస్సు :** పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు ఆలోచింప చేస్తాయి. దైవ దర్శనం చేసుకుంటారు.

**మకరం :** గతంలో దూరమైన ఒక వర్గంతో తిరిగి నేడు సఖ్యత ఏర్పడుతుంది. గుప్తదానం చేస్తారు. వివాదాలకు దూరంగా ఉంటారు.

**కుంభం :** దురభ్యాసాలకు దూరంగా వుండాలని నిర్ణయించుకుంటారు. విదేశీ వ్యవహారాలు లాభిస్తాయి.

**మీనం :** స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండండి. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. ఆరోగ్యం జాగ్రత్త.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రైతులు లబోదిబో

>> చిన్న సమస్యలు తలెత్తినా అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ధరణి, ప్రస్తుత భూ భారతిలోని లోపాలను అడ్డుపెట్టుకుని రెవిన్యూవ్యవస్థ మొత్తం అవినీతి మయంగా మారుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. భూ రికార్డుల్లో తప్పులు, సవరణలు, హక్కుల నమోదు, మ్యుటేషన్, సర్వే వంటి వాటి కోసం నెలల తరబడి అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తుందని వాపోతున్నారు. పోర్టల్ పేరు, విధానాలు మారినప్పటికి క్షేత్ర స్థాయిలో భూ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**స్వంత భూమిపై కొత్తగా హక్కును నిరూపించుకోవాలా?**
ముత్తాతల నుండి వారసత్వంగా వస్తున్న భూమిని ధరణి, భూభారతి మాయజాలంతో ఇప్పుడు కొత్తగా వాటి యజమానులు తమదేనని నిరూపించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. పట్టా భూములపై ప్రభుత్వ పెత్తనం ఏంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్వంత భూమిపై సమస్యలు పరిష్కరించుకోవడానికి మేమెందుకు ఇన్ని తిప్పలు పడాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్నకు సమాధనం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. భూమి అనేది రైతుకు కేవలం ఆస్థి మాత్రమే కాదు. అది అతని జీవనాధారం..కుటుంబ భవిష్యత్తు. అలాంటి భూమి విషయంలో సమస్యలు తలెత్తితే సులభంగా పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు అతడిని మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. గతంలో ఉన్న వ్యవస్థ పేరు మార్చినంత మాత్రానా సమస్యలు తీరిపోవని ప్రభుత్వం గుర్తించాలి. పట్టా భూముల రికార్డుల్లో ఉన్న తప్పులు వెంటనే సరిచేయాలని, భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్దిష్టమైన గడువు ప్రకటించాలని, రైతుల భూములకు భద్రత కల్పించాలని, మధ్య వర్తుల ప్రమేయం లేకుండా, పారదర్శకంగా, అవినీతికి ఆస్కారం లేకుండా సమస్యల పరిష్కారానికి క్షేత్ర స్థాయిలో చర్యలు చేపట్టాలని రైతులు, భూ యజమానులు డిమాండ్ చేస్తున్నారు.

**కింది స్థాయి నుండి కలెక్టర్ వరకు..**
ధరణి, భూ భారతిలోని లోపాలను అడ్డుపెట్టుకుని కింది స్థాయి ఉద్యోగి నుండి కలెక్టర్ వరకు వ్యవస్థ మొత్తం అవినీతి మయంగా మారుతుందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎలాంటి సమస్యలు లేని భూములను కూడా పైసలు దండుకోవడానికే అధికారులు నిషేధిత జాబితాలో చేర్చారని భూ యజమానులు వాపోతున్నారు. కేవలం జేబులు నింపుకోవడానికే అధికారులు 22ఏ పేరిట నిషేధిత జాబితాను సృష్టించారని వారు ఆరోపిస్తున్నారు. కింది స్థాయి నుండి ఉన్నతాధికారుల వరకు కొందరి వద్ద పనులు కావాలంటే లంచం ఇవ్వాల్సిందేనన్న ఆరోపణలు ఉన్నాయి. ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి కూడా గతంలో తాను పనిచేసిన చోట భూ అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. భూ సమస్యలతోనే గతంలో ఒక తహాశీల్దార్‌ను సైతం పెట్రోలు పోసి హత్య చేసిన సంగతి తెలిసిందే. ధరణి ఉన్నప్పుడు భూ భారతి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు పలువురు తహాశీల్దార్లు, ఆర్ఐలు, జిపిఓలు లంచాలకు ఆశపడి ఎసిబి అధికారులకు పట్టుబడ్డారు.

**1954 ముందు రికార్డుల కోసం రైతుల ఆగచాట్లు..**
వారసత్వంగా 50 సంవత్సరాలకు పైగా తమ ఆధీనంలో ఉండి, సాగు చేసుకుంటున్న భూమిని నిషేధిత జాబితా నుండి తొలగించాలంటే మళ్లీ 1954కు ముందు ఉన్న పాత రికార్డులు చూపించాలని అధికారులు చెబుతుండడంతో, ఇప్పుడు వాటిని ఎలా తీసుకురావాలో..ఎక్కడకు వెళ్లాలో తెలియక రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గత పది సంవత్సరాల క్రితం నాటి భూ రికార్డులు, పహాణిలు, ఇతర పత్రాలు చూపిస్తే, అవి సరిపోవని మీ భూమి ఫిల్టర్ లిస్టులో ఉందని, 1954కు ముందు రికార్డులు తీసుకురావాల్సిందేనని అధికారులు తెగేసి చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత రికార్డుల కోసం ఏడి కార్యాలయాలు, ఎంఆర్ఓ ఆఫీసులు, ఇతర రెవిన్యూ కార్యాలయాల వద్దకు వెళ్తే అప్పటి రికార్డులు మా వద్ద లేవని సమాధానం వస్తుండడంతో, సమస్య ఎలా పరిష్కారమవుతుందో తెలియక రైతులు గగ్గోలు పెడుతున్నారు.

**తరతరాలు సాగుచేస్తున్న భూమికి మళ్లీ నిరూపణ ఎందుకు?**
తాతల కాలం నుండి వారసత్వంగా వచ్చిన భూములకు, దశాబ్దాలుగా సాగు చేసుకుంటూ అనుభవిస్తున్న భూములకు, ఇన్నేళ్లుగా తమ ఆధీనంలోనే ఉన్న భూములకు ఇప్పుడు మళ్లీ యాజమాన్య హక్కులను నిరూపించుకోవాలని చెప్పడం అత్యంత దారుణమని, దీని వల్ల తాము తీవ్ర మానసిక వత్తిడికి గురవుతున్నామని రైతులు కన్నీళ్ల పర్యంతమవుతున్నారు. పాత రికార్డుల పేరుతో కార్యాలయాల చుట్టూ తిప్పకుండా, అందుబాటులో ఉన్న పహాణీలు, పట్టాదారు పాసు పుస్తకాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, వారసత్వ ఆధారాలు, చట్టబద్ధమైన ఇతర ప్రత్యామ్నాయ ఆధారాలను పరిశీలించి, సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసి తగిన న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

**రికార్డులు లేకపోతే బాధ్యత రైతులదా?**
1954కంటే ముందున్న రికార్డులు లేవని అధికారులే చెబుతున్నప్పుడు వాటిని రైతులు ఎక్కడ నుండి తీసుకువస్తారన్న ప్రశ్నకు అధికారులే సమాధానం చెప్పాలి. పాత రికార్డులు లేకపోతే రైతు ఎలా బాధ్యత వహిస్తాడో అధికారులకే తెలియాలి. ఇప్పటికైనా భూ భారతిలోని లోపాలను, సాంకేతిక సమస్యలను సవరించి రైతులకు, భూ యజమానులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

## డబుల్ డెక్కర్ కారిడార్‌కు ఓకే

>> ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కేంద్ర మంత్రి నితిన్‌గడ్కారితో కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమావేశంతో తెలంగాణలో రహదారి ప్రయాణాన్ని మరింత సులభతరం చేయడం, ప్రజలకు ప్రయాణ సమయాన్ని తగ్గించడం, మెరుగైన రహదారులు, గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాల వరకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్రానికి అవసరమైన కీలక రహదారులు, వంతెనలు, ఎలివేటెడ్ కారిడార్లు, రోప్‌వేలు సహా పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై తెలంగాణలో రహదారి కనెక్టివిటీని మెరుగుపరిచి, ప్రజల ప్రయాణ కష్టాలను తగ్గించడంతో పాటు రాష్ట్ర ఆర్థిక, పర్యాటక అభివృద్ధికి దోహదపడే పలు ప్రతిపాదనలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించి, పలు ప్రాజెక్టులకు ఆమోదం తెలపడంతో పాటు సంబంధిత అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. ఎల్బీనగర్-హయత్‌నగర్ ఎలివేటెడ్ కారిడార్ కు ఆమోదం లభించడంతో 2027 జనవరిలో ఎన్‌హెచ్65 విస్తరణ ప్రారంభం చేయడానికి మార్గం సుగమం అయింది. సోమశిల వద్ద కృష్ణా నదిపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణంతో ప్రయాణ దూరం, సమయం తగ్గడమే కాకుండా పర్యాటకరంగం అభివృద్ధిచెందే అవకాశం ఏర్పడుతోంది. కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన శంకుస్థాపన కోసం మంత్రి చేసిన ప్రతిపాదనకు కేంద్ర మంత్రి అంగీకారం తెలిపారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతంలో సోమశిల నుంచి సంగమేశ్వర వరకు నిర్మించే ఈ బ్రిడ్జి ద్వారా తిరుపతి వెళ్లే వారికి సుమారు 80కి.మీ దూరం తగ్గి, దాదాపుగా 3 గంటల ప్రయాణ సమయం తగ్గుతుందని మంత్రి వివరించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన సోమశిల ఆలయం వద్ద పర్యాటక రంగం అభివృద్ధి చెంది తెలంగాణలో ఒక మైలురాయిగా నిలవనుందని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తో కలిసి మంత్రి కోమటి రెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు. పర్యాటకం అభివృద్ధి చెందడంతో స్థానికంగా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడనున్నాయనీ, ఆర్థిక కార్యకలాపాలకు కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయనీ తెలిపారు. హైదరాబాద్-శ్రీశైలం ఎన్‌హెచ్ 765పై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన విజ్ఞప్తిపై నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కొత్త డిపిఆర్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సేతు బంధన్ పథకం కింద తెలంగాణలో మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి కేంద్ర మంత్రి ఆమోదం తెలిపారు. రైల్వే గేట్ల వద్ద వాహనదారులు ఎదుర్కొనే నిరీక్షణను తగ్గించి, రహదారి భద్రతను మెరుగుపరచడానికి ఈ వంతెనలు దోహదపడనున్నాయి. రాష్ట్రంలో 34 రహదారి పనులకు సిఆర్ఐఎఫ్ నుంచి నిధులు మంజూరు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కేంద్ర మంత్రిని కోరారు. దీనిపై స్పందించిన నితిన్ గడ్కరీ సంబంధిత కేంద్ర అధికారులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా పుల్లూరు-అలంపూర్- జటప్రోలు -పెంట్లవెల్లి- కొల్లాపూర్- లింగాల- అచ్చంపేట- డిండి- దేవరకొండ- మల్లేపల్లి- నల్గొండ రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలన్న ప్రతిపాదనను మంత్రి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రతిపాదనపై కూడా నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు. నవంబర్ 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో జరగనున్న ఇండియన్ రోడ్ కాంగ్రెస్ కార్యక్రమానికి హాజరుకావాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఆహ్వానించారు. ఈ ఆహ్వానంపై సానుకూలంగా స్పందించిన గడ్కరీ, కార్యక్రమానికి హాజరవుతానని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, రహదారుల అధికారులు, రాష్ట్ర అధికారులు పాల్గొన్నారు.



న్యూఢిల్లీలో మంగళవారం ఇండియా కూటమిభేటీలో ఖర్గే, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ

# ఉచ్చు బిగుస్తోంది

>> దాడి చేయవచ్చుని, ప్రజలు తమ ఓటు హక్కు కోసం వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపినా వారిని మౌనంగా ఉంచవచ్చుని బీజేపీ భావిస్తే అది పొరపాటేనని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను బీజేపీ దెబ్బతీయవచ్చు. కానీ భారతదేశాన్ని ప్రజాస్వామ్య దేశంగా తీర్చిదిద్దేందుకు, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు పోరాడి ప్రాణత్యాగాలు చేసిన సామాన్య ప్రజలు దొంగిలించిన ప్రజా తీర్పును లేదా రాజీపడిన ప్రజాస్వామ్యాన్ని అంగీకరించడానికి సిద్ధంగా లేరని నేహా బోరా వ్యాఖ్యానించారు. ఇండియా కూటమి హైటీ సమావేశం అనంతరం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ కూటమి ఇటీవల నిర్వహించిన కార్యక్రమాలు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాయని, ఉద్యమానికి ప్రజల నుంచి గణనీయమైన మద్దతు లభించిందని తెలిపారు. మోడీ ఓట్ల చోరీ ప్రణాళికను పూర్తిగా బయటపెట్టేందుకు ఇప్పుడు అందరూ సిద్ధంగా ఉన్నారని ఖర్గే అన్నారు. ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ మాట్లాడుతూ బీజేపీ అగ్రనాయకత్వం సూచనల మేరకు జ్ఞానేశ్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు మేమంతా ఐక్యంగా ఉన్నాం. అవసరమైన ఎలాంటి త్యాగాలకైనా మేమంతా కలిసి సిద్ధంగా ఉన్నామని తేజస్వి యాదవ్ అన్నారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా మాట్లాడుతూ దేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లే మార్గాలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. ఢిల్లీ దేశ రాజధాని. ఇది మన నగరం. అయినప్పటికీ ఎక్కడ చూసినా బారికేడ్లు ఏర్పాటు చేశారు. నిరసనలు జరుగుతాయి. వాటిని మీరు అణచివేయలేరని ఆయన అన్నారు. సీపీఐ(ఎం) నేత ఎం.ఏ. బేబీ కూడా జ్ఞానేశ్ కుమార్ అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జ్ఞానేశ్ కుమార్ అధికార పార్టీ బృందంలో చేరిపోయారు. ఆయన ఓట్లను, నిరసన స్థలాన్ని, ప్రజాస్వామ్యాన్ని దొంగిలిస్తున్నారని ఎం.ఏ. బేబీ అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్నికల సంఘం దేశంలో స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల వ్యవస్థను దెబ్బతీస్తోందని ఎంపీ సాగరికా ఘోష్ ఆరోపించారు. ఆయనను పదవి నుంచి తొలగించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ మాట్లాడుతూ.. జ్ఞానేశ్ కుమార్ వ్యవస్థ మొత్తాన్ని నేరపూరితంగా మార్చేశారని ఆరోపిస్తూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, పౌర సమాజ సంస్థలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి తమ ఉద్యమాన్ని మరింత విస్తృతం చేయాలని ఇండియా కూటమినేతలంతా నిర్ణయించారని ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కుల అంశాలపై తమ ప్రచారాన్ని కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

## ఆ రెండు సీట్లు గెలవాలి

>> నిర్వహించారు. ఢిల్లీలో అందుబాటులో ఉన్న నేతలతో సీఎం, పీసీసీ అధ్యక్షుడు సమావేశమయ్యారు. గంటకుపైగా కొనసాగిన సమావేశంలో వివిధ అంశాలు చర్చకు వచ్చాయి. ఈ సమావేశంలో మంత్రులు, ఎమెల్యేలు సైతం పాల్గొన్నారు. గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికలను తేలికగా తీసుకోవద్దని, రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల గెలుపే లక్ష్యంగా పని చేయాలని మంత్రులకు, ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లు దిశానిర్దేశం చేశారు. ఎవరి పరిధిలో వాళ్లు గట్టిగా పని చేయాలని, పట్టభద్రుల ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దని సీఎం స్పష్టం చేశారు. ఓటర్ల నమోదు నుంచి పోలింగ్ వరకు ప్రతి విషయంలోనూ ప్రత్యేక దృష్టి పెట్టాలని రేవంత్ రెడ్డి నాయకులకు సూచించారు. నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, హైదరాబాద్ రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల పట్టభద్రుల స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సామా రామ్మోహన్ రెడ్డిలు పోటీ చేస్తున్నారు. ఇప్పటికే ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ప్రారభించడంతోపాటు ఆయా నాయకులతో సమావేశమవుతూ తమ గెలుపునకు కృషి చేయాలని కోరుతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలతో గంటకు పైగా జరిగిన సమీక్ష సమావేశంలో పట్టభద్రుల ఎన్నికలతో పాటు రాష్ట్రంలోని కరవు పరిస్థితులు, విద్యుత్తు కొరత లాంటి అంశాలు కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ అంశాలపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలను ఎక్కడక్కడ తిప్పి కొట్టాలని ఆదేశించారు.
ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న ఆరు ఉమ్మడి జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు సమన్వయంతో పని చేయాలని, రెండు స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించేలా ఇప్పటి నుంచే కార్యాచరణతో ముందుకెళ్లాలని సీఎం సూచించారు. పలు అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ నేతలకు దిశానిర్దేశం చేశారు.

**ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ మాస్టర్ ప్లాన్**
తెలంగాణలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై అధికార కాంగ్రెస్ పార్టీ కసరత్తు వేగం పెంచింది. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఉమ్మడి హైదరాబాద్‌రంగారెడ్డి మహబూబ్నగర్: నల్గొండ వరంగల్ ఖమ్మం స్థానంలో గెలిచేందుకు ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే ఈ రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన పార్టీ.. వారిని గెలిపించుకోవడంపై దృష్టి సారించింది. ఈ క్రమంలో తాజాగా ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్, నల్గొండ, వరంగల్, ఖమ్మం ఈ ఆరు జిల్లాల్లోని నియోజకవర్గాల్లో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియను పర్యవేక్షించేందుకు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కోఆర్డినేటర్లను నియమించింది. ఈ మేరకు మంగళవారం టీపీసీసీ ఆదేశాలు ఆదేశాలు జారీ చేసింది. ఈ నియామక ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ తెలిపారు.

## దసరా తర్వాత ఓటు చోరీపై తెలంగాణలో భారీ బహిరంగ సభ

### ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన సిఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు

**హైదరాబాద్,అక్టోబరు13,ప్రభాతవార్త:** ఓటు చోరీపై తర్వాత రాష్ట్రంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. సభకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరువుతారని చెప్పారు. ఓటు హక్కు కోల్పోయిన వారిని చూపించండీ అని తెలంగాణ బిజెపి చీఫ్ రాంచందర్‌రావు విసిరిన సవాల్ స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తెలంగాణలో ఎన్ని ఓట్లు తొలగించారో తమ వద్ద లెక్కలు ఉన్నాయని చెప్పారు. ఓటు చోరీ అంశంపై ప్రజలకు వాస్తవాలు వివరిస్తామన్నారు. సోమవారం ఢిల్లీలో నిరసన ర్యాలీ ముగిసిన అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌కు తిరిగి వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలతో నాయకులంతా ఢిల్లీలోనే ఉండిపోయారు. మంగళవారం సాయంత్రం రాహుల్ గాంధీ నివాసంలో ఇండీ కూటమి నాయకుల సమావేశం ముగిసిన తర్వాత రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వానికి తిరుగు ప్రయాణంపై స్పష్టత వచ్చింది. దీంతో మూడు రోజులుగా ఢిల్లీలో ఉన్న నాయకులు మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. ఏఐసీసీ పిలుపు మేరకు ఆదివారం ఢిల్లీ వెళ్లిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, డీసీసీ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ నాయకులు తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను, రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు కలిశారు.



బతుకమ్మ వేడుకల్లో భాగంగా నాలుగో రోజు హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లోని లలిత కళాతోరణంలో 'నానబియ్యం బతుకమ్మ' ఆడుతున్న మహిళలు

# 2029లోను ఎన్డీయేదే విజయం

## 'సర్' మాటున చొరబాటుదార్లకు రక్షణ కల్పిస్తున్న కాంగ్రెస్

## విపక్షాల వ్యూహాలు ప్రజలకు అర్థమవుతున్నాయి: అమిత్‌షా



**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** లోక్‌సభకు 2029లో రానున్న ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీఏ) భారీ మెజారిటీతో విజయం సాధిస్తుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ప్రతిపక్ష పార్టీలపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను అడ్డుపెట్టుకుని చొరబాటుదారులకు రక్షణ కల్పించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని అమిత్ షా ఆరోపించారు. ప్రతిపక్షాల వ్యూహాలను ప్రజలు పూర్తిగా అర్థం చేసుకున్నారని, ఇకపై వారి మాయమాటలకు మోసపోరని అన్నారు. ఎస్ఐఆర్ పేరుతో చొరబాటుదారులకు రక్షణ కల్పించాలన్న మీ వ్యూహాన్ని దేశ ప్రజలు పూర్తిగా అర్థం చేసుకున్నారని ఇకపై మీ ఎత్తుగడలకు వారు మోసపోరని అమిత్‌షా అన్నారు. రాహుల్ గాంధీ, ఆయన సహచరులు 2029లో ఘోర పరాజయానికి సిద్ధంగా ఉండాలన్నారు.

ఆ ఎన్నికల్లో ఎన్డీఏ భారీ మెజారిటీ సాధిస్తుంది. కాంగ్రెస్ వరుసగా నాలుగోసారి ఓటమి చవిచూడబోతోందని అమిత్ షా సెటైర్లువేసారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలపైనా అమిత్ షా విమర్శలు చేశారు. 14 రాజకీయ పార్టీల కార్యకర్తలను సమీకరించి, కేవలం ఒకటిన్నర కిలోమీటర్ల పరిధిలో సుమారు 8 వేల మందిని కూడగట్టినంత మాత్రాన వారంతా దేశ ప్రజల గొంతుకగా మారలేరని అన్నారు. దేశ ప్రజల గొంతుక గ్రామాల్లో, వ్యవసాయ క్షేత్రాల్లో, మారుమూల కొండ ప్రాంతాల్లో, అడవుల్లో, నదీ తీరాల్లో కూడా వినిపిస్తుందని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు తగినంత ప్రజాదరణ, చేరువ లేదని విమర్శించారు. త్రిపుర, రాజస్థాన్, గుజరాత్, పశ్చిమ బెంగాల్, అసోం రాష్ట్రాల ఓటర్లకు అమిత్ షా కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతికూల ప్రచారం జరిగినప్పటికీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, బీజేపీ, ఎన్డీఏకు ప్రజలు మద్దతుగా నిలిచారని అన్నారు. భారతీయ జనతా పార్టీ తరఫున త్రిపుర, రాజస్థాన్, గుజరాత్, బెంగాల్, అసోం ప్రజలకు మరోసారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియ జేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ రాష్ట్రాల్లోని ప్రజలు బీజేపీ ఎన్నికల గుర్తు అయిన కమలం, ఎన్డీఏకు మద్దతు తెలిపి, జాతీయవాద శక్తులను బలోపేతం చేశారని అమిత్ షా అన్నారు.

# రిటైర్డ్ ఉద్యోగుల చలో సెక్రటేరియట్

## సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళన

## అరెస్ట్ చేసిన పోలీసులు

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన చేశారు. ఈ మేరకు దీనికి సంబంధించి తెలంగాణ సచివాలయం వద్ద మంగళవారం రిటైర్డ్ ఉద్యోగులు ఆందోళనకు దిగారు. రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు చేపట్టిన చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి విశ్రాంత ఉద్యోగులు తరలివచ్చారు. పదవీ విరమణ చేసి రెండేళ్లకు పైగా గడుస్తున్నా తమకు రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్, పీఆర్సీ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయడం లేదని నిరసన వ్యక్తం చేశారు. సచివాలయం వద్ద ఆందోళనకు దిగిన విశ్రాంత ఉద్యోగులను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దాదాపు 26,000 మంది ప్రభుత్వ పెన్షనర్లు 2024 మార్చి నుండి రావాల్సిన బకాయిల కోసం సుదీర్ఘకాలంగా పోరాడుతున్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్లు సమయానికి అందకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 105 మంది విశ్రాంత ఉద్యోగులు తీవ్ర అనారోగ్యం, క్యాన్సర్ వంటి వ్యాధులతో బాధపడుతూ సరైన వైద్యం అందక మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిటైరై రెండున్నరేళ్లు దాటినా ప్రభుత్వం ఏ ఒక్కరికీ పూర్తిస్థాయిలో బకాయిలు చెల్లించలేదని మండిపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, పెన్షనర్ల 4 ప్రధాన సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం వేధిస్తోందని ధ్వజమెత్తారు. తమకు రావాల్సిన న్యాయమైన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేకపోతే పోరాటాన్ని మరిన్ని రూపాల్లో తీవ్రతరం చేస్తామని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం హెచ్చరించింది.

## అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాలకు 50 వెయిటేజీ మార్కులు

హైదరాబాద్, అక్టోబరు 13,ప్రభాతవార్త: విశ్వవిద్యాలయాల్లో బోధన సిబ్బంది నియమకాలకు యూనివర్సిటీ గ్రాంట్ కమీషన్ నిబంధనలను అనుసరించి రాష్ట్రలోని 12 విశ్వవిద్యాలయాల్లో ఏకరూపకతతో కనీసఅర్హత మార్గదర్శకాలను రూపొందించి తెలంగాణ ప్రభుత్వకార్యదర్శి యోగితారాణా జిఒ.ఎంఎస్,నెం31 తేది13.19206ను విడుదల చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ నియమాకాలతో పాటు ఇతర బోధన సిబ్బంది నియామకాలకు 50శాతం వెయిటేజి మార్కులు ఇస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.

# కేంద్రమంత్రి ఎల్.మురుగన్ రాజీనామా

## తమిళనాట క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యం

**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** కేంద్ర సమాచార, ప్రసార శాఖతోపాటు పార్ల మెంటరీ వ్యవహారాల శాఖ సహాయమంత్రిగా ఉన్న ఎల్.మురుగన్ మంత్రి పదవికి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. తాను తిరిగి క్షేత్ర



స్థాయికి వెళ్లి పనిచేయాలనుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ప్రధాని నరేంద్రమోడీకి ఇదే విషయాన్ని విన్నవించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కేంద్ర సహాయ మంత్రి పదవి, రాజ్యసభ సభ్యత్వ బాధ్యతల నుంచి తనను తప్పించాలని ఆయన కోరినట్లు సమాచారం. తమిళనాడులో పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు పూర్తి సమయం కేటాయించాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని మురుగన్ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత మాతకు, తమిళ నాడుకు సేవ చేయడం నా జీవితంలో అత్యంత గొప్ప గౌరవమని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. ఇప్పుడు నేను తిరిగి క్షేత్రస్థాయికి వెళ్లాలని, పార్టీ కార్యకర్తలతో కలిసి పనిచేయాలని కోరుకుంటున్నాను. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందు తమిళనాడులో బీజేపీని బలోపేతం చేసేందుకు పూర్తి సమయం అంకితం చేయాలనుకుంటున్నాను. దేశమే ప్రథమం పార్టీ తర్వాత వ్యక్తిగత ప్రయోజనాలు చివరనేనని మురుగన్ పేర్కొన్నారు. కేంద్రంలో త్వరలో భారీస్థాయిలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగవచ్చన్న ఊహాగానాల నేపథ్యంలో మురుగన్ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.

## నిజామాబాద్ టౌన్‌లో చెత్తకుప్పలో పేలుడు..

# యాచకురాలు మృతి

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం ఉదయం చెత్త కుప్పలో జరిగిన పేలుడులో యాచకు రాలు మరణించింది. పట్టణంలో చెత్త ఏరుకోవడంతోపాటు యాచన చేసుకుంటూ జీవనం సాగించే అనిత (55) ఉదయం తొమ్మిది గంటల సమయంలో జిల్లా కేంద్రం సమీపంలో గల చౌరస్తా వద్ద చెత్తకుప్పలో చెత్త ఏరుకుం టున్న సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ అనితను స్థానికులు గమనించి పోలీసు సహాయంతో ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె చనిపోయింది. అనిత మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. కాగా పేలుడుకు గల కారణాలు ఇంకా తెలియ రాలేదని పోలీసులు తెలిపారు. పేలుడు తరువాత చెత్త కుప్పలో ఇంకా ఏమైనా పేలుడు పదార్థాలు వున్నాయా? అని పోలీసులు గాలించగా ఎలాంటి వస్తువులు లభ్యం కాలేదు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# హైవే హోటళ్లు, ధాబాల్లో ఎలుకలు, బొద్దింకలు, ఈగలు

## విజయవాడ దారిలో టిజి సేఫ్ జరిపిన దాడుల్లో విస్తుబోయే వాస్తవాలు

## నాలుగు హోటళ్లు జప్తు



**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కల్తీ ఆహార వస్తువులతో పాటు నకిలీ మందుల విక్రయాలపై ఉక్కుపాదం మోపేందుకు స ర్కారు కొత్తగా ఏర్పాటు చేసిన రాష్ట్ర స్టాండర్డ్స్ అ థారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టిజి సేఫ్) అధికారులు మంగళవారం నాడు వి జయవాడ జాతీయ రహదారిపై కొయ్యలగూడెం నుంచి కోదాడ వరకు గల హోటళ్లు, దాబాలపై మెరుపు దాడులు నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి కొనసాగిన ఈ దాడులు సాయంత్రం వరకు సాగాయి. ఈ సందర్భంగా అన్నిచోట్ల ఎలుకలు, బొద్దింకలు, ఈగల మధ్య వంటకా ల తయారీ జరుగుతున్నట్లు తేలింది.. ఇదే సమయంలో అన్నిచోట్ల అపరిశుభ్ర వాతావరణం, నాణ్యతా లోపాలను చూసిన అధికారులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పలుచోట్ల పురుగులు పట్టిన ఆహార పదార్థాలు, హోటళ్ల స్టోర్ రూమ్‌లలో ఎలుకలు, బొద్దింకలు స్వేచ్ఛగా సంచరిస్తుం డటం అధికారుల కంటపడింది. ఈగలు, దోమలు ముసురుతుండగా వంటకాలు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. నాణ్యతా ప్రమాణాలు పూర్తి గా గాలికి వదిలేసి, పురుగులు పట్టిన నాసిరకం పప్పు ధాన్యాలతో ఆహారాన్ని తయారు చేస్తుండటం పట్ల అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చే శారు. నిబంధనలకు విరుద్ధంగా మాంసాహారం, డెయిరీ ఉత్పత్తులను నిల్వ ఉంచడమే కాకుండా, అంతకు ముందు రోజు వండిన ఆహారాన్ని నిలువ వుంచి వాటినే వేడిచేసి కస్టమర్లకు వడ్డిస్తున్నట్లు తేలింది. దీంతో పాటు పలుచోట్ల భారత ఆహార భద్రతా ప్రాధికార సంస్థ జారీ చేసిన లైసెన్సుల గడువు ముగిసినప్పటికీ అక్రమంగా హోటళ్ల వ్యాపారాన్ని కొనసాగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కాగా నిబంధనల మేరకు నడ వని నాలుగు హోటళ్లను అధికారులు జప్తు చేశారు. మరో ఆరింటికి షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాటు, వంటగదుల్లో పరిశుభ్రతను మెరుగుపరచుకోవాలని నోటీసులు అందించారు.

## నిజామాబాద్‌లోని కంఠేశ్వర్ రైల్వే అండర్ పాస్ విస్తరణ

## 16వ తేదీ నుంచి 45 రోజులపాటు మూసివేత

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** నిజామాబాద్ పట్టణంలోని కంటేశ్వర్ రైల్వే అండర్ పాస్ విస్తరణ పనుల కారణంగా ఈ నెల 16వ తేదీ నుంచి 45 రోజుల పాటు మూసివేస్తున్నట్లు జిల్లా పోలీసు కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన వి డుదల చేశారు. ఈ నేపథ్యంలో నిజామాబాద్ పట్టణంలో హైదరాబాద్, ఆర్మూర్, నిర్మల్, ఆదిలాబాద్, కరీంనగర్, కామారెడ్డిల నుంచి వచ్చే వాహనాలు నేరుగా పాతదారి వెంట ప్రయాణం సాగించి బస్ స్టాండ్‌కు రావాల్సి వుంటుంది. దీంతో పాటు నిజామాబాద్ నుంచి ఆర్మూర్, కరీ ంనగర్, ఆదిలాబాద్, నిర్మల్, కామారెడ్డి, హైదరా బాద్ వైపు వెళ్లే వాహనాలు దేవి రోడ్డు రైల్వే ఫ్లై ఓవర్‌ను వాడుకుని దుబ్బ, శివాజి విగ్రహం మీదుగా వెళ్లాల్సి వుంటుంది. హైదరాబాద్, కామారెడ్డి వెళ్లే వాహనాలు ఎన్టీఆర్ చౌరస్తా, కోర్టు చౌరస్తా నుంచి మాదవనగర్ బైపాస్ దాటి హై దరాబాద్ మార్గంలో వెళ్లాల్సి వుంటుంది. బోధన్, బాన్సువాడ, వర్ని వెళ్లే వాహనాలు పాత మార్గాన్నే ఉపయోగించుకోవాల్సి వుంది. ఈ క్రమ ంలో ఎవరికైనా ఇబ్బందులు తలెత్తితే ఆర్టీసీ కంట్రోల్ రూం నంబర్ 9959226022, పోలీసు కంట్రోల్ రూం నంబర్ 8712659700 లేదా 085462..226090కు నిజామాబాద్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ నంబర్ 8712659842 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని కమిషనర్ సాయి చైతన్య తెలిపారు.

# మూడు రోజుల ఎసిబి కస్టడీకి లక్ష్మీభాస్కర్

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** అక్రమాస్తుల కేసులో అరెస్టయి చంచల్‌గూడ జైల్లో రిమాండులో వున్న నిమ్స్ అదనపు మెడికల్ సూపరిం టెండెంట్ నోరి లక్ష్మీభాస్కర్‌ను మూడు రోజుల కస్టడీ నిమిత్తం ఎసిబి అధికారులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. గత నెల 22వ తేదీన లక్ష్మీ భాస్కర్‌ను ఎసిబి అధికారులు అరెస్టు చేయడం తెలిసిందే. నిమ్స్‌లో 20 యేళ్లకుపైగా వివిధ హోదాల్లో పనిచేస్తూ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ స్థాయికి ఎదిగిన లక్ష్మీభాస్కర్‌పై వచ్చిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఎసిబి ఆయనను అరెస్టు చేయడంతో వం ద కోట్ల రూపాయలకుపైగా అక్రమాస్తులను జప్తు చేయడం విదితమే. కాగా లక్ష్మీభాస్కర్‌పై వచ్చిన అభియోగాల్లో అనేకం తీవ్రమైనవి కావడంతో ఆయ నను కస్టడీలోకి తీసుకుని విచారించాలని నిర్ణయించిన ఎసిబి ఇందుకు గానూ నాంపల్లి ఎసిబి కోర్టులో పిటిషన్ దాఖలు చేసి అనుమతి పొందారు. ఈ కేసులో లక్ష్మీ భాస్కర్‌కు బినామీలుగా వున్న నిమ్స్‌కు చెందిన ఐదుగురు ఉద్యోగుల ఇళ్లపై దాడులు చేసిన ఎసిబి అధికారులు వారి వద్ద నగదుతోపాటు భారీగా ఆస్తి పత్రాలను జప్తు చేశారు. కరోనా సమయంలో ఆసుపత్రిలో రోగులకు అందజేయాల్సిన కిట్ల గోల్‌మాల్ జరిగిందని, ఇందులో కోట్ల రూపాయలు చేతులు మారిందని, ఇందులో లక్ష్మీభాస్కర్ హస్తం వుందని అభియోగాలు వచ్చాయి. దీంతోపాటు నిమ్స్‌లో కీలక హోదాలో వున్న ఆయన తన పలుకు బడితో అనేక విభాగాల్లో అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఎసిబికి సమాచారం అందింది. ఇందులోని నిజా నిజాలను వెలికితీసేందుకు ఎసిబి అధికారులు లక్ష్మీభాస్కర్‌ను కస్టడీలోకి తీసుకున్నారు. నిబంధనల మేరకు లక్ష్మీభాస్కర్‌ను ఎసిబి అధికారులు మంగళవారం ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి కస్టడీలోకి తీసుకుని నేరుగా ఉస్మానియా ఆసుపత్రికి తరలించి అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల్లో లక్ష్మీభాస్కర్‌కు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని నిర్ధారణ అయ్యాక నేరుగా ఎసిబి కార్యాలయా నికి తరలించారు. కాగా లక్ష్మీభాస్కర్ కస్టడీ గురువారంతో ముగియనుంది.

# ఇండియా కూటమి నేతలకు రాహుల్ తేనీటి విందు

**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇండియా కూటమి పోరాటాన్ని మరోస్థాయికి తీసుకెళ్తున్నారు. డెమోక్రసీ మార్చ్ పేరిట భారీ ప్రదర్శన, సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విపక్షాలు, మంగళవారం కీలక సమావేశం నిర్వహిస్తున్నాయి. రాహుల్ గాంధీ తన నివాసంలో ఇండియా కూటమి ఎంపీలు, పౌర సమాజ సభ్యులు, విద్యార్థి సంఘాల నేతలకు టీ విందు ఏర్పాటు చేశారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు న్యూఢిల్లీలోని 5, సునేహ్రీ బాగ్ రోడ్‌లోని తన నివాసానికి రావాల్సిందిగా రాహుల్ గాంధీ స్వయంగా నేతలను ఆహ్వానించారు. ఇండియా కూటమి నేతల సంయుక్త ప్రెస్ కాన్ఫరెన్స్ ముగిసిన తర్వాత ఈ టీ విందు సమావేశం జరగనుంది. ఓట్ చోరీ ఆరోపణలపై ఉమ్మడి నిరసన వ్యూహాన్ని ఖరారు చేయడం, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేయడం వంటి అంశాలపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించనున్నట్లు సమాచారం. అంతకుముందు ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో ఇండియా కూటమి ఆధ్వర్యంలో మార్చ్ ఫర్ డెమోక్రసీ జరిగింది. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మమతా బెనర్జీ, అఖిలేష్ యాదవ్, తేజస్వి యాదవ్, డి.రాజా, సుప్రియా సూలే వంటి అగ్రనేతలు హాజరైన ఈ ర్యాలీని పోలీసులు భగవాన్ దాస్ రోడ్ వద్ద బారికేడ్లతో అడ్డుకున్నారు. అనంతరం నేతలు సుప్రీంకోర్టుకు వెళ్లి, ఎన్నికల కమిషన్, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఇద్దరు కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషీలపై పిటిషన్ దాఖలు చేశారు. ఈ అంశం కోర్టు విచారణలో వుండడంతో నేతలతో సమావేశమయ్యేందుకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నిరాకరించారు. ఈ నేపథ్యంలో, ఎస్ఐఆర్‌లో జరిగిన అవకతవకలపై తమ పోరాటాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని, దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని విపక్ష కూటమి భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ టీ సమావేశం భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేయనుంది.

# వైఎస్ వివేకా హత్య కేసులో కొనసాగుతున్న ఇడి దర్యాప్తు

## వైసిపి నేత భాస్కర్‌రెడ్డిని 8 గంటలపాటు విచారించిన అధికారులు

## నేడు కడప ఎంపి అవినాష్‌రెడ్డి హాజరు

**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మాజీ మంత్రి వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ వేగం పుంజుకుంది. వివేకా హత్యకు 40 కోట్ల రూపాయల చెల్లింపులు జరిగినట్లు నిర్ధారణ అవడంతో మనీలాండరింగ్ కోణంలో సాగుతున్న ఈడీ విచారణకు మంగళవారం నాడు వైకాపా నేత భాస్కర్ రెడ్డి హాజరయ్యారు. ఉ దయం 11 గంటల సమయంలో బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి ఆయన రాగా రాత్రి ఏడు గంటల వరకు విచారణ కొనసాగింది. వివేకా హత్య కేసులో నిందితుల గురించి సిబిఐ విచారిస్తుండగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ విచారణ సాగుతుండడం తెలిసిందే. ఈ కేసులో 20 20 రోజుల వ్యవధిలో ఎ1గా వున్న ఎర్ర గంగిరెడ్డి, ఎ2గా వున్న సునీల్ యాదవ్, అప్రూవర్‌గా మారిన దస్తగిరితో పాటు ఎ5గా వున్న దేవిరె డ్డి శివశంకర్ రెడ్డిని విచారించిన ఈడీ అధికారులు తాజాగా కడప ఎంపి అవినాష్ రెడ్డి తండ్రి భాస్కర్ రెడ్డిని భిన్న కోణాల్లో ప్రశ్నించారు. వివే కానంద రెడ్డి హత్య కేసులో నిందితులకు 40 కోట్ల రూపాయలను చెల్లించినట్లు ఆధారాలు సేకరించిన ఈడీ అధికారులు ఈ డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయి...? ఎవరు సమకూర్చారు...? అనే అంశాలపై భాస్కర్ రెడ్డిని ప్రశ్నించారని తెలిసింది. 2019లో జరిగిన వివేకానంద రెడ్డి హత్యకు సంబంధించి 40 కోట్ల రూపాయల సుఫారిపై ఈడీకి పక్కా ఆధారాలు లభించడం తెలిసిందే. దీనికి సంబంధించి ఫండింగ్ వ్యవహారాలు, ఫోన్ కాల్స్, డిజిటల్ ఆధారాలపై దృష్టి సారించిన ఈడీ అధికారులు మిగతా నిందితులను ప్రశ్నించినట్లుగానే భాస్కర్ రెడ్డిని కూడా వి చారించినట్లు తెలిసింది. ఈడీ అధికారుల ప్రశ్నలకు భాస్కర్ రెడ్డి సమాధానాలు ఇవ్వడంలో తడబడినట్లు తెలిసింది. కాగా ఇదే కేసులో బుధ వారం నాడు భాస్కర్ రెడ్డి తనయుడు కడప ఎంపి అవినాష్ రెడ్డి హాజరుకానున్నారు. ఆయనకు ఇప్పటికే ఈడీ నోటీసులు జారీ చేయడం తె లిసిందే.

# శ్రీశైలం ప్రాజెక్టుకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు

## ఎపి ఇంధన మంత్రి గొట్టిపాటి రవికుమార్

## రెండు తెలుగు రాష్ట్రాలకు శ్రీశైలం ప్రాజెక్టు గర్వకారణం

## ఇంజినీరింగ్ పటిష్టత, విద్యుదుత్పత్తి, బహుముఖ ప్రయోజనాలకు గుర్తింపు



ఎపి ఇంధన మంత్రి గొట్టిపాటి రవికుమార్

**అమరావతి, అక్టోబరు 12, ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీశైలం ప్రాజెక్టుకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కడం తెలుగు రాష్ట్రాల ప్రజలకు గర్వకార ణమని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. డ్యామ్ నిర్మాణ పటిష్ఠత, జలవిద్యుత్ ఉత్పత్తి సామర్థం, సాగు, తాగు నీటి అవసరాలకు అందిస్తున్న సేవలకు అంతర్జాతీయ గుర్తింపు లభించడం ఆనందంగా ఉందని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు.

శ్రీశైలం జలా శయం దశాబ్దాలుగా భారీ వరదలను తట్టుకుంటూ ప్రజలకు సేవలందిస్తోందని మంత్రి తెలిపారు. ఇది కేవలం విద్యుత్ ఉత్పత్తి కేంద్రం మాత్రమే కాదని, లక్షలాది మంది మంచినీటి అవసరాలతో పాటు లక్షల ఎకరాల సాగునీటి అవసరాలను తీరుస్తున్న బహుళార్థ సాధక ప్రాజెక్టు అని వివరించారు. కృష్ణా జలాల వినియోగంలో కీలక పాత్ర పోషిస్తున్న శ్రీశైలం ప్రాజెక్టు తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో విశేషమైన ప్రాధాన్యం కలిగి ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టితో పట్టిసీమ ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకు రావడం వల్ల శ్రీశైలం జలాలను రాయలసీమ అవసరాలకు మరింత సమర్థంగా వినియోగించుకునే అవకాశం ఏర్పడిందని గొట్టిపాటి పేర్కొన్నారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు ఇప్పటివరకు సుమారు 500 టిఎంసిల నీటిని అందించడం వల్ల శ్రీశైలం జలాలను రాయలసీమ సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించుకునేందుకు వెసులుబాటు కలిగిందన్నారు. కృష్ణా డెల్టా రైతులకు అవసరమైన నీటిని అందిస్తూనే రాయలసీమ ప్రాంత అవసరాలకూ శ్రీశైలం జలాశయం అండగా నిలుస్తోందని తెలిపారు.

# 20వరకూ కేంద్ర బలగాలను కొనసాగించండి

## కేంద్రానికి ఢిల్లీ పోలీస్ లేఖ

**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** ఆందోళనలు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్ర సాయుధ పోలీసు బలగాల లను ఇప్పుడే ఉపసంహరించవద్దని, కేంద్ర బలగాల మోహరింపును ఈ నెల 20 వరకు పొడిగించాలని ఢిల్లీ పోలీసులు కోరారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ కి లేఖ రాశారు. ఈ విషయాన్ని ఢిల్లీ ఉన్నతాధికారులు మంగళవారం వెల్లడించారు. ఆందోళనలు పెరిగే అవకాశం ఉందనే నిఘావర్గాల సమాచారం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలను కాపాడటంతోపాటు ఉద్రిక్తతలకు తావులేకుండా ఉండేందుకే గడువు పెంచాలని కోరినట్లు చెప్పారు. కాగా ప్రస్తుతం విధుల్లో ఉన్న 273 కంపెనీల బలగాల మోహరింపు గడువు 12వ తేదీతోనే ముగిసింది. మరోవైపు జంతర్‌మంతర్, ఎన్నికల సంఘం కార్యాలయం, పార్లమెంట్ హౌస్, ఇండియా గేట్ వంటి ప్రాంతాల్లో నిరసనలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది.

# ఎల్‌నినో సాకుతో క్రాప్ హాలిడే

## రైతులను గాలికి వదిలిన కాంగ్రెస్

## మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఫైర్

**మహబూబ్‌నగర్, అక్టోబరు 13, ప్రభాతవార్త :** రాష్ట్రంలో తాగునీరు, సాగునీరు అందక పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వం ఎల్ నినోను సాకుగా చూపుతూ క్రాప్ హాలిడే ప్రకటించి మంత్రులంతా ఢిల్లీలో మకాం వేశారని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ భవన్ లో ఆయన ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా నది నుంచి 350 టీఎంసీలు దిగువకు వెళ్లిన 30 టీఎంసీలు కూడా నిల్వ చేసుకోలేకపోయారని, శ్రీశైలంలో 185 టీఎంసీల నుంచి 70 టీఎంసీలకు నిల్వ పడిపోయిందన్నారు. 60 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లు ఉండి మోటార్లు ఆన్ చేయడం లేదని, పక్క రాష్ట్రాలు ఆల్మట్టి, నారాయణపూర్ లో నీటిని నిల్వ చేసుకుంటుంటే తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు.పంటలు ఎండిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారని, తక్షణమే నష్టపరిహారం, వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు పనిచేయక ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టులు, పోలీసులు వైద్యం అందక ఇబ్బంది పడుతున్నారని, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ కోసం విద్యార్థులు, 2 లక్షల ఉద్యోగాల హామీతో నిరుద్యోగులు ఆందోళన చేస్తున్నారని, నిత్యావసర ధరలు పెరిగి గంజి కేంద్రాలు పెట్టాల్సిన దుస్థితి వచ్చిందని విమర్శించారు.

# బ్యారేజీల పునాదులకు సీకెంట్ పైలా? ఆర్‌సిసి డయాఫ్రం వాలా?

## కాళేశ్వరం మరమ్మతులపై సాంకేతిక నిపుణుల మేధోమథనం

## నేడు ఢిల్లీలో టెక్నికల్ ఓవర్సైట్ కమిటీ సమావేశం

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం లో భాగమైన మేడిగడ్డ, అన్నారం సుందిళ్ల బ్యారేజీల పునాదిని సీకెంట్ కట్ ఆఫ్ పైల్స్ బదులుగా ఆర్‌సిసి డయాఫ్రం కట్ ఆఫ్ పైల్స్‌తో నిర్మిం చాలనే నిపుణుల ప్రతిపాదనలపై చర్చించి మరమ్మతులు చేపట్టడానికి జలశక్తి శాఖ నియమించిన టెక్నికల్ ఓవ ర్సైట్ కమిటీ సమష్టిగా తుది నిర్ణయం తీసుకోనున్నారు. కాళేశ్వరం పథకంలోని మూడు బ్యారేజీల మర మ్మతు కోసం జరిగిన పరీక్షలు, ఫలితాలు, డిజైన్లు తదితర అంశాలపై చర్చించేందుకు కేంద్ర జలశక్తి శాఖ నియమించిన టెక్నికల్ ఓవర్సైట్ కమిటీ రెండో సమా వేశం బుధవారం ఢిల్లీలో జరగనుంది. జాతీయ ఆనకట్టల భద్రత ప్రాధికార సంస్థ ఎన్‌డిఎస్‌ఎ నియమించిన నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు కేంద్ర జల విద్యుత్తు పరిశోధన సంస్థ సిడబ్ల్యూపిఆర్ ఎస్ సహా పలు సంస్థలతో నీటిపారుదల శాఖ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు పరీక్షలు చేయించింది. నీటి పారుదల రంగానికి చెందిన వివిధ ప్రతిష్టాత్మకంగా సంస్థలో పనిచేసే నిపుణులు ఇచ్చిన సూచనలపై సమా వేశం జరుగుతోంది.

బ్యారేజీ మరమ్మతుతో సమస్యలు పునరావృతం కాకుండా డిజైనర్ సంస్థ అఫ్రీని కన్సల్టెంటుగా నియమిం చింది. బ్యారేజీ వద్ద భూభౌతిక పరిస్థితి, నీటి త్వరణం, లాంచింగ్ ఆప్రాన్ అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ రిప్‌రాప్ స్టోన్ పిచ్చింగ్ వంటి అంశాలపై చేసిన పరీక్షలు, డిజైన్లు అన్నింటినీ పరిశీలించడానికి ఎన్‌డిఎస్‌ఎ మెంబర్ టెక్నికల్ సమీర్‌కుమార్‌శుక్లా చైర్మన్‌గా ఒక కమిటీని ఏర్పాటు చేసింది.

కేంద్ర జలశక్తి శాఖ నియమించిన టిఏసి కేంద్ర జలసంఘంలోని డిజైన్స్, గేట్స్ విభాగం డైరెక్టర్లు, సిడబ్ల్యూపిఆర్ఎస్, సిఎస్ఎంఆర్ఎస్ శాస్త్రవేత్తలు, నీటిపారుదల శాఖ నుంచి ముగ్గురు ఇంజినీర్లు సభ్యులుగా నియమించారు. జూలై 31న జరిగిన తొలి సమావేశంలో ఆనాటి వరకు బ్యారేజీల నిర్మాణం, భూభౌతిక పరీక్షలు, ఫలితాలను విశ్లేషించించారు. మిగిలిన పరీక్షలు, పునరుద్ధరణ డిజైన్లు తయారైన తర్వాత తదుపరి సమావేశం ఏర్పాటు చేయాలనే జూలై 31నాటి తీర్మానానికి అనుగుణంగా రెండో సమావేశం బుధవారం నిర్వహించనున్నారు.

ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితి చూశాక నిపుణులు సికెంట్ ఫైల్ బేస్‌మెంట్ బదులు ఆర్‌సిసి డయాఫ్రమ్ వాల్ నిర్మాణం, సిసి బ్లాకులను తొలగించి మళ్లీ వేయడం, కొన్ని ప్రాంతాల్లో స్టిల్లింగ్ బేసిన్ విస్తరించడం, ఊట జాలు జరగకుండా చర్యలు, మేడిగడ్డ ఏడో బ్లాక్ పునరుద్ధరణ వంటి ప్రత్యామ్నాయాల వైపు మొగ్గు చూపుతుండటంతో వాటి సాధ్యాసాధ్యాలపై చర్చించనున్నారు. గత సమావేశంలో తీసుకున్న మేరకు అమలైన నిర్ణయాలు, ఇన్వెస్టిగేషన్స్, పునరుద్ధరణ డిజైన్లు, పునరుద్ధరణ గడువు, త్రీడి మోడల్ స్టడీస్ వివరాలు, కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ వివరాలు తదితర అంశాల గురించి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నిపు ణుల కమిటీ చైర్మన్ పరీక్షిత్ మెహ్రాతో పాటు డిజైనర్ కన్సల్టెన్సీ సంస్థ అఫ్రీ ప్రతినిధులు, సిడబ్ల్యూపిఆర్ఎస్ శాస్త్రవేత్తలు నివేదిం చనున్నారు. మరమ్మతు పనులు చేపట్టడానికి టైమ్‌బౌండ్ కార్యక్రమం చేపట్టనున్నారు.

వార్త

మానవ మేధ స్వేచ్ఛగా ఉన్నప్పుడే
సమాజ సంక్షేమానికి నిజమైన భద్రత లభిస్తుంది.
- లాస్కీ

# క్షయ ముక్తభారత్‌దే పైచేయి?

ఈ దేశంలో అంటు, సొంటు లేని వ్యాధులేవన్నా ఉన్నాయంటే వాటిని వేళ్లమీద లెక్కించుకోవాల్సిందే. అనాదిగా అంటువ్యాధిగా తారసపడుతున్న వ్యాధి ఏదైనా ఉంటే అది 'క్షయ' వ్యాధి. ఈ మధ్యనే 'ప్లేగ్' వ్యాధి కూడా తిరుగుటపాలో వచ్చేసిందన్న వార్తలు వచ్చేసాయి. ఒకప్పుడు ఈ వ్యాధులు సోకి భారతీయుల ప్రాణాలను కబళించేసాయనే చరిత్ర ఉంది. అందుకే క్షయ వ్యాధి మళ్లీ ప్రబలుతోందంటే భారతీయులు తమ శ్వాసకోశ రక్షణకు ఎంతో ఆందోళన చెందుతున్నారు. టి.బి అత్యంత ప్రమాదకరం. ప్రాణాంతక వ్యాధిగా భయంతో చెప్పుకునే వ్యాధి. దేశీయుల ఆరోగ్యాన్ని, ఆర్థిక వ్యవస్థను శతాబ్దాలుగా వేధిస్తున్న వ్యాధుల్లో ఒకటిగా క్షయవ్యాధినే చెబుతుంటాము. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో ప్రపంచదేశాలు 2030 నాటికి క్షయ వ్యాధిని తరిమి కొట్టాలన్నది ప్రధానంగా గోచరిస్తుంది. కాగా భారత్ మాత్రం ఈ లక్ష్యసాధనలో ముందడుగు వేసే దిశగా పరుగులుతీస్తోంది. ఇప్పుడు 'ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ అనే ఆలోచనను ఒక ప్రత్యేక ఆరోగ్య పథకంగా చేపట్టింది. కేవలం ఆసుపత్రుల ద్వారా రోగులకు మందులు చేయడమొక్కటే ఈ వ్యాధి నయానికి సరిపోదని ఎంచి ప్రత్యేకించి దీన్నొక సామాజిక ఉద్యమంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలనే ధ్యేయంతో ఉంది. ముందుగా ప్రజల భాగస్వామ్యం అత్యంత ఆవశ్యకమని భావించింది. కార్పొరేట్ సంస్థలు, ప్రజాప్రతినిధులు, సామాన్య పౌరులు 'ని-క్షయ మిత్ర'గా నమోదు చేసుకొని, టిబి రోగులను కూడా దత్తత తీసుకుంటారు. అనగా వారికి వైద్యసేవలు, చికిత్సలు అందించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకునే వారిని జతచేస్తారు. ఇవిగాక ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, ఆధ్వర్యంలో నేషనల్ టిబి ఎలిమినేషన్ ప్రోగ్రాం కార్యక్రమాలను కేంద్రప్రభుత్వం శ్రద్ధాసక్తులతో క్షయనివారణ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. అయినా సత్ఫలితాలు పొందే విషయంలో పూర్తిస్థాయి విశ్లేషణలు జరిపినప్పుడు మన ప్రభుత్వాల వైఖరి భిన్నంగా అనిపిస్తోంది. ట్యుబర్క్యులోసిస్ వ్యాధి విషయమే చెప్పాలంటే 2010లో అత్యధికంగా ఈ వ్యాధులు భారత్‌లోనే 26 శాతం ఉన్నాయని అంచనా వేసారు. ప్రపంచం మొత్తం మీద ఐదు దేశాల్లో క్షయవ్యాధిగ్రస్తులు 55.9 శాతం ఉన్నారని గ్లోబల్ టిబి రిపోర్ట్ తెలియచేస్తోంది. దేశంలో 2010లో క్షయరోగానికి యేటా 5.8 లక్షలమంది బలవుతున్నారు. కాగా 2023లో 3.2 లక్షలకు మరణాలు తగ్గాయి. 2015-24లమధ్య భారత్‌లో 3.05 లక్షల మంది మరణించారని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక వెల్లడిస్తోంది. అంతకుముందు సంవత్సరాలతో పోలిస్తే క్షయవ్యాధి తగ్గుదలను సూచిస్తోంది. క్షయవ్యాధి నివారణకు ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా పూర్తిస్థాయి తగ్గించడం అసాధ్యంగా అనిపిస్తోంది. ప్రధానంగా పొగాకు ఉత్పత్తులతో చుట్టా, బీడీ, సిగార్ వంటివి వాడడం వల్ల శరీరం కుళ్లిపోతోంది. ఆధునిక సాంకేతికత, కృత్రిమ మేధ, సమగ్ర సర్వేల ద్వారా క్షయ రోగగ్రస్తులను గుర్తించడమవుతోంది. మామూలు మందులుకు లొంగని మల్టిడ్రగ్ రెసిస్టెంట్ టిబిని అదుపు చేయడం ప్రభుత్వానికి సాధ్యం కావడం లేదు. ఈ వ్యాధిగ్రస్తులు ఔషధాలను తీసుకోవడం మధ్యలోనే ఆపివేయడం వలనో టిబి నిరోధకత కష్టమవుతోంది. పోషకాహార లోపం, నివాస రద్దీ వంటి అంశాల వలన గ్రామీణులకు ముప్పుగా పరిణమిస్తోంది. శ్రామిక వర్గాల్లో అవగాహనలేమి వల్ల మరికొంత మందిలో రోగ లక్షణాలు బయటపడుతున్నాయి. శరీరం మీద వేగవంతమయిన కొత్త వ్యాక్సిన్‌లతో తక్కువ వ్యవధిలోనే నయమయ్యే విధంగా ఔషధాలను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. టిబి ముక్త్ పంచాయతీల ద్వారా గ్రామీణ ప్రాంతాల నుంచే అనుమానిత రోగుల్ని గుర్తించి చికిత్సలను వారికి దగ్గర చేయాలి. కాగా కేంద్రప్రభుత్వం కోవిడ్ మహమ్మారి సోకిన సమయంలో అధిక నిధులు అటు మళ్లించడంతో 'టిబి' వ్యాధి నిరోధకత పట్ల శ్రద్ధ తగ్గించింది. నిధులు కూడా సరిపడినన్ని కేటాయించక పోవవడంతో క్షయవ్యాధి రోగులు పెరిగారని అంచనాలు వివరిస్తున్నాయి. 2023లో అంతకు ముందు కన్నా 38 శాతం నిధులు ఎక్కువగా కేటాయించినందున క్షయముక్త భారత్ ఊపందుకుంది. టిబి వ్యాధి సోకిన రోగులకు దూరంగా ఉండడం రోగులను గుర్తించిన వెంటనే వారికి సరైన చికిత్సలను అందించే కార్యాచరణకు ఉపక్రమించడం అవసరం. వ్యాధిగ్రస్తులకు సామాన్య ప్రజానీకం దూరంగా ఉండాలి. వారు దగ్గినా, తుమ్మినా వారికి సమీపంలో ఉన్నవారికి ఈ వ్యాధిసోకే అవకాశముంది. ఇటీవలే పొగ తాగే వారికన్నా వారి నుంచి వచ్చే పొగ పీల్చేవారికే శ్వాసకోశ వ్యాధులు రాగలవని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికలు కూడా వెలువడ్డాయి. కనుక క్షయ కూడాశ్వాసకోశాన్ని మాలిన్యపరిచే వ్యాధి కనుక మానవాళి స్వయంగా జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. ఇతర దేశాల కన్నా భారత్‌లో టిబి రోగుల నిష్పత్తి అధికంగా ఉన్నందున భారత్‌లో మరికొన్ని చికిత్సలు కూడా అవసరమయ్యున్నది. 2023లో ప్రపంచవ్యాప్తంగా 10.8 మిలియన్ల కేసులున్నాయన్న సర్వేలు చెబుతుండగా ఆగ్నేయాసియాలోనే వీటి వ్యాప్తి ఎక్కువగా ఉంది. అందుకే కేంద్ర ప్రభుత్వ వైద్యచికిత్సా పథకాలను ప్రతి ఒక క్షయరోగి పొందాల్సి ఉంది. ఇండియాలో 2024లో టిబి కొత్త కేసుల అంచనా ప్రకారం లక్ష జనాభాకు 237 నుంచి 187కి తగ్గింది. 2015తో పోలిస్తే 21 శాతం తగ్గినట్లే. 2015 నుండి 2024ల మధ్య 27 లక్షలు కొత్త కేసులు నమోదయ్యాయి. ఒకవైపు వ్యాధి నియంత్రణలో పురోగతి కనపడుతున్నా కొత్తగా పలువురకు క్షయవ్యాధి సోకటం ఆందోళనకరం. వ్యాధి నిర్మూలన లక్ష్యాన్ని చేరుకోవడంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడమే ప్రధానంగా ఈ పథకం లక్ష్యశుద్ధితో అమలు కావాల్సి ఉంది. ఈ వ్యాధిని దాచుకోవాలని ఎవరైనా చూస్తే అది వారికే శాపంగా పరిణమించగలదు.



అతిగా జాగ్రత్త పడడం దౌర్భాగ్యుని లక్షణమైతే, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం అవివేకి లక్షణం.
సిసిల్



ప్రాచీన మూఢవిశ్వాసాలను అంటిపెట్టుకోక, నవ్య సత్యాలకోసం సంసిద్ధుడవై ఉండు.
స్వామి వివేకానంద

## ప్రజావాక్కు



### నిరసన గళంపై బలప్రయోగం

ఢిల్లీలో నిన్న ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీతో సహా వివిధ ప్రజాసంఘాలు, పార్టీలు తలపెట్టిన శాంతియుత నిరసన కార్యక్రమాన్ని ప్రభుత్వం బల ప్రయోగంతో అణిచివేసింది. ఢిల్లీలో జంతర్ మంతర్ ప్రదేశంలోనే కాకుండా దేశవ్యాప్తంగా పలువుర్ని ముందుగానే అదుపులోకి తీసుకొని ధర్నాస్థలానికి చేరకుండా అడ్డుకుంది. వందలాది రైళ్లనిరద్దుచేసి, వేలాదిమందిని అదుపులోకితీసుకొని, ఢిల్లీలో డజను మెట్రో రైళ్లను, ఇంటర్నెట్ సేవల్ని నిలుపుదల చేసి నిరసన కార్యక్రమంపై విరుచుకుపడింది. అదుపులోకి తీసుకున్నవారిలో నలుగురుమాజీ ముఖ్యమంత్రులు కూడాఉన్నారు. తమ నిరసనకు కారణం తెలిపి, అనుమతి తీసుకున్నతర్వాత, శాంతి యుతంగానే నిర్వహిస్తామనిస్పష్టపరిచాక, ప్రభుత్వం ఇంతభారీ స్థాయిలో ధర్నాని విఫలం చెయ్యడం సబబు కాదు.

- డా.డి.వి.జి.శంకరరావు, విజయనగరం

### వివక్షే జీవిత పాఠం

నోబెల్ శాంతి బహుమతి సాధించిన నవనీతము నవి పిల్లాయివిశిష్టతను ఆమె వెలువరించిన తీర్పులను చూస్తే ప్రపంచం ఆధిపత్యం అనే పునాదులపైన కాకుండా న్యాయం అనే పునాదుల పైన మాత్రమే ప్రయాణించాలి అని చెప్పడం గొప్పమార్పు. అయితే ఆమె రువాండాలో ఉన్న బలహీనుల వైపు పాలస్తీనా ఆక్రమణ వైపు నిలబడి తీర్పులుఇచ్చి బలహీనులను బలవంతులుగా తీర్చిదిద్దడం వైపు తన అధికారాన్ని ఉపయోగించారు. ఆమె మండేలా కాలంలో జడ్జిగా నియమించబడి అక్కడి నల్ల జాతి పట్ల వివక్షనుఆమె జీవిత పాఠంగానేర్చుకుంది.

- భారత అవినాష్, జనగామ

### బస్సుల బోర్డులు ఏర్పాటు చేయాలి

ఆర్టీసీ బస్సుల బోర్డులు స్పష్టమైన అక్షరాలతో ఉండాలి. పెద్దఅక్షరాలతో కనిపించే విధంగా ఉండాలి. ప్రతి బస్టాండ్ ప్లాట్ ఫారంలో కూడా ప్లాట్ ఫారం నెంబర్లపై కూడా గ్రామాలపేర్లు స్పష్టంగాఉండాలి. బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లుగానే వికలాంగులకు కూడా ఉచితబస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలి. ప్రతి బస్సులో వికలాంగులకు కేటాయించిన సీట్లలో వికలాంగులు మాత్రమే కూర్చునే విధంగా కండక్టర్ సహకరించాలి. 40శాతం వైకల్యం కలిగిన ప్రతి వికలాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా

### నిఘా వ్యవస్థ రంగంలోకి దిగాలి

ప్రకాశం జిల్లాలో దొంగస్వామి, తిరుపతి జిల్లాలో కల్కి ప్రభుత్వభూములు ఆక్రమించి ఆశ్రమాల పేరుతో మోసం చేస్తుంటే, తన్ని తరిమి వేయాల్సిన రెవెన్యూ అధికారులు లంచాలు, ప్రలోభాలకు లొంగి భూములను దొంగలకు కట్టబెట్టాలని చూస్తున్నారు. నిఘా సంస్థలు నిగ్గు తేల్చాలి. ప్రకాశం జిల్లాలో రామదూత అనే దొంగస్వామి చెరువు పోరంబోకు, అటవీ భూమి ఆక్రమించి ఆశ్రమాల పేరుతో మోసం చేస్తున్నాడు. అటవీ భూమిలో అనాథపిల్లల స్కూలుఅని చెప్పి జీవో తెచ్చుకొని, యజ్ఞాలు యాగాలు, దీక్షలు చేస్తున్నాడు. అధికారులకు ఫిర్యాదు చేసినప్పుడు, తనికీకి వచ్చినవారిని ప్రలోభపెట్టిఅనుకూలంగా రిపోర్ట్‌వ్రాయించుకుంటాడు. చెరువు పోరంబోకులో కూడా యజ్ఞాలు చేస్తూ, పిల్లలు లేని వారికి పిల్లలు పుట్టిస్తాను, దీర్ఘరోగాలు నయం చేస్తానంటూమోసం చేస్తున్నాడు. అవినీతి నిరోధక శాఖవారు, ఇతర నిఘా సంస్థలు రంగంలోకి దిగి అవినీతి అధికారులకు శిక్షలు పడేలా చేయాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### నీటిని పొదుపుగా వాడుకోవాలి

ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది ఎక్కువ వర్షాభావం ఏర్పడింది. చెరువులు, కుంటలు, బావులు, బోర్లు, ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు నిండుకున్నాయి. నీటిని అవసరమైనంత వరకే వాడాలని ప్రభుత్వ అధికారులు వార్తలు, మెసేజ్‌లు పంపుతున్నారు. ఉష్ణోగ్రతలు పెరిగిన కారణంగా విద్యుత్ వినియోగం కూడా భారీగా పెరిగింది. ప్రజలు తమంత తాము భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా, నీటిని, విద్యుత్‌ను పరిమితంగా వినియోగించకపోయినట్లయితే ప్రభుత్వమే ప్రత్యామ్నాయ చర్యగానీటిని, విద్యుత్‌ని మితంగా టైమ్ ప్రకారంగా సరఫరా చేసే అవకాశం ఉంది. ఈ పొదుపు చర్య ఇంకా భారంగా, బాధగా ఉంటుంది. కాబట్టి ప్రజలే మితంగా వాడుతూ జాగ్రత్తలు తీసుకోవాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### పెరుగుతున్న వృద్ధుల జనాభా

భారతదేశంలోవయోవృద్ధుల జనాభా వేగంగా పెరుగుతోంది. రాబోయే దశాబ్దాల్లో నగరాల్లో నివసించే వృద్ధుల సంఖ్య రెట్టింపు కానుందని అంచనా. ఈ నేపథ్యంలో మన నగరాల మౌలిక వసతులు, వ్యవస్థలు వయోధికుల అవసరాలకు అనుగుణంగా సిద్ధంగా ఉన్నాయా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. నగర రవాణా వ్యవస్థలు ఇప్పటికీ వృద్ధులకు సులభంగా అందుబాటులో ఉండటం లేదు.

- సి.సాయిరుత్విక్, శ్రీకాకుళం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి
ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్రహోదా ఇస్తేనే మేలు!

ప్రజల చేత ఎన్నుకోబడ్డ జె అండ్ కె రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో ప్రజల సమస్యలు తీర్చటానికి చర్చలు జరపటానికి, దేశంలోని సమైక్యతను ప్రతిబింబించటానికి, కాశ్మీర్ సమస్యను సమూలంగా పరిష్కరించటానికి క్షేత్రస్థాయిలో బలమైన పునాదులు పడ్డట్లు అవుతుంది! ప్రధాని మోడీ నాయకత్వంలో ఎన్.డి.యే కూటమి ప్రభుత్వం అన్నిరంగాల్లో అవధుల మేర విజయాలను సాధిస్తున్నది. అందుకనే అ ప్రతిహతంగా ఎన్నికలల్లో విజయ ఢంకా మ్రోగిస్తున్నది. కాశ్మీరు సమస్య జాతిని దేశాన్ని, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పట్టి పీడిస్తున్న సమస్యగా మారింది. నేడు కాశ్మీరు ప్రజలు భారతదేశం వెంట వున్నట్లు 2024 ఎన్నికల ద్వారా స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోటానికి ప్రధాని హామీ మేర రాష్ట్రహోదాను తిరిగి దఖలు చేస్తే పాకిస్థాన్ వెనకడుగు వేయక తప్పదు. పాక్ ఆక్యుపైడ్ కాశ్మీరు కూడా మన దేశంలో అంతర్భాగంగా మారే రోజు దగ్గరవుతుంది!



రావులపాటి సీతారాంరావు

అనుకోని రీతిలో కేంద్ర ప్రభుత్వానికి చాలా సమస్యలు ఎదురు అవుతున్నాయి. కాంగ్రెస్ జనతా పార్టీ పంజా విప్పి జంతర్ మంతర్ ఈసారి 'సర్' చీఫ్ జ్ఞానేశ్ కుమార్‌ను వేటేయాలని చూస్తున్నది! అంతర్జాతీయంగా భారత్‌ను మరింతగా ఇబ్బందులలో నెట్టే సమీకరణలు లేవుకానీ, ప్రస్తుత పరిణామాలు దేశంలో అంత సౌకర్యంగా లేవని మాత్రంచెప్పొచ్చు! ఎన్.డి.ఏ కూటమిని దీటుగా ఎదుర్కొనేందుకు ఇండియా కూటమి, రాహుల్ గాంధీ నేతృత్వంలో చిన్నాచితకా పార్టీలను కూడగట్టి విశ్వ ప్రయత్నాలు పార్లమెంటులో, బయటా చేస్తున్నది కానీ ఫలితాలు వారి టాగ్ లైన్‌కు (భారత్ జీతేగా)తగ్గట్టుగా రావటం లేదు! అయినా సరే 'సర్' చీఫ్ పదవి వదిలేయాలని దేశమంతటా ఆ ఎలయన్స్ పార్టీలు రోడ్లు ఎక్కుతునే వున్నాయి! ఢిల్లీలో సరేసరి! ఇలాంటి పరిస్థితులల్లో దాదాపు పదేళ్ల తర్వాత ఇల్లు చక్కదిద్దుకోవాల్సిన అవసరం బలమైన నాయకుడు ప్రధాని మోడీకి వచ్చింది! జమ్మూ కాశ్మీర్‌కు (తిరిగి రాష్ట్ర హోదా)స్టేట్ హోదా ఇవ్వాలని జెఅండ్ కెలోని నాయకులుమరో సమస్యను తెచ్చిపెట్టే పరిస్థితులు కనపడుతున్నాయి! సెప్టెం బర్ 28న జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ తమ రాష్ట్రానికి స్టేట్ హుడ్ పునరుద్ధరించాలని ఒక ప్రతిపాదన ఆమోదించటమే కాకుండా డిమాండ్ రూపంలో కేంద్రానికి పంపటంతో మరోజటిలమైన సమస్యను ఎన్.డి.ఏప్రభుత్వం ఎదుర్కోవాల్సి వస్తున్నది! రాజకీయాలు కాచి వడపోసిన నాయకులు, మీడియా ఆసక్తిగా ఈ పరిణామాన్ని గమనిస్తున్నారు. ఈ సమస్యను తమకు అనుకూలంగా మలుచుకోవాలని ప్రతిపక్షాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి! యూనియన్ టెరిటరీగా జమ్మూకాశ్మీరుకు ఏడు సంవత్సరాలు నిండాయి! ఇంతకు మునుపు వున్న జె అండ్ కె రాష్ట్రాన్ని యూనియన్ టెరిటరీగా రెండు భాగాలుగా విభజించి 70 సంవత్సరాల ప్రత్యేక రాజ్యాంగ హోదాను 2019లో తగ్గించి యు.టిగా చేయటం జరిగింది. కేంద్రం మూడు అడుగులు వేయటం ద్వారా రాష్ట్రహోదాను పునరుద్ధరించటం జరుగుతుందని చెప్పింది. డీలిమిటేషన్, ఎన్నికలు, రాష్ట్ర హోదా ఆ అంచెలని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర హోదాను పునరుద్ధరించేందుకు ఆమోదించిన ప్రతిపాదనకు ఎలయన్స్ బంధం వున్న రెండు రూలింగ్ పార్టీలు, (జె.కె. యన్.సి ఐ.ఎన్.సి) సి.పి.యం., స్వతంత్రులు ప్రతిపక్ష పార్టీలుగా వున్నపీపుల్స్ డెమాక్రటిక్ పార్టీ, జెకె పీపుల్స్ కాన్ఫెన్స్, ఆమ్‌ఆద్మీ, అవామీ ఇత్తెహాద్ పార్టీలు సపోర్టు చేసాయి. మొత్తం సభలో వున్న 90మంది సభ్యుల్లో బిజెపికి చెందిన 29మంది వ్యతిరేకించారు. సుప్రీం కోర్టు కూడా అతి త్వరలో స్టేట్ హుడ్ను పునరుద్ధరించాలని అభిప్రాయపడింది. ప్రధాని మోడీ కూడా సరియైన సమయంలో ఇది జరుగుతుందని హామీకూడా యిచ్చారు. అయితే ప్రజాస్వామ్యాన్ని గట్టిగా బలపర్చేవారు కేంద్రం తిరిగి రాష్ట్ర హోదాను పునరుద్ధరించటంలో ఆలస్యం చేస్తున్నదని భావిస్తున్నారు. కేంద్రం స్టేట్ హుడ్ను తీసివేయకుండా వుండాల్సిందని, ఇంతకు మునుపు ఎప్పుడూ ఇలా జరగలేదని ప్రజాస్వామ్య యుతంగా పాలిస్తున్న కేంద్రం ఈ చర్యను తలపెట్టకుండా వుంటే బాగుండేదని కూడా అభిప్రాయపడు



తున్నారు! నిజానికి 2024 ఎన్నికలు జె అండ్ కెలో చాలా ప్రశాంతంగా జరిగాయి. అంతకు మునుపు వున్న హింసాకాండ, తీవ్రవాదుల దాడులు, కాశ్మీర్ అంటేనే భగభగ మండే అగ్ని గుండంగా భావించిన రోజుల్నుంచి, ఎలక్షన్లు బాయ్కాట్ చేయాలన్న ఒత్తిడులు తట్టుకొని జెకె ప్రజలు ఎన్నడూ లేని రీతిలో ఓటింగ్ రేట్‌ను (63.88)గణనీయంగా పెంచి, ఒక్కబుల్లెట్ కూడా ప్రయోగించటానికి ఆస్కారం ఇవ్వకుండా మా భవిష్యత్తు భారత్ అంతర్భాగంగానే ముడిపడి వుందన్న సంకేతంతో ఎన్నికలలో అసాధారణ రీతిలో విజయాన్ని ప్రజాభిప్రాయాన్ని నమోదుచేసారు. అలాంటి పరిస్థితులలో ప్రధాని హామీప్రకారం స్టేట్ హుడ్ను పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా వుంది! ఒమర్ అబ్దుల్లా, ఫరూక్ అబ్దుల్లా భారత్‌తోనే వారి పార్టీ భవిష్యత్తు ముడిపడి వుందని నికార్సుగా నమ్ముతున్న వారిలోముందరి వరుసలో వుంటారు! పాక్ ఆక్యుపైడ్ కాశ్మీరులో కానీ, పాకిస్థాన్, ఆఫ్ఘానిస్థాన్, బెలూచిస్థాన్‌ల ప్రస్తుత పరిస్థితులు గమనిస్తే, మన దేశం ఎంత జాగ్రత్తగా ఎన్ని పొరపాట్లు జరిగినప్పటికిని ప్రజాస్వామ్యాన్ని కంటిరెప్పలా కాపాడుకుంటున్నదో అందరికీ అద్దంలో చూపినట్లు కనపడుతున్నది! నిన్నటి యుద్ధాలలో కూడా సమ్యక్ దృక్పథాన్ని గ్లోబల్గా ప్రదర్శించి, మన దేశ విలువలను పెంచిన నాయకుడిగా ప్రధాని మోడీ అసాధారణ గుర్తింపు తెచ్చుకున్న ఈ తరుణంలో, జె అండ్ కెకు స్టేట్ హుడ్ తిరిగి ఇవ్వటం లాంటి చర్యలు మన దేశ ప్రతిష్ఠను మరింతగా పెంచుతాయనటంలో సందేహం లేదు! అవకాశందొరికినప్పుడల్లా పాకిస్థాన్ మిలిటెంట్ల దాడులను మన ప్రాంతాలలో చేస్తునే వుంది! 'సిందూర్' ఆయుధ ప్రయోగంతోఇప్పుడు అలాంటి సాహసాలకు తలపడటం లేదు! చైనా కూడా పాకిస్థాన్‌ను తన అవసరం మేర వాడుకున్నది కానీ ఇదివరకటిలా పాకిస్థాన్ కయ్యానికి దిగగానే, చైనా భారత్‌పై కాలు దువ్వటం లేదు. రష్యా, యుయస్, ఇజ్రాయిల్, పశ్చిమాసియా దేశాలు అంతర్యుద్ధాలతో తల మునకలై వున్నాయి. యుయన్ఓ సమావేశాల్లో భారత విదేశాంగ నిపుణులు మా దేశం జోలికివస్తే ఊరుకొనేది లేదు కానీ మా అంతటమేము ఏ దేశంతో అనవసరంగా తలపడేది లేదు అని నిర్ద్వందంగా ప్రకటించటం భారత్ బలపడిన స్థానం నుంచి వాస్తవాన్ని చెప్పినట్లుగా అంతర్జాతీయ నిపుణులు గుర్తిస్తూనే వున్నారు. 2024 ఎన్నికలలో కాశ్మీర్ ప్రజలు ప్రదర్శించిన విజ్ఞత, స్పష్టమైన సంకేతాల దృష్ట్యా కేంద్రం, ఆ ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేయకుండా, ప్రజాస్వామ్య విలువలకు, ఇచ్చిన హామీకి గౌరవాన్ని ఇస్తూ జె అండ్ కెకు రాష్ట్ర హోదాను తిరిగి ఇవ్వటం మేలు! గత కాలంలో కాశ్మీరు ప్రజలు అనుభవించిన కష్టాలు, ఈ పునరుద్ధరణతో మరిచిపోవటమే కాకుండా కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతులు హామీలు అమలు చేయటంలో ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించకుండా వుండలేరు! అదీ గాకుండా కోర్టు తీర్పును అమలు చేయటానికి త్వరత్వరగా అడుగులు వేస్తున్న సంకేతం కూడా ఇచ్చినట్లవుతుంది! అసెంబ్లీ ఎన్నికలలో, ప్రశాంత వాతావరణం కల్పించి ఓటువేసిన ప్రజలకు ఎంతో ఊరట ఈ చర్యద్వారా కేంద్రం కలిగించినట్లవుతుంది! ప్రజల చేత ఎన్నుకోబడ్డ జె అండ్ కె రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో ప్రజల సమస్యలు తీర్చటానికి చర్చలు జరపటానికి, దేశంలోని సమైక్యతను ప్రతిబింబించటానికి, కాశ్మీర్ సమస్యను సమూలంగా పరిష్కరించటానికి క్షేత్రస్థాయిలో బలమైన పునాదులు పడ్డట్లు అవుతుంది! ప్రధాని మోడీ నాయకత్వంలో ఎన్.డి.యే కూటమి ప్రభుత్వం అన్నిరంగాల్లో అవధుల మేర విజయాలను సాధిస్తున్నది. అందుకనే అ ప్రతిహతంగా ఎన్నికలల్లో విజయఢంకా మ్రోగిస్తున్నది. కాశ్మీరు సమస్యజాతినిదేశాన్ని, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పట్టి పీడిస్తున్న సమస్యగా మారింది. నేడు కాశ్మీరు ప్రజలు భారతదేశం వెంటవున్నట్లు 2024 ఎన్నికల ద్వారా స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోటానికి ప్రధాని హామీ మేర రాష్ట్రహోదాను తిరిగి దఖలు చేస్తే పాకిస్థాన్ వెనకడుగు వేయక తప్పదు. పాక్ ఆక్యుపైడ్ కాశ్మీరు కూడా మన దేశంలో అంతర్భాగంగా మారే రోజు దగ్గరవుతుంది! ●

# హిమాలయాల భద్రతే భవిష్యత్తుకు భరోసా

సి.హెచ్. ప్రతాప్

హిమాలయాల్లో కరుగుతున్నది మంచు మాత్రమేకాదు, కోట్లాది ప్రజల నీటి భద్రతకు భరోసా కూడా. జీవనదులకు జన్మనిచ్చే హిమానీనదాలు, అపార జీవవైవిధ్యానికి నిలయమైన పర్వతాలు ఇప్పుడు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, కుంభవృష్టి, కొండచరియల పతనంతో అస్థిరమవుతున్నాయి. వరుస విపత్తులు అక్కడి అభివృద్ధి విధానాలను పునఃసమీక్షించాల్సిన అవసరాన్ని చాటుతున్నాయి. ప్రకృతి హెచ్చరికలను గుర్తించి స్పందించడమే భవిష్యత్తుకు భరోసా. ఈ ఏడాది ఆగస్టు 26న నేపాల్‌లోని లాంగ్‌టాంగ్ లిరుంగ్ పర్వతంపై మంచు, శిలలు కూలిపోవడంతో సంభవించిన వరదలు నేపాల్-చైనా సరిహద్దు ప్రాంతాలను అతలాకుతలం చేశాయి. గ్రామాలు, రహదారులు, వంతెనలు ధ్వంసమయ్యాయి. అక్టోబర్ నాటికి 1,457 మంది మరణించినట్లు వార్తా సంస్థలు వెల్లడించాయి. ప్రాణాలతో బయటపడిన కుటుంబాలు ఇళ్లతోపాటు జీవనాధారాలను కోల్పోయాయి. ఆయా ప్రాంతాల్లో పునరావాసం, మౌలిక సదుపాయాల పునరుద్ధరణ పెనుసవాళ్లుగా మారాయి. ఆ విషాదం నుంచి కోలుకోకముందే అక్టోబర్ 11న నేపాల్‌లోని బుఢీ గండకీ నది పరివాహక ప్రాంతాన్ని మరో ఆకస్మిక వరద ముంచెత్తింది. కొండచరియలతో నదికి ఏర్పడిన తాత్కాలిక అడ్డుకట్ట తెగిపోవడం ఇందుకు కారణమై ఉండవచ్చని నిపుణుల ప్రాథమిక అంచనా. ఇళ్లు, వంతెనలు కొట్టుకుపోయాయి. జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణ ప్రాంతాలు దెబ్బతిన్నాయి. ఐదుగురు గల్లంతవగా, వందమందికిపైగా విదేశీ యాత్రికులు చిక్కుకుపోయారు. సకాలంలో అందిన హెచ్చరికలు పలువురిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తోడ్పడ్డాయి. భారత హిమాలయాల్లోనూ ఇటీవలి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. 2025 ఆగస్టు 5న ఉత్తరాఖండ్‌లోని ధరాలీ-హర్షిల్ ప్రాంతాల్లో బురద, రాళ్లతో దూసుకొచ్చిన ప్రవాహాలు విధ్వంసం సృష్టించాయి. అదే నెల 14న జమ్మూకశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లా చిసోతీలో కుంభవృష్టి ప్రాణనష్టం కలిగించింది. ఆగస్టు 22-23 రాత్రి చమోలీ జిల్లా థరాలీలో వరదలు, కొండచరియలు జనజీవనాన్ని దెబ్బతీశాయి. తెగిపోయిన రవాణా మార్గాలు సహాయక చర్యలకు ఆటంకమయ్యాయి. పర్యాటకంపై ఆధారపడిన కుటుంబాలు ఉపాధిని కోల్పోయాయి. ఈ విపత్తులన్నింటికీ ఒకే కారణం లేదు. ప్రతి ఘటననూ హిమానీనదాల కరుగుదలకే ఆపాదించడం సరికాదు. అయితే పెరుగుతున్న వేడి మంచును, శాశ్వతంగా గడ్డకట్టిన నేలను అస్థిరపరుస్తోంది. ఐసిఐఎంఓడీ మార్చి 2026 నివేదిక ప్రకారం, హిందూకుష్-హిమాలయ ప్రాంతంలో మంచు నష్టం రేటు 2000 తర్వాత రెట్టింపైంది. 1990-2020 మధ్య హిమానీనదాల విస్తీర్ణం సుమారు 12 శాతం తగ్గింది. ఈ పర్వత వ్యవస్థ దిగువ ప్రాంతాల్లో దాదాపు రెండువందల కోట్లమంది నీటి అవసరాలకు కీలకమైన ఆధారం. ప్రమాదం పర్వత గ్రామాలకే పరిమితం కాదు. వరదలు పంటలను నాశనం చేస్తాయి. రహదారులు ధ్వంసమైతే సరకు రవాణా నిలిచిపోతుంది. మంచునిల్వలు తగ్గితే దీర్ఘకాలంలో నదుల కాలానుగుణ ప్రవాహాలు మారి సాగునీరు, తాగునీరు, విద్యుదుత్పత్తిపై ఒత్తిడి పెరుగుతుంది. పర్వత జీవవైవిధ్యం, స్థానిక సమాజాల జీవన విధానం దెబ్బతింటాయి. ఒక ప్రాంతంలోని విపత్తు దిగువనున్న పట్టణాలు, వ్యవసాయ ప్రాంతాలపైనా ప్రభావం చూపుతుంది. అందుకే నిర్మాణాలకు ముందు భూగర్భ స్థిరత్వం, వరద ముప్పు, పర్యావరణం భరించగల పరిమితులను పరిశీలించాలి. ప్రమాదప్రాంతాల్లో నిర్మాణాలనునియంత్రించి, అవసరమైన కుటుంబాలకు గౌరవప్రదమైన పునరావాసం కల్పించాలి. నదీ మార్గాలను ఆక్రమణల నుంచి కాపాడాలి. రహదారుల నిర్మాణంలో తొలగించిన మట్టి, రాళ్లను ప్రవాహాల్లో పడేయకుండా చూడాలి. పర్యాటక కార్యకలాపాలు స్థానిక సామర్థ్యానికి అనుగుణంగా సాగాలి. అడవుల పరిరక్షణ, సహజ జలమార్గాల పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. ముందస్తు హెచ్చరిక ప్రతి గ్రామానికీ చేరాలి. సరిహద్దు దేశాలు వరద సమాచారాన్ని హిమాలయాలను కాపాడటం అంటే మన రేపటి నీటిని, జీవితాన్ని కాపాడుకోవడమే! ●

# ఆహార వృథాను నివారిస్తేనే సమాజ ప్రగతి

వై. సంజీవ కుమార్

ఆహారం అనేది కేవలం ఆకలిని తీర్చే పదార్థం మాత్రమే కాదు. అది మనిషి జీవనానికి ఆధారం, ఆరోగ్యానికి పునాది, శరీరానికి శక్తి, కుటుంబానికి భరోసా, సమాజానికి బాధ్యతను గుర్తుచేసే ఒక గొప్ప జీవన సత్యం. మనిషి సంపాదించే సంపద ఎంత ఉన్నా, ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్నా, ఆకలి వేసినప్పుడు అవసరమయ్యేది ఒక్క ముద్ద అన్నమే. అందుకే ఆహారం విలువను తెలుసుకోవడం ఎంత ముఖ్యమో, ఆకలితో బాధపడుతున్న వారి పరిస్థితిని అర్థం చేసుకోవడం కూడా అంతే ముఖ్యం. ప్రతి సంవత్సరం అక్టోబర్‌లో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ప్రపంచవ్యాప్తంగా ఆకలిని నిర్మూలించడం, పోషకాహారంపై అవగాహన పెంపొందించడం, ఆహార భద్రతను సాధించడం, ప్రతి ఒక్కరికీ సరిపడా ఆరోగ్యకరమైన ఆహారం అందేలా కృషి చేయడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశాలు. నేడు మనిషి ఆహారపు అలవాట్లను, సమాజంలో ఆకలి పరిస్థితులను, మనిషి బాధ్యతలను ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన రోజు. చాలామందికి ప్రతిరోజూ మూడు పూటలా ఆహారం లభించడం సహజమైన విషయంగా అనిపిస్తుంది. ఇంట్లో వండిన భోజనం, హోటళ్లలో లభించే వంటకాలు, వేడుకల్లోవడ్డించే విందులు మన జీవితంలో సాధారణ దృశ్యాలుగా మారిపోయాయి. అయితే అదే సమయంలో ఒక పూట భోజనం కోసం ఎదురుచూసే కుటుంబాలు, రాత్రి ఆకలితోనిద్రపోయే పిల్లలు, వృద్ధాప్యంలో ఆదరించే వారు లేక ఆహారం కోసం ఇతరులపై ఆధారపడే వృద్ధులు కూడా నేటి సమాజంలో ఉన్నారు. ప్లేట్లలో మిగిలిపోయే అన్నం మరొకరి ఆకలిని తీర్చగలదనే ఆలోచన మనలో ఎంతమందికి వస్తుంది? మనం తినకుండా పారవేసే ఆహారం వెనుక రైతు శ్రమ, భూమి, నీరు, విద్యుత్తు, విత్తనాలు, రవాణా, వంట చేసిన వారి కష్టం దాగి ఉన్నాయి. ఒక గింజ అన్నం మన చేతికి చేరే వరకు ఎన్నో దశల్లో ఎంతోమంది శ్రమిస్తారు. కాబట్టి ఆహారాన్ని గౌరవించడం అంటే రైతును గౌరవించడం, ప్రకృతిని గౌరవించడం, మానవ శ్రమకు విలువ ఇవ్వడం. ఆకలి విలువను నిజంగా అర్థం చేసుకోవాలంటే ఆకలితో ఉన్న వ్యక్తి పరిస్థితిని మనసుతో ఊహించుకోవాలి. కడుపు నిండిన వ్యక్తికి ఆహారం ఒక ఎంపిక కావచ్చు. ఆకలితోఉన్న వ్యక్తికి అదే ఆహారం జీవనాధారం. అందుకే అన్నదానం అనేది కేవలం భోజనం పెట్టడం మాత్రమే కాదు, ఒక మనిషికి ఆ క్షణంలో జీవించే ధైర్యాన్ని, ఆత్మగౌరవాన్ని అందించడం కూడా. ఒకవైపు వివాహాలు, శుభకార్యాలు, విందులు, హోటళ్లు, వేడుకల్లో అవసరానికి మించి ఆహారాన్ని సిద్ధంచేసి చివరకు పారవేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. మరోవైపు పేదరికం, నిరుద్యోగం, నిరాశ్రయత్వం, కుటుంబ సమస్యలు, వృద్ధాప్య అసహాయతవంటి కారణాలతో కనీస భోజనం కూడా పొందలేని వారు ఉన్నారు. నగరాల్లోని రహదారుల పక్కన, ఫుట్‌పాత్‌లపై జీవించే నిరాశ్రయులు, అనాథ పిల్లలు, ఒంటరిగా మిగిలిపోయిన వృద్ధులు, సంచార జీవనం సాగించే కుటుంబాలు అనేక



ఇబ్బందులను ఎదుర్కొంటుంటారు. వారికి ప్రతిరోజూ ఆహారం ఎక్కడ లభిస్తుంది? తాగడానికి పరిశుభ్రమైన నీరు దొరుకుతుందా? అనారోగ్యంతో ఉన్నప్పుడు పోషకాహారం పొందగలుగుతున్నారా? అనే ప్రశ్నలు ఆలోచింపజేయాలి. ఆకలి అనేది కేవలం ఆర్థిక సమస్యమాత్రమే కాదు. అదిఆరోగ్యం, విద్య, ఉపాధి, సామాజిక సమానత్వంతో ముడిపడి ఉన్న సమస్య. సరైన ఆహారం అందకపోతే పిల్లల్లో ఎదుగుదల మందగించవచ్చు, చదువుపై ఏకాగ్రత తగ్గవచ్చు, పెద్దల్లో పని చేసే శక్తి తగ్గవచ్చు, వృద్ధుల్లో ఆరోగ్య సమస్యలు తీవ్రమవచ్చు. అందువల్ల ఆకలిని తగ్గించడం అంటే ఒక వ్యక్తి ప్రస్తుత అవసరాన్ని తీర్చడమే కాకుండా, అతని భవిష్యత్తుకు కూడా తోడ్పడటం. అయితే ఆకలితో ఉన్న ప్రతి వ్యక్తి పరిస్థితి ఒకేలా ఉండదు. కొందరికి తాత్కాలికంగా భోజనం అవసరమవుతుంది. మరికొందరికి నిరంతర ఆహార సహాయంతో పాటు ఉపాధి, నివాసం, వైద్యం, విద్య వంటి అవకాశాలు అవసరమవుతాయి. కాబట్టి తక్షణ సహాయంతో పాటు దీర్ఘకాలిక పరిష్కారాలపై కూడా దృష్టిపెట్టాలి. ఆహార కొరతను తగ్గించడానికి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు మాత్రమే పనిచేస్తే సరిపోదు. ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి తనవంతు బాధ్యతను నిర్వర్తించాలి. అవసరానికి మించి వండటం, ప్లేట్లలో ఎక్కువగా వడ్డించుకోవడం, మిగిలిన ఆహారాన్ని నిర్లక్ష్యంగా పారవేయడం వంటి అలవాట్లను మార్చుకోవాలి. మీకు ఎంత ఆహారం అవసరమో అంతే తీసుకోవాలి. అవసరమైనంత మాత్రమే వండుకోవాలి. మిగిలిన సురక్షితమైన ఆహారాన్ని సరైనపద్ధతుల్లో నిల్వ చేయాలి. ఆహారాన్ని ఇతరులకు అందించాలనుకుంటే దానినాణ్యత, పరిశుభ్రత, నిల్వ సమయం వంటి అంశాలను తప్పనిసరిగా పరిశీలించాలి. వివాహాలు, పుట్టినరోజులు, వార్షికోత్సవాలు, ఇతర వేడుకల్లో మిగిలే సురక్షితమైన ఆహారాన్ని బాధ్యతాయుతంగా అవసరమైన వారికి అందించే వ్యవస్థలనుప్రోత్సహించాలి. అన్నదానాన్ని అలవాటుగా మార్చుకోవాలి, సహాయం పొందుతున్న వారిని పేదవారిగా, అసహాయులుగా తక్కువ చేసి చూడకూడదు. వారి ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, వివక్ష లేకుండా, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలి. మానవత్వం అందరిలో ఉండాలి. పిల్లల్లో మంచి అలవాట్లు పెంపొందించాలి చిన్నప్పటినుంచే అన్నం వృథా చేయకూడదని, రైతుకష్టాన్ని గౌరవించాలని, అవసరమైన వారికి సహాయం చేయాలని నేర్పాలి. పాఠశాలల్లో ఆహారవిలువ, పోషకాహారం, పరిశుభ్రత, ఆహార వృథా నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. పోషకాహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. కడుపు నిండటం మాత్రమే సరిపోదు. సమతుల్యమైన, పోషకమైన ఆహారం కూడా అవసరం. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారికి వారి అవసరాలకు తగిన ఆహారం అందేలా శ్రద్ధచూపాలి. ప్రభుత్వ పథకాలను బలోపేతం చేయాలి. ప్రజాపంపిణీ వ్యవస్థ, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ పోషకాహార కార్యక్రమాలు వంటి సేవలు అర్హులైనవారికి సక్రమంగా అందేలా పర్యవేక్షించాలి. ఆకలితో ఉన్న కుటుంబాలకు ఆహార భద్రతతోపాటు ఉపాధి, విద్య, వైద్య సహాయం అందించాలి. స్వచ్ఛంద సేవా సంస్థలు, యువజన సంఘాలు, దాతలు, స్థానిక సమూహాలు కలిసి అవసరమైన ప్రాంతాలను గుర్తించి క్రమం తప్పకుండా అన్నదానం నిర్వహించవచ్చు. ●

# 'పవర్ టు ఎంపవర్'బాటలో సాగుతున్నాం





## డిజిటల్ నైపుణ్యాలు భారత్‌కు గేమ్‌ఛేంజర్

## చైనా కంటే మెరుగ్గా ఇండియా వృద్ధిరేటు

## 'బ్లూమ్‌బెర్గ్ న్యూఎకానమీ ఫోరం'లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** సాంకేతిక అభివృద్ధి వల్ల కలిగే ప్రయోజనాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరాలని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. సాంకేతిక పురోగతి, సమాచారం, విజ్ఞానం, వినూత్న ఆలోచనల ఫలితాలు కేవలం కొద్దిమందికే పరిమితం కాకుండా కోట్లాది మంది ప్రజల సాధికారతకు ఉపయోగపడాలన్నారు. అధికారం ఎవరి చేతుల్లో ఉందన్నది ముఖ్యం కాదని, దాన్ని ప్రజల అభ్యున్నతికి ఎలా ఉపయోగిస్తున్నామన్నదే కీలకమని పేర్కొన్నారు. న్యూఢిల్లీలో తొలిసారిగా 'ఏ వరల్డ్ ఇన్ ఫ్లే, డిఫైనింగ్ ది న్యూ లీవర్స్ ఆఫ్ పవర్ థీమ్‌తో నిర్వహిస్తున్న 8వ 'బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్'లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 'పవర్ టు ఎంపవర్' అనే దూరదృష్టితో తాము ముందుకు సాగుతున్నామని చెప్పారు. డిజిటల్ నైపుణ్యాలు భారత్‌కు గేమ్ ఛేంజర్‌గా నిలు స్తాయన్నారు. ఆలోచనా విధానంలో రావాల్సిన మార్పులను ప్రధాని వివరించారు. కేవలం అధికారాన్ని చెలాయించడం కంటే ప్రజలను సాధికారత వైపు నడిపించడం ముఖ్యమని ఒకరితో ఒకరు పోటీపడే శక్తికంటే పరస్పరం సహకరించుకునే ధోరణి పెరగాలన్నారు. మన సొంత విజయాల కంటే ఇతరులు విజయం సాధించడంలో సహాయపడే దిశగా ఆలోచించాలని సూచించారు. జ్ఞానం, సంపద, అధికారం ఎవరి వద్ద ఉన్నాయనేది కాదు వాటిని ఏఉద్దేశంతో ఉపయోగిస్తున్నారనేదే ముఖ్యమని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. నేటి కాలంలో ఈ తత్వాన్ని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. మన వేల యేళ్ల సంప్రదాయం ఇదే మనకు నేర్పింది. దీనిని మేము ఆచరణ ద్వారా నిరూపించామని ప్రధాని మోడీ వివరించారు.

భారతదేశ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను అనుభవించడానికి అంతర్జాతీయ ప్రతినిధులను ఆహ్వానిస్తూ, భారతదేశంలో దేశంలోని వివిధ పరిమాణాల వ్యాపారాలు ఒకే వేదికను ఉపయో గించవచ్చని మోడీ పేర్కొన్నారు. "మన దేశంలో, ఒక వీధి వ్యాపారికి, ఒక కార్ల షోరూమ్‌కు వేర్వేరు రకాల వ్యాపారాలు ఉంటాయి. అవి వేర్వేరు స్థాయిలలో పనిచేస్తాయి, కానీ భారతదేశంలో, రెండూ ఒకే డిజిటల్ చెల్లింపుల వేదికను ఉప యోగిస్తాయి" అని ఆయన అన్నారు. "ఇదే సమ్మిళిత సాంకేతికత శక్తి అని ఆయన పేర్కొంటూ, డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు, సరసమైన మొబైల్ డేటా, డిజిటల్ చెల్లింపులు, ప్రత్యక్ష ప్రయోజన బదిలీలు ఆర్థిక అవకాశాలకు ప్రాప్యతను విస్తృతం చేశాయని తెలిపారు. భారతదేశ స్టార్టప్ వ్యవస్థ 2014కు ముందు కొన్ని వందల సంస్థల నుండి ఇప్పుడు 2.5 లక్షలకు పైగా విస్తరించిందని ప్రధాని అన్నారు. ఈ స్టార్టప్‌లలో దాదాపు సగంచిన్ననగరాలు, పట్టణాలలో ఉన్నాయి, కాగా 45 శాతం సంస్థలలో కనీసం ఒక మహిళా డైరెక్టర్ లేదా భాగస్వామి ఉన్నారు. సాంకేతికత ఆధారిత సంక్షేమ బదిలీలు కూడా పేదరిక నిర్మూలనకు దోహదపడ్డాయని, గత దశాబ్ద కాలంలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని మోడీ నొక్కి చెప్పారు.

భారతదేశ ఆర్థిక వృద్ధిరేటు చైనా కంటే మెరుగ్గా ఉందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. ప్రస్తుతం భారత ఆర్థిక వృద్ధిరేటు 7 శాతంగా ఉందని అన్నారు. ఏప్రిల్– జూన్ త్రైమాసికంలో 7.8 శాతం ఆర్థిక వృద్ధి, 700 బిలియన్ డాలర్లకు పైగా ఉన్న విదేశీ మారక నిల్వలు, పన్నులు, దివాలా, కార్మికచట్టాలలో సంస్కరణలు భారతదేశ స్థితి స్థాపకతకు సూచికలని మోడీ పేర్కొన్నారు.

**స్వచ్ఛ ఇంధనం, సంస్కరణలు కీలక ప్రాధాన్యతలు:** పారిస్ వాతావరణ ప్రతిజ్ఞ కింద 2030 గడువుకు ముందే, నవంబరు 2021 నాటికే శిలాజేతర ఇంధనాల నుండి స్థాపిత విద్యుత్ సామర్థ్యంలో 40శాతం సాధించాలన్న లక్ష్యాన్ని భారతదేశం సాధించిందని ప్రధాని మోడీ అన్నారు. పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 2014లో సుమారు 75 గిగావాట్ల నుండి ఇప్పుడు దాదాపు 300 గిగావాట్లకు పెరిగిందని ఆయన తెలిపారు. గృహ సౌరవిద్యుత్ వినియోగానికి, రైతుల సౌర విద్యుత్ ఉత్పత్తికి మద్దతు ఇచ్చే పిఎం సూర్య ఘర్, పిఎం కుసుమ్‌పథకాలను కూడా ఆయన ప్రస్తావించారు. కాగా ఈ 8వ బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీఫోరమ్ లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న 500 మందికి పైగా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలకు చెందిన ప్రముఖ నాయకులు, ఆర్థిక నిపుణులు పాల్గొన్నారు. మారుతున్న భూ రాజకీయాలు, ఆర్థిక సవాళ్లు, భవిష్యత్ ప్రగతికి సంబంధించిన అంశాలపై ప్రతినిధులు విస్తృతంగా చర్చించనున్నారు.

# సర్‌పై కాంగ్రెస్ పిటిషన్‌లో 14 లోపాలు!

## సరిచేసి మళ్లీ దాఖలు చేయాలని సుప్రీం రిజిస్ట్రీ ఆదేశం

**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** సర్‌లో పెద్దఎత్తున ఓట్ల తొలగింపు సహా అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు 10 మంది ప్రతిపక్ష నేతలు దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం సుప్రీంకోర్టులో విచారణకు రాలేదు. ఈ పిటిషన్‌లో సుప్రీం కోర్టు రిజిస్ట్రీ గుర్తించిన లోపాలను పిటిషనర్లు ఇంకా సవరించకపోవడమే కారణంగా తేలింది. సుప్రీం కోర్టు వెబ్‌సైట్ సమాచారం ప్రకారం ఈ పిటిషన్‌లో రిజిస్ట్రీ మొత్తం 14 లోపాలను గుర్తించింది. కోర్టుకు చెల్లించాల్సిన రుసుములో 220 రూపాయలు తక్కువ పడటం కూడా వాటిలో ఒకటని తెలిపింది. మిగిలిన లోపాల్లో తొమ్మిది మంది పిటిషనర్ల అధికారిక అనుమతి పత్రాలు లేవని, కాంగ్రెస్ అధ్యక్షుడు మలికార్జున ఖర్గే గుర్తింపు కార్డు నకలులో ఆయన ఫొటో ఐడీ స్పష్టంగా లేదని వివరించింది. పిటిషన్‌లో పొందుపరిచిన కొన్ని పత్రాలు చదవడానికి వీలులేకుండా ఉన్నాయని వివరించింది. పేజీల నంబరింగ్ క్రమంలో వ్యత్యాసాలు వంటి లోపాలున్నాయని, వాటిని సవరించాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదిని సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ఆదేశించింది. మంగళవారం ఈ వ్యవహారాన్ని ఒక జర్నలిస్ట్ తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ ప్రస్తావించగా, సిజెఐ నేతృత్వంలోని ధర్మాసనం పిటిషనర్లకు భరోసా ఇచ్చింది. లోపాలను సరిదిద్దినట్లయితే వారి అంశాలను విచారణ కోసం జాబితా చేస్తామని తెలిపింది. మేము ఈ పిటిషన్లన్నింటినీ విచారణకు జాబితాచేస్తాము. ముందుగా అందులోని లోపాలన్నీ సవరించేలా చూసుకోండని స్పష్టం చేసింది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో ఖర్గేతో పాటు టిఎంసి ఎంపీ సౌగతా రాయ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, రాష్ట్రీయ జనతా దళ్ నేత తేజస్వీ యాదవ్, నేషనలిస్ట్ కాంగ్రెస్‌పార్టీ (శరద్ పవార్ వర్గం) నేత సుప్రియా సూలే, శివసేననేత సంజయ్ రౌత్, సిపిఐకు చెందిన డి. రాజా, ఝార్ఖండ్ ముక్తి మోర్చాఎంపీ మహువా మాఝీ, సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ, ముస్లిం లీగ్ నేత ఇ.టి. మహమ్మద్ బషీర్ తదితరులు సహ పిటిషనర్లుగా ఉన్నారు. ఈ కేసులో భారత ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషీలను ప్రతివాదులుగా చేర్చారు.




### లడఖ్ భారత్‌లో అంతర్భాగమే

# చైనాకు భారత్ స్ట్రాంగ్ కౌంటర్

## 28 వ్యూహాత్మక ప్రాంతాలకు భారత్ అధికారిక పేర్లు

**లడఖ్, అక్టోబరు 13:** లడఖ్ భారత్ అంతర్భాగమని, చైనా ఎన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసినా ఈ వాస్తవాన్ని మార్చలేరని భారత విదేశాంగ శాఖ స్పష్టంచేసింది. కేంద్ర ప్రభుత్వం లడఖ్‌లోని 28వ్యూహాత్మక ప్రాంతాలకు, భౌగోళిక ప్రదేశాలకు అధికారికంగా పేర్లు నిర్ధారించి భారత మ్యాప్‌లో చేర్చడంపై చైనా అభ్యంతరం వ్యక్తం చేసిన నేపథ్యంలో భారత్ ఈ ప్రకటన చేసింది. ఈ నెల 2న కేంద్ర ప్రభుత్వం లడఖ్‌లోని పలు ప్రాంతాలనుఅధికారికంగా గుర్తించింది. వాస్తవాధీనరేఖ (ఎల్ఎసి) వెంబడి ఉన్న గోగ్రా, హాట్ స్ప్రింగ్స్ వంటి సున్నితమైన సరిహద్దు ప్రాంతాలు కూడా ఈజాబితాలో ఉన్నాయి. 2020లో భారత్, చైనాల మధ్య నెలకొన్న గాల్వాన్ ఘర్షణ సమయంలో గోగ్రా, హాట్ స్ప్రింగ్స్ కీలక ఘర్షణ ప్రాంతాలుగా నిలిచాయి. భారత్ గుర్తించిన ఇతర ప్రాంతాల్లో అలీషీగిరి, బ్రాంగ్సా, చాప్చింగల్ పాస్, కనిష్కపీక్, కరుణనపీర్ పర్వతం, కుక్సెల్, మార్తండ్ గిరి, పార్పిక్ హిమానీనదం, స్క్రామి హిమానీనదం, షాచ్మిరిక్ పాస్, షోర్గా లోయ, జొరావర్ పీక్ తదితర ప్రాంతాలు ఉన్నాయి. అయితే, భారత్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని చైనా విదేశాంగశాఖ ప్రతినిధి మావోనింగ్ తప్పుపట్టారు. భారత్ ఏకపక్షంగా ఈ నిర్ణయాన్ని తీసుకుందని, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతంగా తాము గుర్తించబోమని అన్నారు. భారత్ పేర్లు పెట్టడం చట్టవిరుద్ధమని, చైనా–భారత్ సరిహద్దు పశ్చిమ ప్రాంతంలోని సంబంధిత భూభాగాలు చైనాకే చెందుతాయని ఆమెవాదించారు. తాజా ప్రకటనలో భారత్ చైనా వ్యాఖ్యలకు చెక్ పెట్టింది.

# ఉగ్రవాదంపై పోరులో భారత్ వెనక్కి తగ్గేదేలేదు..

## బిమ్‌స్టెక్ దేశాల హోంమంత్రుల సదస్సులో అమిత్ షా



**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** ఉగ్రవాదంపై పోరులో భారత్ ఎప్పుడూ వెనక్కి తగ్గదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించని విధానాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. బిమ్‌స్టెక్ దేశాల్లో ఉగ్రవాదులకు ఆశ్రయం దొరకకుండా సభ్య దేశాలన్నీ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులను దాచడం, వారికి శిక్షణ ఇవ్వడం, నిధులు సమకూర్చడం వంటి కార్యకలాపాలకు ఈ ప్రాంతంలో ఎలాంటి అవకాశం ఉండకూడదని చెప్పారు. దిల్లీలో మంగళవారం జరిగిన తొలి బిమ్‌స్టెక్ దేశాల హోంమంత్రుల సమావేశంలో అమిత్ షా మాట్లాడారు. సభ్య దేశాల మధ్య పరస్పర నమ్మకం, సహకారం ఉంటేనే ప్రాంతీయ భద్రతను మరింత బలోపేతం చేయగలమని తెలిపారు. ఒక దేశ భద్రతా వ్యవస్థ మరో దేశ భద్రతకు కూడా ఉపయోగపడేలా పనిచేయాలని సూచించారు. ఉగ్రవాదం వంటి సమస్యలను ఎదుర్కోవడంలో అన్ని దేశాలు ఒకే లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. ఉగ్రవాదులు ఒక దేశం నుంచి మరో దేశానికి వెళ్లి దాక్కోవడం, అక్కడ స్థావరాలు ఏర్పాటు చేసుకోవడం, కొత్తవారిని నియమించుకోవడం, శిక్షణ ఇవ్వడం వంటి వాటిని అడ్డుకోవాలని అమిత్ షా అన్నారు. పొరుగు దేశాలపై దాడులకు ప్రణాళికలు వేయడం, వాటి కోసం వనరులను సమకూర్చుకోవడం వంటి చర్యలకు కూడా అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ఉగ్రవాదం ఒక దేశానికే పరిమితమైన సమస్య కాదని, దాని ప్రభావం అనేక దేశాలపై ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రతి దేశం తన భద్రతను మాత్రమే కాకుండా, ఇతర సభ్య దేశాల భద్రతను కూడా దృష్టిలో పెట్టుకుని పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఉగ్రవాదులను, వారి సహాయకులను గుర్తించేందుకు సభ్య దేశాల మధ్య సమాచార మార్పిడి పెరగాలని అమిత్ షా చెప్పారు. ఉగ్రవాదుల వివరాలు, వారికి సహకరించే వ్యక్తులు, నేర ముఠాలు, వారి ఆర్థిక లావాదేవీలు, సరిహద్దులు దాటి జరిగే కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని సకాలంలో పంచుకోవాలని సూచించారు. ఇప్పటికే ఉన్న సంబంధిత సంస్థల ద్వారా ఈ సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం వల్ల ఉగ్రవాదంపై పోరును మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు. ఉగ్రవాదాన్ని అడ్డుకోవడంతోపాటు, దానికి అందుతున్న ఆర్థిక సహాయాన్ని నిలిపివేయడం కూడా ముఖ్యమని అమిత్ షా పేర్కొన్నారు.



# న్యూయార్కు ఎయిర్‌పోర్టులో యూనస్‌కు అవమానం

**న్యూయార్కు, అక్టోబరు 13:** న్యూయార్క్‌లోని జాన్ ఎఫ్. కెన్నెడీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బంగ్లాదేశ్ మాజీ తాత్కాలిక ప్రభుత్వాధిపతి మహమ్మద్ యూనస్‌కు ప్రవాస బంగ్లాదేశీయుల నుంచి తీవ్ర నిరసన ఎదురైంది. బంగ్లాదేశ్ ప్రధాన సలహాదారు పదవికి రాజీనామా చేసిన తర్వాత ఆయన చేసిన తొలి విదేశీ పర్యటనలోనే ఈ ఘటన చోటుచేసుకుంది. భద్రతా కారణాల దృష్ట్యా అధికారులు ఆయనను వెంటనే విమానాశ్రయం నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించారు. నువ్వు బంగ్లాదేశ్‌ను తగలబెట్టావు అంటూ నిరసనలు ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఎయిర్‌పోర్టు బయట గుమిగూడిన నిరసనకారులు యూనస్ కు వ్యతిరేకంగా భారీ ఎత్తున నినాదాలు చేశారు. "నువ్వు ఒక ఉగ్రవాదివి. బంగ్లాదేశ్‌లో వేలాది మందిని, పోలీసులను చంపావు. ఇక్కడికి ఎందుకు వచ్చావు అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహమ్మద్ యూనస్ చర్యల వల్ల దేశంలో ప్రజాస్వామ్యం నాశనమైందని, బంగ్లాదేశ్ అశాంతితో తగలబడి పోయిందని నిరసనకారులు ఆరోపించారు. లోపలికి తిరిగి వెళ్లిన యూనస్ భద్రతా సిబ్బంది చర్యలు ఎయిర్‌పోర్టు బయట పరిస్థితి క్షణక్షణానికి ఉద్రిక్తంగా మారడాన్ని గమనించి యూనస్, ఆయన సహోద్యోగి లామియా మోర్షెడ్ వెంటనే ఎయిర్‌పోర్టు లోపలికి తిరిగి వెళ్లిపోయారని స్థానిక మీడియా పేర్కొంది.

# పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచాలి

## ప్రశ్నపత్రాలకు ఏఐ వినియోగం పరిశీలించాలి

## నీట్ ప్రత్యేక కమిటీ ఛైర్మన్ నందన్ నీలేకని



**న్యూఢిల్లీ,అక్టోబరు 13:** దేశంలో పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంచి, ప్రశ్నపత్రాల లీకేజీలకు అడ్డుకట్టవేయడానికి సాంకేతికతను విస్తృతంగా వినియోగించాలని యూఐడీఏఐ మాజీ ఛైర్మన్, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని సూచించారు. పరీక్ష జరిగే రోజునే ఏఐ సాయంతో ప్రశ్నపత్రాన్ని రూపొందించే విధానాన్ని పరిశీలించాలని సూచించారు. ముందుగానే ప్రశ్నపత్రాలను తయారుచేసి భద్రపరిచే పద్ధతికి బదులుగా చివరి నిమిషంలో ప్రశ్నలను ఎంపిక చేసి పేపర్ రూపొందిస్తే లీకేజీలకు అవకాశాలు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. మంగళవారం భారత్‌లో నిర్వహించిన బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో పాల్గొన్న నీలేకని, దేశ పరీక్షల వ్యవస్థలో సమూల మార్పుల అవసరాన్ని వివరించారు. ప్రస్తుతం పరీక్షలకు ముందుగానే ప్రశ్నపత్రాలను రూపొందించి, వాటిని భద్రపరిచి, పరీక్షా కేంద్రాలకు పంపిణీ చేసే విధానంలో లీకేజీలకు అవకాశాలు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రశ్నపత్రాల తయారీ విధానంలోనే మార్పులు తీసుకురావాలని నీలేకని సూచించారు. ఒకే ప్రశ్నపత్రాన్ని ముందుగానే సిద్ధం చేయడానికి బదులుగా, పెద్ద సంఖ్యలో ప్రశ్నలతో కూడిన ప్రశ్నల బ్యాంకును రూపొందించాలని ప్రతిపాదించారు. పరీక్ష జరిగే రోజున, చివరి నిమిషంలో ఆ బ్యాంకు నుంచి ప్రశ్నలను ఎంపిక చేసి ప్రశ్నపత్రాన్ని తయారు చేయవచ్చని వివరించారు. ఇలా చేయడం వల్ల ముందుగానే ప్రశ్నపత్రాన్ని సంపాదించి విక్రయించాలనే అక్రమ ప్రయత్నాలకు అవకాశాలు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. ప్రశ్నల బ్యాంకు నుంచి పరీక్ష జరిగే రోజే ప్రశ్నపత్రాన్ని రూపొందించేందుకు కృత్రిమ మేధను ఉపయోగించవచ్చా అన్న ప్రశ్నకు నీలేకని సానుకూలంగా స్పందించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పరీక్షా పత్రాలను రూపొందించే అవకాశాలను పరిశీలించవచ్చని సూచించారు. పరీక్షల సంస్కరణల్లో భాగంగా దేశవ్యాప్తంగా కంప్యూటర్ ఆధారిత పరీక్షల నిర్వహణను విస్తరించే అంశాన్నీ కమిటీ పరిశీలిస్తోందని నీలేకని వెల్లడించారు. ప్రస్తుతం ఇలాంటి పరీక్షలు రాయడానికి దేశంలో సుమారు 1.5 లక్షల ప్రదేశాల్లో సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. అన్ని పరీక్షలను కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించాలంటే ఈ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నీట్ పరీక్షల నిర్వహణలో మార్పులను సూచించేందుకు జులైలో కేంద్రం ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. దీనికి నందన్ నీలేకని నేతృత్వం వహిస్తున్నారు.

## హౌతీదాడులతో బంకర్లలోకి

# సౌదీ యువరాజు

**రియాద్, అక్టోబరు 13:** సౌదీ అరేబియాపై యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు క్షిపణి, డ్రోన్ దాడులను తీవ్రతరం చేయడంతో



ఆ దేశ వాస్తవ పాలకుడు, యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ ప్రాణభయంతో అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. అమెరికన్ మీడియా కథనాల ప్రకారం ఆయన రియాద్‌లోని అత్యంత పటిష్ఠమైన భద్రత, బంకర్లు కలిగిన రాజప్రాసాదాల మధ్య తన మకాం మారుస్తున్నారు. ప్రత్యేకంగా ఎంపిక చేసిన భద్రతా బృందం ఆయనకు నిరంతరం కాపలా కాస్తోంది. గడిచిన మంగళవారం ఓ రక్తదాన శిబిరంలో పాల్గొన్న తర్వాత ఆయన మళ్లీ బహిరంగంగా కనిపించలేదు. ఇటీవలి కాలంలో హౌతీలు సౌదీ రాజధాని రియాద్‌ను లక్ష్యంగా చేసుకుని దాడులు పెంచడమే ఈ భద్రతాపరమైన ఆందోళనలకు ప్రధాన కారణం. రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై హౌతీలు ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణి పెను విధ్వంసం సృష్టించింది. ఈ ఘటనలో 12నుంచి 13 మంది ప్రాణాలుకోల్పోగా, 300 మందికి పైగా గాయపడ్డారు. ఎయిర్‌పోర్ట్ టెర్మినల్స్ కూడా తీవ్రంగా దెబ్బతినడంతో విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేశారు. మరోవైపు హౌతీల నుంచి వస్తున్నదాడులను అడ్డుకోవడానికి అవసరమైన ఇంటర్‌సెప్టార్ క్షిపణుల నిల్వలు సౌదీ అరేబియాలో వేగంగా అడుగంటుతున్నాయని సౌదీ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అందుబాటులో ఉన్న వాయురక్షణ వ్యవస్థలను రాజకుటుంబ నివాసాలు, ఇంధన ఉత్పత్తి కేంద్రాలు, ఇతర వ్యూహాత్మక ప్రాంతాల రక్షణ కోసం తరలిస్తున్నారు.



# నీటిని వృథా చేస్తే రూ.5వేలు ఫైన్

## నాగ్‌పూర్ మున్సిపాలిటీ కొత్త నిర్ణయం

**నాగ్‌పూర్, అక్టోబరు 13:** దేశంలో అత్యంత కరువు ఎదుర్కొనే రాష్ట్రాల్లో మహారాష్ట్ర ఒకటి. అక్కడ అనేక ప్రాంతాల్లో నీటి వనరులు చాలా తక్కువ. అందులోనూ ఈసారి ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా పడి, నీటి వనరులు తగ్గిపోయాయి. ఇదే సమయంలో పెద్ద పట్టణాలైన నాగ్‌పూర్, పుణేలను తీవ్ర నీటి కొరత వేధిస్తోంది. ఉన్న నీటి వనరుల్ని సక్రమంగా వాడుకునేలా, నీరు వృథా, దుర్వినియోగం కాకుండా చూసేలా కఠిన చర్యలకు అక్కడి పాలకవర్గం సిద్ధమైంది. దీనిలో భాగంగా నీటిని వృథా చేసేవారికి రూ.5,000 జరిమానా విధించాలని నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిపాదించింది. మరో పెద్ద పట్టణమైన పూనేలో కూడా పాలకవర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై అక్టోబర్ 15 నుంచి వారానికోసారి నీటికి వీక్లీ కట్ ఇవ్వనుంది. ప్రతి గురువారం నీటి సరఫరా ఉండదు. నాగ్‌పూర్‌కు సంబంధించి నీటి రేషనింగ్‌ను ఎన్ఎంసీ పరిశీలిస్తోంది. నగరంలో నీటికొరతపై మేయర్ నీతా తకారే అధికారులతో సమీక్ష జరిపారు. నీటి లభ్యత, సరఫరా వంటి వివరాల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నీటిని సద్వినియోగం చేసుకునే చర్యలపై దృష్టిపెట్టారు.

# డ్రగ్స్‌పై ప్రశ్నించినందుకు లైవ్‌లోనే హత్య

**అమృత్‌సర్, అక్టోబరు 13:** పంజాబ్‌లో తీవ్ర కలకలం రేపిన ఘటనలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఓ సామాజిక కార్యకర్త దారుణ హత్యకు గురయ్యారు. పర్విందర్ సింగ్ జోతా అనే యాక్టివిస్ట్‌ను ఓ మెడికల్ షాపు యజమాని కాల్చి చంపాడు. ఈ దారుణం మొత్తం జోతా ఫేస్‌బుక్ ఖాతా నుంచి ప్రత్యక్ష ప్రసారం కావడం సంచలనం సృష్టిస్తోంది. ఈ ఘటన ఇవాళ ఉదయం పంజాబ్‌లోని మాన్సా పట్టణంలో జరిగింది. కొన్ని సంవత్సరాలుగా డ్రగ్స్ బుక్‌లో లైవ్ స్ట్రీమింగ్ చేస్తుండగా, యజమాని అశ్వనీ కుమార్ తుపాకీ బయటకు తీశాడు. అది చూసిన జోతా ఏమాత్రం భయపడకుండా, నన్ను చంపు అంటూ అతడికి పలుమార్లు సవాలు విసిరాడు. దీంతో ఆగ్రహానికి గురైన అశ్వనీ కుమార్ జోతాపై కాల్పులు జరిపాడు. పొట్ట, తొడ భాగంలోకి బుల్లెట్లు దూసుకెళ్లగా, ఒక బుల్లెట్ కాలేయాన్ని చీల్చడంతో జోతా అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే అతడిని మాన్సా సివిల్ ఆసుపత్రికి తరలించగా,




మాఫియాకు వ్యతిరేకంగా పోరాడుతున్న పర్విందర్ సింగ్ జోతా, స్థానిక మెడికల్ షాపుల్లో సింథటిక్ డ్రగ్స్ అక్రమ అమ్మకాలను సోషల్ మీడియా లైవ్ వీడియోల ద్వారా బహిర్గతం చేస్తుంటారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం, అశ్వనీ కుమార్ అనే వ్యక్తికి చెందిన మెడికల్ షాపు వద్దకు వెళ్లారు. ఉదయం అదే షాపులో నిషేధిత మందులు కొనుగోలు చేశాడని చెబుతున్న ఓ వృద్ధుడిని కూడా ఆయన వెంట తీసుకెళ్లారు. డ్రగ్స్ అమ్మకాలపై యజమానిని నిలదీయడంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ వాగ్వాదాన్ని జోతా ఫేస్ అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ కాల్పుల్లో జోతా సహచరులలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. హత్య అనంతరం నిందితుడు అశ్వనీ కుమార్ అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు అతడిని గుర్తించి, పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడిపై గతంలోనూ పలు కేసులు నమోదై ఉన్నాయని పోలీసులు తెలిపారు. తన క్రియాశీల కార్యకలాపాల వల్ల జోతా కూడా 2023లో ఒకసారి అరెస్ట్ అయ్యారు. ఈ హత్య ఘటన పంజాబ్‌లో మాదకద్రవ్యాల సమస్య తీవ్రతను మరోసారి కళ్లకు కట్టింది.

# సంక్షిప్త వార్తలు

## జంతర్‌మంతర్ వద్ద సిజెపి నేతల అరెస్టు



**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** ప్రధాన ఎన్నికలకమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలో భాగంగా కాక్రోచ్ జనతాపార్టీ నాయకులు మంగళవారం ఉదయం జంతర్ మంతర్‌కు చేరుకున్నారు. సీజేపీ నేతలు అశుతోష్ రంకా, సౌరవ్ దాస్ నేతృత్వంలో నిరసనకారులు ఆందోళనలను చేపట్టారు. అయితే వీరిని ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారంటూ సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సోషల్ మీడియాలో ఓ వీడియో పోస్ట్ చేశారు. ఆ వీడియోలో నిరసనకారులు బారికేడ్లు, గేట్లను దూకుతూ నిరసన ప్రదేశానికి వెళ్తున్నట్లు కనిపిస్తోంది.

## యుపిఐ ఎండిఆర్ ఛార్జీలు పండగ సీజన్ తర్వాతే




**ముంబయి, అక్టోబరు 13:** యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిపే మర్చంట్ లావాదేవీలపై ప్రతిపాదిత ఎండీఆర్ ఛార్జీల అమలును వాయిదా వేస్తున్నట్టు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ప్రకటించింది. పండగ సీజన్ సమీపిస్తున్న తరుణంలో వ్యాపారుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. దీంతో వ్యాపార వర్గాలకు తాత్కాలికంగా ఊరట లభించినట్లయింది. ఈ విషయంపై మంగళవారం సమావేశమైన యూపీఐ అండ్ సర్వీసెస్ స్టీరింగ్ కమిటీ, ఈ నిర్ణయాన్ని ఖరారు చేసింది.

## పరువు నష్టంకేసులో రాహుల్‌కు సుప్రీంలో ఊరట



**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** ప్రధాని నరేంద్ర మోడీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎదుర్కొంటున్న పరువునష్టం కేసులో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో కింది కోర్టు విచారణపై మధ్యంతర స్టే విధిం చింది. రాహుల్ పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని మహారాష్ట్ర ప్రభుత్వం, ఫిర్యాదుదారుకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలని ఆదే శించింది. రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.

## రాహుల్ నన్ను తోసేశారు..మహిళా జర్నలిస్టు ఆరోపణ

**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఒక మహిళా జర్నలిస్ట్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఢిల్లీలో సుప్రీంకోర్టు సమీపంలో జరిగిన నిరసన కార్యక్రమంలో రాహుల్ తన చేయి పట్టుకుని లాగి, తోసేశారని ఆమె ఆరోపించారు. మూడు నెలల గర్భిణి అయిన జర్నలిస్ట్ రిచా పరాశర్ ఈ ఘటన తర్వాత ఆసుపత్రిలో చేరారు. అయితే, ఈ ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఇదంతా బిజెపి చేస్తున్న దుష్ప్రచారమని కొట్టిపారేసింది.

## అంతరిక్షంలో వ్యోమగామి అనిల్ మీనన్ యోగాసనాలు



**న్యూయార్కు, అక్టోబరు 13:** భారత సంతతికి చెందిన నాసా వ్యోమగామి, యూఎస్ స్పేస్‌ఫోర్స్ కల్నల్ అనిల్ మీనన్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి ఒక స్ఫూర్తిదాయక వీడి యోను పంచుకున్నారు. అంతరిక్షంలో గురుత్వాకర్షణలేని (మైక్రోగ్రావిటీ) స్థితిలో వ్యాయామం ఎంత కీలకమో వివరిస్తూ ఆయన శీర్షాసనం వేయడంతో పాటు ఇతర కఠినమైన వర్కౌట్లు చేస్తున్న దృశ్యాలు ఈ వీడియోలో ఉన్నాయి. స్టే హార్డ్ అనే క్యాప్షన్‌తో ఆయన ఈ వీడియోను పోస్ట్ చేశారు. అంతరిక్షంలో వ్యాయామం చేయడానికి ఏకాగ్రత, సంకల్పం, పట్టుదల ఎంతో అవ సరమని అనిల్ మీనన్ పేర్కొన్నారు.

## ఆసియా పర్యటనలో కిమ్‌తో ట్రంప్ మళ్లీ భేటీ..



**వాషింగ్టన్, అక్టోబరు 13:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధినేత కిమ్‌జోంగ్ ఉన్ మరోసారి సమావేశమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వచ్చేనెలలో ఆసియా పర్యటనకు వెళ్లనున్న ట్రంప్.. కిమ్‌తో భేటీ అయ్యే అంశాన్ని తోసిపుచ్చలేదు. వచ్చే నెల 16న ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగే ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో ట్రంప్ పాల్గొననున్నారు. అనంతరం చైనాలోని షెన్‌జెన్‌లో నవంబరు 17 నుంచి 19 వరకు జరిగే ఏపీఈసీ సదస్సుకుహాజరవుతారు. ఈ పర్యటనలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తోనూ ట్రంప్ సమావేశం కానున్నారు. ఈ ఏడాదిలో వీరిద్దరూ భేటీ కావడం ఇది మూడోసారి కానుంది.



ప్రజాభవన్‌లో మంగళవారం మీ సేవ సర్టిఫికెట్లను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

# తడిసినా చెడిపోని మీ సేవ సర్టిఫికెట్లు

## 15 అత్యాధునిక భద్రతా ఫీచర్లతో కొత్త పేపర్

## యేళ్ల తరబడి భద్రంగా దాచుకునేలా ప్రత్యేక తయారీ

## మీసేవ సర్టిఫికెట్లకు ఇక లామినేషన్ పని లేదు

## ప్రజాభవన్‌లో ప్రారంభించిన ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్,అక్టోబరు13,ప్రభాతవార్త:** ప్రభుత్వ ధ్రువపత్రాల భద్రత, మన్నిక పెంచే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. చినిగిపోకుండా, నీళ్లు పడినా దెబ్బతినకుండా ప్రత్యేకంగా రూపొందించిన కొత్త మీ సేవ సర్టిఫికెట్ పేపర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం ప్రారంభించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రాజ్ ఠాకూర్, విజయ రమణారావు, ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (నిఋదీ) కమిషనర్ టి. రవికిరణ్, అధికారులు, ప్రింటింగ్ ఏజెన్సీలు, సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. కొత్త మీ సేవ సర్టిఫికెట్ పేపర్‌లో 15 అత్యాధునిక భద్రతా ఫీచర్లను పొందుపరిచారు. నకిలీ సర్టిఫికెట్ల తయారీ, అనధికార నకళ్లను అరికట్టేలా వీటిని రూపొందించారు. భద్రతా కారణాలతో ఈ ఫీచర్ల పూర్తి వివరాలను వెల్లడించడం లేదు. ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన ఈ పేపర్ సులభంగా చినిగిపోదు. నీళ్లు పడినా త్వరగా దెబ్బతినదు. సాధారణ వినియోగం, మడతపెట్టడం, ఎక్కువ కాలం భద్రపరచడం వల్ల కలిగే నష్టాన్ని తగ్గిస్తుంది. దీంతో సర్టిఫికెట్లను ఏళ్ల తరబడి మంచి స్థితిలో దాచుకునే అవకాశం ఉంటుంది. సాధారణ పరిస్థితుల్లో వాటికి లామినేషన్ చేయించాల్సిన అవసరం కూడా తగ్గుతుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు విద్య, ఉద్యోగ, ఇతర అధికారిక అవసరాలకు ఉపయోగించే సర్టిఫికెట్లు ప్రజల జీవితంలో ఎంతో ముఖ్యమైనవని పేర్కొన్నారు. కొన్ని పత్రాలను జీవితాంతం భద్రంగా ఉంచుకోవాల్సి ఉంటుందన్నారు. అలాంటి ధ్రువపత్రాలు త్వరగా పాడవకుండా చూడటంతో పాటు వాటి విశ్వసనీయతను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజలకు అందించే ప్రభుత్వ సేవల్లో నాణ్యత, భద్రత, సౌలభ్యాన్ని మరింత పెంచే దిశగా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని మంత్రి వివరించారు. కొత్త సెక్యూరిటీ పేపర్‌తో సర్టిఫికెట్ల మన్నిక పెరగడంతో పాటు నకిలీలను అరికట్టేందుకు వీలవుతుందన్నారు. ప్రభుత్వ ధ్రువపత్రాలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో మీ సేవ కేంద్రాల ద్వారా ప్రజలకు అనేక రకాల ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. 2011 నుంచి మీ సేవ సర్టిఫికెట్ల ముద్రణకు ప్రత్యేక సెక్యూరిటీ పేపర్‌ను వినియోగిస్తున్నారు. ఇప్పటివరకు ఉన్న పేపర్ స్థానంలో మరింత నాణ్యత, భద్రత, మన్నిక కలిగిన కొత్త పేపర్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యంగా జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు దీర్ఘకాలం భద్రపరచాల్సిన ఇతర ప్రభుత్వ పత్రాలకు ఇది ఎంతో ఉపయోగపడనుంది.

# పార్ములా ఇ-కార్ రేసు కేసుపై రంకెలేసిన కెటిఆర్‌లో ఇప్పుడు భయం

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్,అక్టోబరు 13,ప్రభాతవార్త:** ఫార్ములా కార్ రేసు కేసు లొట్టపీసు కేసు అంటూ రంకెలు వేసి గొప్పలు కొట్టిన కెటిఆర్ ఇప్పుడు గడగడ వణికిపోతున్నారని కోర్టులకు పరుగులు పెడుతున్నాడని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. ఫార్ములా ఇ కార్ రేసు కేసుపై డిశ్చార్జ్ పిటిషన్ ఫైల్ చేసి తప్పించుకోవాలని చూస్తు న్నాడని ఆరోపించారు. మంగళవారం విప్ మాట్లాడుతూ తప్పు చేయకపోతే కెటిఆర్ ఎందుకు భయపడుతున్నాడు? ఇంతకాలం ఎందుకు గొప్పలు కొట్టాడు? విచారణను ఎదుర్కోవడానికి కెటిఆర్ భయపడుతున్నట్లు కనిపిస్తోంది. విచారణకు పిలిచినప్పుడు ఎసిబి ఆఫీసు ముందు కెటిఆర్ పెద్దషో చేశాడు. కేసులో ఏమీ లేదు, ఏం పీక్కుంటారో పీక్కోండి అని పిచ్చిపిచ్చిగా మాట్లాడాడు.. అని ఆయన గుర్తుచేశారు. ఫార్ముల ఇ ఆపరేషన్ సంస్థకు రూ 54.88 కోట్ల చెల్లింపుపై సమాధానం చెప్పు అని అడిగారు. ఎవరి అనుమతితో ఈ డబ్బులు పంపావో చెప్పాలన్న ప్రశ్నకు ఇప్పటివరకు సమాధానం లేదని తెలిపారు. నువ్వు తప్పు చేయకపోతే న్యాయస్థానంలో నీ నిజాయితీ నిరూపించుకో అని సవాల్ చేశారు. డిశ్చార్జ్ పిటిషన్లు వేసి మధ్యలోనే తప్పించుకునే ప్రయత్నం ఎందుకు చేస్తున్నావు? లొట్టపీసు కేసు అన్న కెటిఆర్ ఇప్పుడు దాక్కునే ప్రయత్నం చేస్తున్నాడు. స్టార్ హోటళ్ల భాగోతం బయటకు రావడంతో చలి, జ్వరం వచ్చి తప్పించుకుని కెటిఆర్ తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు. గజగజా వణికిపోతున్నాడు. ఇప్పుడు ఫార్ములా ఇ కార్ రేసు కేసులో ఎక్కడ దొరికిపోతానోనని దొంగదార్లు వెతుక్కుంటున్నాడని విమర్శించారు. కెటిఆర్ వైఖరిని తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలి. మాకు న్యాయస్థానాలపై నమ్మకం ఉందని కెటిఆర్ అక్రమాలు బయటకు వస్తాయన్న విశ్వాసం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# మున్సిపాలిటీల ఖాతాల్లోకి రూ.296 కోట్లు

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మున్సిపాలిటీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. 16వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు రాష్ట్రానికి కేటాయించిన నిధుల్లో నుంచి మున్సిపాలిటీల వాటా కింద రూ.296 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 16వ ఆర్థిక సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా స్థానిక సంస్థలకు అందాల్సిన గ్రాంట్లలో రాష్ట్ర వాటాను ప్రభుత్వం సమకూర్చింది. ఆ నిధులతో ప్రధానంగా పట్టణాల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం తొలగింపు, ఘన వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా వ్యవస్థల మెరుగుదల, లీకేజీల నివారణ, పాత మోటార్లు, పైప్‌లైన్ల మరమ్మతులు చేపట్టనున్నారు.

# ఎలుకల పేరు చెప్పి తప్పించుకుంటారా?

## రిమ్స్ అగ్నిప్రమాద ఘటన, నివేదికలపై కెటిఆర్ ట్వీట్

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** రిమ్స్ ఆదిలాబాద్‌లో అగ్నిప్రమాదం జరిగి ఐదుగురు పసికందులు ప్రాణాలు వదిలిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎలుకల పేరు చెప్పి తప్పించుకుంటారా? అని మంగళవారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. నవజాత శిశువుల వార్డులో ఎలుకలు తిరగడమే దారుణమని, ఆ ఎలుకలు ఏసీ వైర్లు కొరకడం వల్లే అగ్నిప్రమాదం జరిగిందని చెప్పడం ఇంకా సిగ్గుచేటని కేటీఆర్ మండిపడ్డారు. రేవంత్ సర్కార్ అసమర్థత వల్లే ఐదుగురు శిశువులు చనిపోయారని స్పష్టంగా తెలుస్తున్నా.. ఇలాంటి పనికిమాలిన నివేదికలు ఇచ్చి ఎవరిని మభ్యపెడుతున్నారని, ఎవరిని కాపాడటానికి ఈ దొంగ రిపోర్టులు ఇస్తున్నారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డికి తన సొంత ప్రైవేట్ ఆసుపత్రులపై ఉన్న శ్రద్ధ ప్రభుత్వ ఆసుపత్రులపై లేదని కేటీఆర్ విమర్శించారు. అందుకే కనీస నిర్వహణ, పర్యవేక్షణ లేక ఆసుపత్రులు సమస్యల వలయంలో ఉన్నాయని అన్నారు. ఇది పసికందుల ప్రాణాలు తీసిన కాంగ్రెస్ మార్క్ నిరక్ష్ష్యమని, కాంగ్రెస్ పార్టీ చేసిన ఈ నేరపూరిత నిర్లక్ష్యానికి ఆ పసికందుల కుటుంబాల ఉసురు తగలడం ఖాయమని ట్వీట్ చేశారు.

# దీర్ఘకాలిక విద్యుత్ అవసరాలకు చెక్

## పునరుత్పాదక ఇంధన కొనుగోలు ప్రారంభం

## 6000 మెగావాట్ల సౌర, పవన, బ్యాటరీ నిల్వ విద్యుత్

## టెండరు ప్రక్రియ ప్రారంభించిన రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడానికి పునరుత్పాదక విద్యుత్‌ను కొనుగోలు చేసే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ విద్యుత్ ఉత్పాదన కార్పొరేషన్ (టీజీజెన్కో), తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి కార్పొరేషన్ (టీజీరెడ్కో) ద్వారా అమలు చేస్తోంది. జెన్కో అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, ఈ పథకం కింద గంటకు 6000 మెగావాట్ బ్యాటరీ నిల్వతో కూడిన 3000 మెగావాట్ల సౌర విద్యుత్, 800 మెగావాట్ల పవన విద్యుత్, 2 000 మెగావాట్ల 24 గంటల పునరుత్పాదక విద్యుత్, 2000 మెగావాట్ బ్యాటరీ శక్తి నిల్వ కోసం టెండర్ ప్రక్రియను ప్రారంభించింది. ఈ చర్య నమ్మకమైన, సరసమైన మరియు స్వచ్ఛమైన విద్యుత్‌ను అందించడంలో సహాయపడుతుందని ఈ సందర్భంగా జెన్కో అధికారవర్గాలు వెల్లడించాయి. ఇక తెలంగాణలో గరిష్ట విద్యుత్ డిమాండ్ సుమారు 19,892 మెగావాట్లకు చేరుకుంది. పారిశ్రామిక వృద్ధి, పట్టణీకరణ, డేటా సెంటర్లు, ఎలక్ట్రిక్ వాహనాలు, సాగునీటి అవసరాలు, భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కారణంగా డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందని విద్యుత్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని సౌర విద్యుత్‌తో పాటు, బ్యాటరీ నిల్వను 25 సంవత్సరాల కాలానికి సమకూర్చనున్నారు. ఈ బ్యాటరీలు పగటిపూట ఉత్పత్తి అయ్యే అదనపు సౌర విద్యుత్‌ను నిల్వ చేసి, డిమాండ్ ఎక్కువగా ఉండే సాయంత్రం, రాత్రి వేళల్లో దానిని సరఫరా చేస్తాయి. 800 మెగావాట్ల పవన విద్యుత్‌ను కూడా 25 సంవత్సరాల కాలానికి కొనుగోలు చేయనున్నారు. పవన విద్యుత్ సాయంత్రం మరియు రాత్రి వేళల్లో సరఫరాకు తోడ్పడి, ఒకే ఇంధన వనరుపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని భావిస్తున్నారు. 2000 మెగావాట్ల నిరంతర పునరుత్పాదక విద్యుత్‌ను 25 సంవత్సరాల పాటు కొనుగోలు చేస్తారు. రోజంతా స్థిరమైన విద్యుత్‌ను అందించడానికి సౌర, పవన, బ్యాటరీ నిల్వను ఉపయోగించనున్నట్లు విద్యుత్ ఉత్పత్తి సంస్థ అధికారులు వెల్లడించారు.

# ఉపాధి హామీ ఉద్యోగులకు రేవంత్ సర్కార్ శుభవార్త

## గ్రాట్యుటీ మంజూరు, రూ.10 లక్షల ప్రయోజనం



**హైదరాబాద్,అక్టోబరు13,ప్రభాతవార్త:** తెలంగాణలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయిస్ (ఎఫ్‌టీఈ)కు రేవంత్ రెడ్డి ప్రభుత్వం శుభవార్త అందించింది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న గ్రాట్యుటీ సమస్యకు పరిష్కారం చూపింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో సుమారు 3,800 మంది ఉద్యోగులకు ఈ ప్రయోజనం కలగనుంది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం జీవో జారీ చేసింది. దసరా పండుగకు ముందు తీసుకున్న ఈ నిర్ణయం ఉద్యోగుల్లో ఆనందాన్ని నింపింది. దాదాపు రెండు దశాబ్దాలుగా ఎఫ్‌టీఈ ఉద్యోగులు గ్రాట్యుటీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రి సీతక్క చొరవతో ఈ సమస్య పరిష్కార దిశగా అడుగులు పడటంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు సంబంధిత అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అర్హులైన ఎఫ్‌టీఈ ఉద్యోగులకు పదవీ విరమణ సమయంలో కనీసం రూ.4 లక్షల గ్రాట్యుటీ ప్రయోజనం లభించనుంది. 10 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులకు సుమారు రూ.10 లక్షల వరకు ప్రయోజనం అందే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

ఉద్యోగికి అందే గ్రాట్యుటీ మొత్తం వారి సర్వీసు కాలం, వర్తించే నిబంధనలు, ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లోని అర్హత ప్రమాణాలపై ఆధారపడి ఉంటుంది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న తమ డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించి నిర్ణయం తీసుకోవడంపై ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసినందుకు మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు.

అలాగే సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహకారంతోనే ఈ నిర్ణయం సాధ్యమైందని ఉద్యోగులు పేర్కొంటూ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగుల హక్కులు, ఆత్మగౌరవానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. దీర్ఘకాలం కష్టపడి పనిచేసిన ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకూడదన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని ఆమె వివరించారు.

# పోస్టుమెట్రిక్ విద్యార్థులకు రూ.204 కోట్ల భరోసా

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కింద 32,976 మంది విద్యార్థులకు మొత్తం రూ.204.40 కోట్ల నిధులు విడుదలయ్యాయని చెప్పారు.

ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తన 40 శాతం వాటాగా రూ.101.44 కోట్లు, కేంద్ర ప్రభుత్వం 60 శాతం వాటాగా రూ.102.96 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. కళాశాలల నుంచి అందుతున్న పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అర్హత ఉన్న విద్యార్థులకు దశలవారీగా స్కాలర్‌షిప్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా, స్కాలర్‌షిప్‌ల చెల్లింపులు సకాలంలో జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ఆర్థిక పరిస్థితుల కారణంగా ఏ ఒక్క ఎస్సీ విద్యార్థి ఉన్నత విద్యకు దూరం కాకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని స్కాలర్‌షిప్ ప్రక్రియలో జాప్యాన్ని తగ్గించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

అర్హులైన ప్రతి విద్యార్థికి ప్రభుత్వ సహాయం అందేలా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు.

### హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు రూ.14.68 కోట్లు

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిల చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.14.68 కోట్లను విడుదల చేసింది. విద్యార్థుల విద్యకు సంబంధించిన ఫీజు బకాయిలను పరిష్కరించడంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని మంత్రి తెలిపారు. విద్యార్థుల విద్య, సంక్షేమానికి అవసరమైన నిధులను సమకూర్చడంతో పాటు, అర్హులైన ప్రతి విద్యార్థికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం చర్యలు చేపడుతోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు.

# అన్ని పార్టీల నేతల భూములపై నిష్పక్షపాత విచారణ జరపాలి

## జిఓ 134 ఒక కుట్ర.. కక్ష సాధింపే: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



తెలంగాణ భవన్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ నేతల భూములపై ప్రతీకారేచ్ఛతోనే విచారణకు ఆదేశించారని బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. సంబంధం లేని భూములను సైతం వివాదాల్లోకి లాగేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సంబంధించిన భూములపైనా విచారణ జరపాలని, కాంగ్రెస్ నేతలు, వారి కుటుంబ సభ్యుల భూములపై కూడా సమగ్ర విచారణ చేపట్టాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కోరారు. అధికారంలో ఉన్నవారు రాజకీయ కక్షతో వ్యవహరించకుండా, అన్ని పక్షాలకు చెందిన నేతల భూములపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతల భూములపై విచారణ చేపట్టకపోతే అన్ని రకాలుగా పోరాటం చేస్తామని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 134 రాజ్యాంగ విరుద్ధమని, రాజకీయ కక్ష సాధింపు చర్య అని తీవ్రంగా ఆరోపించారు. ఈ అంశంపై అసెంబ్లీలో ఏకపక్షంగా చర్చ జరిగిందని ఆయన విమర్శించారు. ఈ జీవో రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ఉల్లంఘిస్తోందని, చట్టం ముందు సమానత్వం అనే సూత్రాన్ని ఇది దెబ్బతీస్తోందని ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈ ఉత్తర్వుల జాబితాలో కేవలం బీఆర్ఎస్ నాయకుల భూములే ఉన్నాయని, ఇది ఉద్దేశ పూర్వకంగా చేసిన కుట్ర అని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇతర మంత్రులు ముందే ప్రణాళిక వేసుకుని ఈ జీవోను తీసుకొచ్చారని విమర్శించారు. సెప్టెంబర్ 7న ఉద్దేశపూర్వకంగానే తమ పార్టీ నేతలను అసెంబ్లీలోకి రాకుండా అడ్డుకున్నారని, చర్చలో పాల్గొనకుండా అసాధారణ రీతిలో సస్పెండ్ చేశారని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని పలు సమస్యలపై మాట్లాడేందుకు బీఆర్ఎస్ నేతలు సిద్ధమైనా, వారికి అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు.

భూవివాదాలను పరిశీలించే కమిటీ.. రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు ఇతర కాంగ్రెస్ నేతల భూములపై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూకు లేఖ రాసినట్లు ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను కూడా సిఎస్‌కు పంపించానని వెల్లడించారు.

# ఫారం-7 దరఖాస్తులపై పరిమితులు

## ఓట్ల తొలగింపు యత్నాలకు ఇసి అడ్డుకట్ట

**హైదరాబాద్,అక్టోబరు13,ప్రభాతవార్త:** ఓట్ల తొలగింపునకు జరుగుతున్న ప్రయత్నాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఫారం-7 దరఖాస్తులపై పరిమితులు విధిస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది. ఎస్ఐఆర్ సమయంలో ముసాయిదా జాబితా ప్రచురించక ముందు మొత్తంలో గరిష్టంగా 50, రోజుకు పది వరకు ఫారం7లు ఇచ్చే అవకాశాన్ని బీఎల్ఏలకు సీఈసీ కల్పించింది. అయితే హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో వెలుగు చూసిన ఘటనపై స్పందించిన సీఈసీ ఫారం 7లపై అనుసరించాల్సిన విధానాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులకు మార్గదర్శకాలు ఇచ్చింది. అభ్యంతరాలు, క్లెయిమ్‌ల సమయంలో ఒక వ్యక్తి గరిష్టంగా ఏడు ఫారం-7లు మాత్రమే ఇవ్వొచ్చునని సీఈసీ స్పష్టం చేసింది. ఫారమ్ 7లో పూర్తి వివరాలు, అభ్యంతరం వ్యక్తం చేసిన వారి సంతకాన్ని ఈఆర్ఓ పరిశీలించాలి. ఫారం7 దరఖాస్తు చేసిన వారికి నోటీసు ఇచ్చి వారి అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా నమోదు చేసి ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. ఉద్దేశపూర్వంగా తప్పుడు ఫిర్యాదు చేసినట్లు తేలితే ఫారం-7 సమర్పించిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని సీఈసీ తెలిపింది. ఫారం7లపై సీఈసీ మార్గదర్శకాలను కలెక్టర్లు, ఈఆర్‌వోలకు పంపించారు. వాటిని కచ్చితంగా పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఫారం-7పై తప్పుడు ఫారం సమర్పిస్తున్నారనే ఆరోపణలు అధికంగా వస్తున్నాయి. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. దరఖాస్తులను పరిశీలించి, అభ్యంతరం తెలిపిన వ్యక్తిని నేరుగా విచారించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటారు. క్లెయిలు, అభ్యంతరాల స్వీకరణ సమయంలో కొత్త నిబంధన ప్రకారం ఒక ఓటరు గరిష్ఠంగా పది ఫారాలు మాత్రమే సమర్పించాలని ఉంది. ఈ నిబంధన ప్రకారం ఫారం-7 అందజేసిన వ్యక్తికి ఎన్నికల నమోదు అధికారి నోటీసు ఇస్తారు. ఒక్కో దరఖాస్తుదారుని వాంగ్మూలం నమోదు చేసుకుంటారు. ఫారం-7 పై దరఖాస్తుదారు సొంత సంతకం ఉండాలి. కేవలం రబ్బరు స్టాంప్ లేదా సీల్ ఉన్న దరఖాస్తులను స్వీకరించరు. అభ్యంతరం ఉన్న వారికి కూడా వాదన వినిపించేందుకు అవకాశం కల్పిస్తారు. ఈఆర్వోలు సంతృప్తి చెందాక ఓటర్ల నమోదు నిబంధనలు 1960లో 19, 20 నిబంధనల కింద దరఖాస్తును పరిష్కరిస్తారు. ఈ నిబంధన అమలు చేయాలని అన్నీ రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు ఈసీ ఆదేశాలు జారీ చేసింది.

# నేడు గాంధీభవన్‌లో బతుకమ్మ వేడుకలు

## పిసిసి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

**హైదరాబాద్, అక్టోబర్ 13 ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం గాంధీ భవన్, హైదరాబాద్‌లో బతుకమ్మ సంబరాలు నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ తెలిపారు.

ఈ సందర్భంగా నిర్వహించనున్న బతుకమ్మ సంబరాలకు రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు హాజరుకానున్నారని తెలిపారు. బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, ప్రకృతితో ముడిపడిన మన సంప్రదాయాలకు ప్రతీక అని ఎర్రబెల్లి స్వర్ణ పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతిని భావితరాలకు అందించడంతో పాటు మహిళల ఐక్యతను చాటిచెప్పేలా ఈ వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఈ బతుకమ్మ సంబరాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని ఎర్రబెల్లి స్వర్ణ సాదరంగా ఆహ్వానించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పే ఈ వేడుకల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై బతుకమ్మ పండుగ విశిష్టతను చాటాలని ఆమె కోరారు.

# ఆమ్రపాలి కేడర్ వివాదం..

## హైకోర్టులో తీర్పు రిజర్వ్

**హైదరాబాద్,అక్టోబరు13,ప్రభాతవార్త:** సీనియర్ ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి తన క్యాడర్ కేటాయింపు వివాదంపై దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం తెలంగాణ హైకోర్టులో విచారణ ముగిసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. దీంతో ఆమె క్యాడర్ కేటాయింపుపై నెలకొన్న ఉత్కంఠ కొనసాగుతోంది. రాష్ట్ర విభజన అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆమ్రపాలిని ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు కేటాయించింది. అయితే, కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆమ్రపాలి కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన క్యాట్, ఆమెను ఏపీకి కేటాయిస్తూ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేయడంతో పాటు, తెలంగాణ క్యాడర్‌కు కేటాయించాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా, క్యాట్ వెలువరించిన ఈ తీర్పుపై తెలంగాణ హైకోర్టు గతంలో స్టే విధించింది. దీంతో క్యాట్ ఆదేశాల అమలు నిలిచిపోయింది. హైకోర్టు ఇచ్చిన ఈ స్టే ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆమ్రపాలి ఉన్నత న్యాయస్థానంలోనే మరో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. హైకోర్టు వెలువరించే తుది తీర్పుతో ఆమ్రపాలి క్యాడర్ కేటాయింపు వ్యవహారంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# కొత్త, ముసాయిదా జాబితాలో లేని ఓటర్ల కోసం ప్రత్యేక క్యాంప్‌లు



రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్,అక్టోబరు13,ప్రభాతవార్త:** తెలంగాణలో కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా సవరణ కోసం ఎన్నికసంఘం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్తగా అర్హత సాధించిన వారు, ముసాయిదా జాబితాలో పేర్లు లేని వారి కోసం ప్రత్యేక క్యాంప్‌లను ఏర్పాటు చేస్తున్న ట్లుగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఈ నెల 15, 16 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలు నిర్వ హించ నున్నట్లుగా పేర్కొన్నారు. కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువ ఓటర్లు ఈ క్యాంప్లను సద్వినియోగం చేసుకుని ఫారమ్6 దరఖాస్తును సమర్పించి తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సీఈవో సూచించారు.

అదేవిధంగా, ప్రస్తుతం విడుదల చేసిన డ్రాఫ్ట్ జాబితాలో ఎవరి పేరు కనిపించకపోయినా, జాబితాలో పేరు లేనివారు వెంటనే ఫారమ్6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు.

ఈ స్పెషల్ క్యాంప్ల ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన వారందరి పేర్లను వచ్చే నవంబర్ 9న విడుదల చేయబోయే తుది ఓటర్ల జాబితాలో చేర్చనున్నట్లుగా సీఈవో సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. ఈ సదావకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. యువ ఓటర్లు ఫారమ్6 సమర్పించి ఓటు నమోదు చేసుకోవాలని, డ్రాఫ్ట్ జాబితాలో పేరు లేనివారు ఫారమ్6 ఇవ్వాలని సూచించారు.

# ప్రతిబుధవారం ఆకస్మిక తనిఖీలు

## బకాయి మిల్లర్ల ఆస్తులు జప్తు

## శిక్షణ పొందిన సివిల్ సప్లయ్ తనిఖీ బృందాలకు

## సివిల్‌సప్లయ్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర హితవు

**హైదరాబాద్, అక్టోబరు 13, ప్రభాతవార్త:** ప్రతి బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టి చట్ట ప్రకారం ఏలాంటిలోటుపాట్లు తలెత్తకుండా ఎఫ్ఐఆర్ రూపొందించి మోసగించిన మిల్లర్ల ఆస్తులు జప్తు చేయాలని సివిల్‌సప్లయ్ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర హితవుచెప్పారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎక్స్ అఫీషియో ముఖ్య కార్యదర్శి ఎం. స్టీఫెన్ రవీంద్ర మంగళవారం ఫీల్డ్ ఆఫీసర్లకు ఒక ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో దిశానిర్దేశం చేశారు. మూడు బ్యాచ్‌లుగా హాజరైన డిప్యూటీ తహసీల్దార్లకు ఆయన స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. బకాయిలు చెల్లించని రైస్ మిల్లర్లలో భయం పుట్టించేలా తెలంగాణ పౌరసరఫరాల శాఖ కఠిన చర్యలకు దిగింది. ప్రభుత్వానికి డబ్బు ఎగ్గొట్టిన వారి ఆస్తులను జప్తు చేయడానికి కఠినమైన రెవెన్యూ రికవరీ చట్టాన్ని వాడుకుంటోంది. ప్రజల డబ్బును తిరిగి రాబట్టడానికి, రాష్ట్రవ్యాప్తంగా డిపార్ట్‌మెంట్ ఒక స్పెషల్ డ్రైవ్ మొదలుపెట్టింది. ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సిఎంఆర్ బియ్యం లేదా ధాన్యం ఇవ్వకుండా ఆపుకున్న మిల్లర్ల ఆస్తులను అటాచ్ చేసి, వారి మిల్లులోని యంత్రాలను వేలం వేయనున్నారు. ధాన్యం అయినా ఇవ్వండి, లేదా తక్షణమే ఆర్థిక చర్యలు ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండండి. ఎవరికీ భయపడకుండా నిజాయితీగా డ్యూటీ చేయాలని, అందుకు డిపార్ట్‌మెంట్ తరపున వారికి పూర్తి అండ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ తనిఖీల కోసం కొత్తగా ఫిజికల్ వెరిఫికేషన్ మొబైల్ యాప్‌ను వాడుతున్నారు. తప్పు చేస్తున్న మిల్లర్లను పట్టుకోవడానికి ఫీల్డ్ టీమ్స్ ప్రతి బుధవారం సర్ ప్రైజ్ చెకింగ్స్ చేస్తాయి. దీని ద్వారా కోర్టులో బలమైన కేసులు నమోదు చేస్తారు. చట్టబద్ధమైన చర్యలు తీసుకునేలా పక్కాగా డిజిటల్ ఆధారాలు ఎలా సేకరించాలో ఆఫీసర్లకు ట్రైనింగ్ ఇచ్చారు. ఏ చిన్న అవకాశాన్ని వదలకుండా, ట్రైనింగ్ పూర్తయిన వెంటనే అధికారులకు ప్రాక్టికల్ మాక్ టెస్టులు కూడా నిర్వహించారు. మిల్లర్లకు వెళ్తున్న క్లియర్ మెసేజ్ ఏంటంటే వాళ్ళు ప్రభుత్వానికి బాకీ ఉన్న ప్రతి పైసాను వదిలిపెట్టకుండా వసూలు చేస్తారు, అది డబ్బు, ధాన్యం లేదా బియ్యం ఏ రూపంలో అయినా సరే. రాబోయే రోజుల్లో ఈ స్పెషల్ ట్రైనింగ్‌ను జిల్లా పౌరసరఫరాల అధికారులు, జిల్లా మేనేజర్లకు కూడా ఇవ్వనున్నారు.

ప్రజల డబ్బును కాపాడేందుకు పౌరసరఫరాల శాఖ దృఢ నిశ్చయంతో ఉంది. ప్రభుత్వాన్ని మోసం చేయాలని చూసే ఏ మిల్లర్ అయినా సరే, ఆర్ఆర్ చట్టం కింద వేగంగా, తీవ్రమైన చట్టపరమైన చర్యలు ఎదుర్కోక తప్పదనీ ఆయన హెచ్చరించారు.

విజయవాడ కనక దుర్గ
నేటి అలంకరణ

## శ్రీ మహాచండీ దేవి



"రక్ష రక్ష జగన్మాతర్దేవి ! మంగళ చండికే
హారికే విపదాం రాశేః ! హర్ష మంగళకారికే
హర్ష మంగళ దక్షేచ శుభే మంగళ చండికే
మంగళ మంగళార్హేచ ! సర్వ మంగళ మంగళే
సదా మంగళ దే దేవి ! సర్వేషాం మంగళాలయే"
దేవానాం కార్యసిద్ధర్థ్యం మావిర్భవతిసా యదా !
ఉత్పన్నేతి తదా లోకే సా నిత్యా వృభిధీయతే !!

చండీదేవి అవతార విశ్లేషణ : చండీదేవి కాళీదేవిని పోలి ఉంటుంది. దయగల రూపంలోను ఒక్కొక్కసారి ఉగ్రరూపంలోను దర్శన మిస్తుంది. దయగల రూపంలో ఉన్నపుడు ఉమా, గౌరి, పార్వతి లేదా హైమవతి, శతాక్షి, శాకాంభరీ దేవి, అన్నపూర్ణ, జగన్మాత మరియు భవానీ అని పిలుస్తారు. అలాగే భయంకరమైన రూపంలో ఉన్నప్పుడు దుర్గ, కాళి మరియు శ్యామ, చండీ లేదా చండిక, భైరవి, చినమస్త మొదలైన పేర్లతో పిలువబడుతుంది. నవరాత్రుల మహోత్సవాల్లో దుర్గాదేవి తొమ్మిది రూపాల్లో ఒకటైన చండీదేవి అవతారం ఎలా జరిగిందంటే రాక్షసులు ఇంద్రుడి సింహాసనాన్ని ఆక్రమించడానికి వచ్చినపుడు దేవతలందరూ ఒకేచోట సమావేశమై పరమశివుడి దగ్గరకు వెళ్లి రాక్షసుల ఆగడాలను వివరించగా పరమశివుడు మాతృదేవతను ఆరాధించమని తెలుపగా మధుకైటబ, మహిషాసుర, శుంభనిశుంబ ఇత్యాధి రాక్షసులను సంహరించడానికి మాతృదేవత అనుగ్రహంతో తల్లి మహాకాళి ఛండీ రూపాన్ని దాల్చింది.

వస్త్రం : బంగారు రంగు వస్త్రం
పుష్పాలు : పసుపురంగు పూలు
నైవేద్యం : తెల్ల నువ్వులు కలిపిన బెల్లపు పొంగలి
మంత్రం : ఐం హ్రీం క్లీం చాముండాయై విచ్చే 108 సార్లు పఠించాలి "ఐం అనగా సరస్వతి, హ్రీం అనగా లక్ష్మి, క్లీం అనగా గౌరి, విచ్చే అన్నగా రమ్మని వేడుకోలు"

- భట్టిప్రోలు నటరాజ కుమార్

## నేడు అట్ల బతుకమ్మ



బతుకమ్మ సంబురాల్లో ఐదవ రోజు తంగేడు, గునుగు, బంతి, చెమంతి తదితర పూలను నాలుగు ఎత్తుల్లో పేర్చి, గౌరమ్మను వాటిపై పెడతారు.
ఈ రోజు నైవేద్యం : వరిపిండితో చేసిన అట్లు.

# 'గంగ'నీటి కోటా పెంచండి

### ఎపి సిఎం చంద్రబాబును కోరిన తమిళ సిఎం విజయ్
### గోదావరి-కావేరి అనుసంధానంపై సమన్వయంతో సాగుదాం
### చెన్నైకి ఇప్పటికే 4.08 టిఎంసిల నీరు ఇచ్చామన్న సిఎం చంద్రబాబు



మంగళవారం విజయవాడలో చెన్నై నగరానికి మంచినీరు ఇవ్వాలని తమిళనాడు సిఎం విజయ్, ఎపి సిఎం చంద్రబాబు నాయుడికి వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

**అమరావతి, అక్టోబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** గోదావరి - కావేరీ నదుల అనుసంధానం అంశంపై ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సమన్వయంతో ముందుకు సాగాలని రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, విజయ్ జోసెప్‌లు నిర్ణయించారు. గోదావరి జలాలను కావేరీకి తరలించి దక్షిణాది రాష్ట్రాల్లో సాగు, తాగునీటి అవసరాలు తీర్చే లక్ష్యంతో ఎపి సిఎం చంద్రబాబు, తమిళనాడు సిఎం విజయ్ కీలక చర్చలు జరిపారు. అమరావతిలోని నివాసంలో చంద్రబాబుతో విజయ్ భేటీ అయ్యారు. తెలుగు గంగ ద్వారా చెన్నైకు మరింతగా మంచి నీరు విడుదల చేయాలని సిఎం విజయ్ కోరారు. ఈ యేడాది ఎల్‌నినో ప్రభావంతో కృష్ణా జలాలు తగ్గడం, తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొన్నప్పటికీ చెన్నై దాహార్తి తీర్చే విషయంలో ఎపి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఇప్పటికే 4.08 టిఎంసిల నీటిని చెన్నై నగరానికి విడుదల చేసినట్టు సిఎం చంద్రబాబు చెప్పారు. నీటి లభ్యత, అవసరాలకు అనుగుణంగా మరికొంత నీటిని విడుదల చేయడంపైనా ఆలోచన చేస్తామని చెప్పారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల నడుమ సుమారుగా గంటన్నరపాటు సాగిన ఈ సమావేశంలో గోదావరి- కావేరి నదుల అనుసంధానం, చెన్నై మంచి నీటి అవసరాలకు తెలుగుగంగ ద్వారా నీటి సరఫరా వంటి కీలక అంశాలపై ఇరువురు చర్చించారు. గోదావరి నుంచి కృష్ణాకు, అక్కడి నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు, బొల్లాపల్లి నుంచి బనకచర్ల మీదుగా పెన్నాకు, కండలేరు ద్వారా కావేరీకి నీటిని తరలించే ప్రతిపాదనను ఎపి ప్రభుత్వం ముందుకు తెస్తోంది. గోదావరినుంచి వృథాగా సముద్రంలో కలుస్తున్న నీటిని సద్వినియోగం చేసుకుంటే దక్షిణాది రాష్ట్రాల్లో లక్షలాది మంది రైతులకు ప్రయోజనం కలుగుతుందని సిఎం చంద్రబాబు భావిస్తున్నారు. పొరుగు రాష్ట్రాల భాగస్వామ్యం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ భారీ ప్రాజెక్టును సాకారం చేయాలన్నది ఎపి ప్రభుత్వ ఆలోచన. ఈప్రతిపాదనలపై చర్చించేందుకు తమిళనాడు సిఎం విజయ్ చొరవ తీసుకున్నారు. ఈ క్రమంలోనే చెన్నై మంచినీటి అవసరాల కోసం తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా ఈ యేడాది ఎపి 4.08 టిఎంసిల నీటిని విడుదల చేసింది. తెలుగు గంగ నుంచి మరింత నీటిని విడుదల చేయాలని తమిళనాడు ప్రభుత్వం కోరుతుండగా నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు ఎపి ప్రభుత్వం తెలిపింది. మానవీయ కోణంలో చెన్నై మంచినీటి అవసరాలకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టంచేసింది. ఈ క్రమంలో తమిళనాడు సిఎం విజయ్, ఎపిసిఎం చంద్రబాబును కలిసారు. సమావేశానికి ముందు చంద్రబాబు, మంత్రి లోకేశ్ విజయ్‌కు తమ నివాసం వద్ద సాదర స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. సమావేశం ముగిసిన అనంతరం ఇద్దరు ముఖ్యమంత్రులు కలిసి విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొన్నారు.



గీజర్‌లో దాచిన గంజాయి ప్యాకెట్లు, స్వాధీనం చేసుకున్న 73 గంజాయి ప్యాకెట్లు

## శంషాబాద్ విమానాశ్రయంలో రూ.2.71 కోట్ల హైడ్రోపోనిక్ గంజాయి పట్టివేత

**శంషాబాద్ అక్టోబరు13,ప్రభాతవార్త:** థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఓ ప్రయాణికుడి వద్ద రూ.2.71 కోట్ల విలువైన 7.750 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్టోబర్ 12న శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికుడిని తనిఖీ చేయగా, లగేజీలోని ఎల్రక్టిక్ గీజర్‌లో దాచిన 73 ప్యాకెట్ల గంజాయి బయటపడింది. నార్కోటిక్ డ్రగ్స్ డిటెక్షన్ కిట్‌తో పరీక్షించగా గంజాయిగా నిర్ధారణ అయింది. దీంతో మాదకద్రవ్యాల నిరోధక చట్టం (ఎన్‌డీపీఎస్)-1985 కింద కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేశారు. ఈ ఘటనపై డీఆర్ఐ అధికారులు తదుపరి దర్యాప్తు చేస్తున్నారు.

## రెండవ రోజు జూనియర్ వైద్యుల నిరసన

**హైదరాబాద్ (అఫ్జల్‌గంజ్), అక్టోబరు 13ప్రభాతవార్త:** ఉస్మానియా ఆసుపత్రిలో మౌళిక సదుపాయాల కొరతను నిరసిస్తూ జూనియర్ వైద్యులు రెండవ రోజు కూడా తమ నిరసన కొనసాగింది. గత రెండు రోజులుగా కొనసాగుతున్న ధర్నాను తాత్కాలికంగా నిలిపివేసే అంశంపై వైద్యుల బృందం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ్మా ఉన్నతాధికారులతో సమావేశమైయ్యారు. ఆసుపత్రి నెలకొన్న సమస్యలను పదిరోజుల్లో పరిష్కారిస్తామని, అధికారులు హామి ఇచ్చినట్లు తెలిసింది. ఒకవేళ నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కారం కాకపోతే మళ్లీ సమ్మె చేస్తామని జూనియర్ వైద్యులు ప్రభుత్వ అధికారులను విన్నవించారు. చారిత్రాత్మకమైన కొత్త ఆసుపత్రి నిర్మాణం పేరుతో ఉస్మానియా ఆసుపత్రిలో వైద్యాధికారులు మౌళిక సదుపాయాలను కల్పించడంలేదని జూనియర్ వైద్యులు తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించక లేకపోతున్నామని ఆవేధన వ్యక్తం చేశారు. రోగులనుంచి ఇబ్బందులు తప్పడం లేదన్నారు. జూడాల ఆందోళన తీవ్ర రూపం దాల్చక ముందే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ్మా ప్రత్యేక చర్యలు తీసుకుని మౌలిక వసతులను కల్పించాల్సిన అవసరం భాధ్యత ఎంతైనా ఉంది. మరోవైపు జూనియర్ వైద్యుల సమస్యలను పరిష్కరించకుండా విధులు నిర్వహించాలని ఒత్తిడి చేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు.

# అనుమానంతో భార్య గొంతు కోసి హత్య చేసిన భర్త

### నిందితుడి అరెస్టు.. రిమాండ్
### బాలాపూర్‌లో ఘటన





మంగళవారం హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న ఆదిభట్ల ఎసిపి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, పక్కన బాలాపూర్ ఇన్స్‌పెక్టర్ నాగరాజు హత్యకు గురైన అజ్మీరా బేగం (ఫైల్), హత్య చేసిన మహ్మద్ ముస్తఫా (ఫైల్)

**సరూర్‌నగర్, అక్టోబరు 13 ప్రభాతవార్త:** అక్రమ సంబంధం నెరుపుతున్నదనే అనుమానంతో కట్టుకున్న ఇల్లాలిని గొంతు కోసి దారుణంగా హతమార్చిన భర్తను బాలాపూర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. మంగళవారం సాయంత్రం బాలాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఇన్స్‌పెక్టర్ నాగరాజుతో కలిసి ఆదిభట్ల ఎసిపి ప్రదీప్ కుమార్‌రెడ్డి తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. వెస్ట్ బెంగాల్ ఉత్తర్ దినాజ్‌పూర్ చోప్రా జిల్లా లక్ష్మీపూర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ముస్తఫా (29) జీవనోపాధి కోసం వలస వచ్చి బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని షాహీన్‌నగర్ న్యూ బాబానగర్‌లో భార్య, పిల్లలతో కలిసి నివసిస్తున్నాడు. అయితే లేబర్‌గా పని చేస్తున్న ముస్తఫా తన భార్య అజ్మీరా బేగం (28)పై అనుమానం పెంచుకొని గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి కత్తితో భార్య గొంతు కోసి పరారయ్యాడు.

ఈనేపథ్యంలో రక్తపు మడుగులో అజ్మీరా బేగం సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. ఈ మేర కు ఫిర్యాదు అందడంతో బాలాపూర్ పోలీసులు రంగం లోకి దిగి నిందితుని కోసం గాలించారు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు నిందితుడు మంగళవారం మధ్నాహ్నం పహాడీషరీఫ్‌లోని ఎయిర్ పోర్టు హోటల్ వద్ద ఉన్నట్లు తెలియడంతో పోలీసులు అక్కడికి వెళ్ళి ముస్తఫాను అదుపులోకి తీసుకొన్నారు. నిందితుడి వద్ద నుండి సెల్‌ఫోన్‌తో పాటు హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో హత్య తానే చేసినట్లు నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు నిందితుడు ముస్తఫాను మంగళవారం సాయంత్రం జ్యూడిషియల్ రిమాండ్‌కు పంపారు.

# ఆటో ఇమ్యూన్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక దర్శనంపై టిటిడి సానుకూలం!

### నిపుణుల కమిటీ పరిశీలన



**తిరుమల,అక్టోబరు 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి క్షణకాల దర్శనం కోసం లక్షలాది మంది భక్తులు పరితపిస్తుంటారు. వారిలో వృద్ధులు, దివ్యాంగులు, పలు రకాల వ్యాధులతో బాధపడుతున్న వాళ్ళకు ధార్మికసంస్థ టిటిడి ప్రత్యేక క్యూలైన్‌ద్వారా ఎలాంటి తోపులాటలు లేకుండా ప్రశాంతంగా సాఫీగా స్వామివారి దర్శనం చేసుకునేలా చూస్తోంది. ఇదే తరహాలో ఇప్పుడు ఆటో ఇమ్యూన్, అరుదైన వ్యాధులతో బాధపడుతున్న వారికి "మెడికల్ కేసెస్"కేటగిరీలో తిరుమలలో శ్రీవారి ప్రత్యేక దర్శనం కల్పించాలని ఇప్పటికే విజ్ఞప్తులు చేరుతూన్నాయి. ఈ అంశాన్ని పరిశీలించేందుకు టిటిడి ఉన్నతాధికారులు ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్యచౌదరి కూడా సానుకూలంగా స్పందిస్తున్నారు. ఇప్పటికే రోజువారీగా వెయ్యిమంది వరకు భక్తులకు ప్రత్యేక కేటగిరి క్రింద ప్రత్యేక దర్శనం ప్రతిరోజూ సాయంత్రం 3.30గంటలకు అనుమతినిస్తోంది. ఇదే తరహాలో ఇప్పుడు ఆటో ఇమ్యూన్, అరుదైన వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆ దేవదేవుడు శ్రీవారి ప్రత్యేక దర్శనం కల్పించే అంశంపైటిటిడి సానుకూలంగానే అధ్యయనం చేస్తోంది. సిస్టమిక్ లూపస్ ఎరిథెమటోసస్ (ఎస్ఎల్ఇ), స్క్లెరోడెర్మా, మల్టిపుల్ స్క్లెరోసిస్, అల్సరేటివ్ కోలైటిస్, క్రోన్స్ డిసీజ్, సికిల్‌సెల్ అనీమియా, తలసేమియా తదితర వ్యాధిగ్రస్తులకు ఈ సౌకర్యం కల్పించే అంశాన్ని బహుళ విభాగాల నిపుణుల కమిటీకి టిటిడి నివేదించింది. ప్రస్తుతం టిటిడి మెడికల్ కేసెస్ట్ కేటగిరీలో మూత్రపిండాల మార్పిడి, ఓపెన్ హార్ట్ సర్జరీ, డయాలసిస్, కాలేయ మార్పిడి, మెదడు ఆపరేషన్, క్యాన్సర్, నడవలేని స్థితికి దారితీసే స్పైన్ సర్జరీ బాధితులకు మాత్రమే ఆన్‌లైన్ ముందస్తు బుకింగ్ ద్వారా ప్రత్యేక దర్శనం ఉచితంగా కల్పిస్తోంది. ఆటో ఇమ్యూన్, నేషనల్ పాలసీ ఫర్ రేర్ డిసీజెస్-2021 కింద గుర్తించిన వ్యాధిగ్రస్తులకూ ఈ సౌకర్యం కల్పించాలని కోరుతూ ఇటీవల శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురానికి చెందిన హైకోర్టు న్యాయవాది ఎస్.కె. శ్రీకృష్ణ యశస్వి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు ఈ అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని టిటిడిని ఆదేశించింది. దీంతో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర టిటిడి ముఖ్యవైద్యాది.కారి, స్విమ్స్ డైరెక్టర్ / వైస్ చాన్స్‌లర్ అభిప్రాయాలను కోరారు. మే 27న స్విమ్స్ లో జరిగిన నిపుణుల సమావేశంలో వ్యాధుల రకాలు, తీవ్రత, వైకల్య స్థాయి వేర్వేరుగా ఉండటం, ఆన్‌లైన్‌లో వైద్య ధ్రువపత్రాల ధ్రువీకరణలో ఎదురయ్యే సమస్యల కారణంగా వెంటనే ఈ వ్యాధులను మెడికల్ కేసెస్ కేటగిరీలో చేర్చడం సాధ్యం కాదని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ నేప థ్యంలో ఈ అంశాన్ని బహుళ విభాగాల నిపుణుల కమిటీకి నివేదించాలని ఇఒ నిర్ణయించారు. అయితే మరింత లోతుగా అధ్యయనం చేసి కమిటీ సిఫార్సుల ఆధారంగా తదుపరి రానున్న బోర్డు సమావేశంలో శ్రీవారి దర్శనం కల్పించే అంశంపై చర్యలు తీసుకోనున్నారు.



జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ సాధ్వి నిరంజన్ జ్యోతితో సమావేశమైన రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

# దేశమంతటా ఉచిత విద్య, గురుకులాలు నెలకొల్పాలి

### జాతీయ బిసి కమిషన్ చైర్మన్‌తో ఆర్.కృష్ణయ్య బృందం చర్చలు

**హైదరాబాద్ , అక్టోబరు 13 ప్రభాతవార్త:** రెండు తెలుగు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న రీతిలోనే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత గురుకుల పాఠశాలలు, హాస్టళ్ల సౌకర్యం కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ సాధ్వి నిరంజన్ జ్యోతితో మంగళవారం ఆర్.కృష్ణయ్య నేతృత్వంలోని బీసీ నేతల బృందం ప్రత్యేకంగా భేటీ అయి పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించింది.

ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో బీసీ సంఘాల పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఫీజు రీయింబర్స్‌మెంట్, గురుకులాల వ్యవస్థ ద్వారా దాదాపు 50 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య అందుతోందని తెలిపారు. దేశంలోని 80 కోట్ల మంది బీసీల విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికై కమిషన్ తన రాజ్యాంగబద్ధమైన విస్తృత అధికారాలను వినియోగించాలని కోరారు. బీసీల విద్యాభివృద్ధి, హాస్టళ్ల నిర్వహణకు కేంద్రం 60 మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలి. కేంద్ర స్థాయిలో 2 లక్షల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఖాళీగా ఉన్న 16 లక్షల పోస్టులను భర్తీ చేయాలని, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేశారు.

**సానుకూలంగా స్పందించిన చైర్మన్:** బీసీ నేతలు విన్నవించిన డిమాండ్లు అత్యంత న్యాయమైనవని జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ సాధ్వి నిరంజన్ జ్యోతి పేర్కొన్నారు. కమిషన్ సభ్యులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. ఈ చర్చలలో బీసీ సంఘాల నాయకులు రాజేందర్, పగిళ్ళ సతీష్, పర్లగోర్ల మోడీ రాందేవ్, అల్లం యాదయ్య, నీల వెంకటేష్, జిల్లపల్లి అంజి, ఆనంతయ్య, రామాంజనేయులు, భీమ రాజు, శివ కుమార్ యాదవ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలి

### నేషనల్ హెల్త్ మిషన్ జాయింట్ యాక్షన్ కమిటీ, తెలంగాణ ఆధ్వర్యంలో ధర్నా: మద్దతు తెలిపిన ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న ఎంపి కొండా విశ్వేశ్వరరెడ్డి

**హైదరాబాద్ (ధర్నాచౌక్), అక్టోబర్ 13, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నేషనల్ హెల్త్ మిషన్ జాయింట్ యాక్షన్ కమిటీ, తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టాన నిరవధిక సమ్మెలో భాగంగా ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాల కమిటీ నేతలు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు ముఖ్య అతిధిగా హాజరై కొండా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నప్పటికీ, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించకుండా తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి అధ్యక్షులు డాక్టర్ శంకర్‌లాల్ మాట్లాడుతూ ప్రతి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగికి ఉద్యోగ భద్రతతో పాటు ఈఎస్ఐ-ఈహెచ్ఎస్ సౌకర్యం కల్పించాలని, జీవో నెంబర్ 60 మరియు 1195 ప్రకారం పెంచిన వేతనం తక్షణమే చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న 9నెలల పీఆర్‌సి, ఏరియర్స్ తక్షణమే విడుదల చేయాలని, గత కమీషనర్ ఆదేశాల మేరకు ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ప్రతి నెల 5వ తేదీ లోగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు సైదలు మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగి మరణించినట్లయితే వారి కుటుంబానికి 20 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు వారి కుటుంబంలో ఒకరికి వారి విద్యార్హతను బట్టి ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఎన్‌హెచ్‌ఎంల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, ప్రభుత్వం స్పందించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంకు బీజేపీ మెడికల్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కొప్పుల రాజశేఖర్ హాజరై మద్దతు తెలపగా, డాక్టర్ భార్గవి, డాక్టర్ కేతన్, డాక్టర్ సౌజన్య, డాక్టర్ అనూప్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయం వద్ద ధర్నాకు సర్వం సిద్ధం

### కాంట్రాక్ట్ అధ్యాపకుల ఉద్యోగ భద్రత, క్రమబద్ధీకరణే ధ్యేయం

### నిజాం కళాశాలలో ఘనంగా సన్నాహక సమావేశం.. నిరసన పోస్టర్ ఆవిష్కరణ

**హైదరాబాద్,అక్టోబరు 13 ప్రభాతవార్త :** రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో దశాబ్దాలుగా సేవనందిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన పోరు మరింత ఉధృతమైంది. గురువారం నగరంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయం వద్ద యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్ (కాంట్రాక్ట్) తెలంగాణ స్టేట్ ఆధ్వర్యంలో తలపెట్టిన భారీ ధర్నాను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నిరసన కార్యక్రమానికి సంబంధించిన అధికారిక పోస్టర్‌ను మంగళవారం నిజాం కళాశాలలోని సెంటెనరీ బ్లాక్‌లో నిర్వహించిన ముఖ్యమైన సన్నాహక సమావేశంలో నాయకులు ఆవిష్కరించారు. రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాలలో సుదీర్ఘకాలంగా సేవలు అందిస్తున్న 1,200 మందికి పైగా కాంట్రాక్ట్ అధ్యాపకులకు శాశ్వత ఉద్యోగ భద్రత కల్పించి, వారి సర్వీసులను తక్షణమే క్రమబద్ధీకరించాలన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షులు డాక్టర్ ధర్మ తేజ, నాయకులు డాక్టర్ తిరుపతి, డాక్టర్ విజందర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ రమేష్, డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్, నీళ్లు ఇవ్వలేరు కానీ.. బుల్లెట్ ట్రైన్ కావాలా!: సబితా ఇంద్రారెడ్డి

**హైదరాబాద్,అక్టోబరు13,ప్రభాతవార్త:** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కుంటోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇంకా అలైన్‌మెంట్ ఖరారు చేయని బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ చేపట్టడం పూర్తిగా చట్టవిరుద్ధమని ఆమె మండిపడ్డారు. మంగళవారం ఆమె తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటనను ప్రస్తావిస్తూ, బుల్లెట్ ట్రైన్ రూట్ మ్యాప్ ఇంకా ఖరారు కాలేదని, అలాంటప్పుడు బహదూర్‌గూడలో పోలీసుల రక్షణతో రైతుల భూములను ఎందుకు తీసుకున్నారని సబిత ప్రశ్నించారు. కనీసం కరెంట్, సాగు, తాగునీరు కూడా అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆమె విమర్శించారు. మెట్రో టెండర్లు రద్దు చేసిన ప్రభుత్వం ఇప్పుడు బుల్లెట్ ట్రైన్ల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కొత్వాల్‌గూడ నుంచి కొడంగల్‌కు కొత్త రహదారి అవసరం ఏముందని నిలదీశారు. భూములు అమ్మి పాలన చేయాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. నాదర్‌గూల్‌లోని ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, భూసేకరణ ఒత్తిడితో కొడంగల్ నియోజకవర్గంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## విండీస్‌ను ఢీకొట్టేందుకు ప్రత్యేక వ్యూహాం: తిలక్ వర్మ



**హైదరాబాద్, అక్టోబరు 13,ప్రభాతవార్త:** రాజీవ్ గాంధి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో సాధారణంగా ఫ్లాట్ వికెట్ ఉంటుందని అయితే ఈసారి పిచ్ స్వభావాన్ని మార్చారని ప్రచారం జరుగుతోందని రేపటి మ్యాచ్లో పిచ్ ఎలా ప్రవర్తిస్తుందో చూడాల్సి ఉందని ఇండియన్ క్రికెటర్ తిలక్ వర్మ అన్నారు. ఈమేరకు మంగళవారం స్టేడియంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తిలక్ వర్మ మాట్లాడుతూ 'ప్రస్తుతం మేం బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ ఎంతో అగ్రెసివ్‌గా ఆడుతున్నాం.. నాకు, ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, నితీష్ కుమార్ రెడ్డిలకు హైదరాబాద్ ఉప్పల్ మైదానంలో ఎన్నో (ఐపీఎల్) మ్యాచుల ఆడాం.. ఇది ఖచ్చితంగా మా టీము చాలా ప్లస్ అవుతుందని భావిస్తున్నా...నాకు వ్యక్తిగతంగా నెంబర్ 3 పొజిషన్లో బ్యాటింగ్ చేయడం చాలా ఇష్టం.. కానీ ప్రస్తుతం జట్టుకు మిడిల్ ఆర్డర్లో నా అవసరం ఉంది. అందుకే టీమ్ మేనేజ్మెంట్ ఆదేశాల మేరకు మిడిల్ ఆర్డర్ బ్యాటింగ్‌కు వస్తున్నాను' అని తిలక్‌వర్మ తెలిపారు. ఇక ఇండోర్‌లో జరిగిన మూడో టీ20లో తాను రనౌట్ అయిన తీరుపై తిలక్ వర్మ స్పందిస్తూ.. గత మ్యాచ్లో నేను అలా రనౌట్ అవ్వడం నిజంగా దురదృష్టకరం. నేను కొట్టిన షాట్ బౌండరీకి వెళ్లిపోయిందని అనుకున్నాను. మైదానంలో ఉన్న హోర్డింగ్ ఫ్లాష్ కావడం వల్ల బాల్ ఫోర్ వెళ్ళిందేమో అని పొరబడ్డాను అని విచారం వ్యక్తం చేశాడు. ఈ అనుభవం నుంచి ఒక పాఠం నేర్చుకున్నాను ఇక నుంచి ఆన్‌ఫీల్డ్ అంపైర్ అధికారికంగా ఫోర్ సిగ్నల్ ఇచ్చే వరకు రన్ తీస్తూనే ఉంటాను అని నవ్వుతూ చెప్పుకొచ్చాడు.

అలాగే ప్రత్యర్థి వెస్టిండీస్ జట్టు ప్రమాదకరమైనదని టీ20 క్రికెట్లో విండీస్ చాలా బలమైన జట్టు అని వారి టీమ్‌లో చివరి ప్లేయర్ వరకు హార్డ్ హిట్టింగ్ చేయగల సామర్థం ఉందని కాబట్టి కరేబియన్ జట్టుని తక్కువ అంచనా వేయకుండా పర్ఫెక్ట్ ప్లాన్‌తో మైదానంలోకి దిగుతామని పేర్కొన్నాడు.

## పండుగవేళ.. 7వేల ప్రత్యేక బస్సులు

### ప్రయాణీకులకు మరింత మెరుగైన రవాణా: ఆర్టీసి ఆర్ఎం శ్రీదేవి

**హైదరాబాద్ (గోషామహల్), అక్టోబరు 13ప్రభాతవార్త:** దసరా పండుగను పురస్కరించుకుని ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలను కల్పించడం ట్రాఫిక్ సమస్యలను నివారించడం, ప్రయాణికుల భద్రతను నిర్దారించడం లక్ష్యంగా పని చేయాలని రంగారెడ్డి రీజియన్ ఆర్టిసి ఆర్.ఎం శ్రీదేవి అన్నారు. మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వివిధ విభాగాల అధికారుల సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల నివారణ,ట్రాఫిక్ నియంత్రణ భద్రత,పారిశుద్దం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గత సంవత్సరం దసరా సందర్భంగా రంగారెడ్డి రీజియన్ పరిధిలో 424అదనపు బస్సులు నడిపించకగా, ఈ సారి అదనంగా 440 బస్సులను నడిపించేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. ఈసమావేశంలో ట్రాఫిక్ అదనపు డిసిపి వేణు గోపాల్‌రెడ్డి, డిటిసి సదానందం, సికింద్రాబాద్ జోన్ ఎసిపి శ్రీనివాస్, చార్మినార్ ఎసిపి లక్ష్మన్, ఆర్టిసి అధికారులతోపాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# క్రికెట్ మ్యాచ్ టికెట్‌లను అక్రమంగా విక్రయిస్తున్న నలుగురి అరెస్ట్

**గోషామహల్, అక్టోబర్ 13ప్రభాతవార్త:** నగరంలోని ఉప్పల్ స్టేడియంలో ఇండియా,వెస్టిండిస్ జట్ల మధ్య జరగనున్న అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్‌లను విక్రయిస్తున్న నలుగురిని గోషామహల్ పోలీసులు అరెస్ట్ వారి నుంచి సెల్‌ఫోన్‌లు,క్రికెట్ మ్యాచ్‌కు చెందిన టిక్కెట్‌లు,దాండియా పాస్‌లు,ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ బి.శ్రావణ్‌కుమార్ తెలిపపిన వివరాల ప్రకారం ఈనెల 12వ తేది రాత్రి విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు గోషామహల్ పోలీసులు బేగంబజార్ ఎస్‌డి మాల్‌లో దాడి చేయగా ఇండియా,వెస్టిండిస్ మ్యాచ్‌కు చెందిన నాట్‌ఫర్‌సెల్ అని రాసి ఉన్న కాంప్లిమెంటరీ టిక్కెట్‌లను విక్రయిస్తున్నట్లు గుర్తించి అవినాష్ దరఖ్, మోహిత్ సోమానిలను అదుపులోకి తీసుకుని వారి నుంచి ఐదు సెల్‌ఫోన్‌లు,పదకొండు క్రికెట్ మ్యాచ్ టిక్కెట్‌లు,నాందారి,గౌరవ్ నవరాత్రి ఉత్సవ్ దాండియా పాస్‌లు,ద్విచక్రవాహనంతోపాటు ఐదువేల రూపాయల నగదును స్వాధీనంచేసుకున్నారు. వారి ద్వారా సేకరించిన సమాచారం మేరకుకాచిగూడకు చెందిన అకర్షిత్ శ్రీవాత్సవ,నింబోల్లిఅడ్డప్రాంతానికి చెందిన సతీష్‌చంద్ర శ్రీవాత్సవలను కూడా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆట



## మైయా ఓపెన్ ఎటిపి:
# సుమిత్ విజయంతో పునరాగమనం

**మైయా, పోర్చుగల్:** మైయా ఓపెన్ ఏటీపీ 100 టోర్నమెంట్‌లో పోర్చుగల్‌కు చెందిన హెన్రిక్ రోచాను ఓడించడానికి భారతదేశపు అగ్రశ్రేణి పురుషుల టెన్నిస్ ఆటగాడు సుమిత్ నాగల్ అద్భుతమైన పునరాగమనం చేసాడు. ఒక గంట 21 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో, నాగల్ ఒక సెట్ వెనుకబడినప్పటికీ పుంజుకుని రెండో సీడ్ రోచాను 3-6, 7-5, 7-6 (5) తేడాతో ఓడించి, రౌండ్ ఆఫ్ 16లో తన స్థానాన్ని ఖాయం చేసుకున్నాడు. ముఖ్యంగా ఉత్కంఠభరితమైన నిర్ణయాత్మక సెట్‌లో భారత ఆటగాడు పలుమార్లు ఓటమి అంచుకు చేరుకున్నాడు. రోచా రెండుసార్లు మ్యాచ్ కోసం సర్వ్ చేశాడు, మొదట 5-4 వద్ద, ఆపై 6-5 వద్ద నాగల్ బ్రేక్ చేసి పోటీలో నిలిచాడు. టైబ్రేక్‌కు దారితీసిన తర్వాత, నాగల్ మొదట 2-0 ఆధిక్యం సాధించి, ఆ తర్వాత 4-2తో ముందుకు దూసుకెళ్లాడు. రోచా పోరాడి 5-4తో ఆధిక్యంలోకి వచ్చాడు. కానీ భారత ఆటగాడు తర్వాతి మూడు పాయింట్లు గెలుచుకుని అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకున్నాడు. నాగల్ తదుపరి ప్రీక్వార్టర్ ఫైనల్‌లో పోర్చుగల్‌కు చెందిన టియాగో పెరీరా లేదా క్రొయేషియాకు చెందిన లుకా మిక్రుత్‌తో తలపడనున్నాడు. ఆసియా క్రీడల్లో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన తర్వాత లుకా ఈ టోర్నమెంట్‌లో ప్రవేశించాడు, అక్కడ అతను చైనాకు చెందిన యిబింగ్ వు చేతిలో 4-6, 4-6 తేడాతో ఓడిపోయాడు.



## వాలీబాల్ ఛాంపియన్స్ లీగ్..
# పంజాబ్ 2-1తో అయోధ్యపై గెలుపు
### తమిళ టైటాన్స్ సూపర్ 6కి అర్హత

**నోయిడా:** నోయిడాలో జరిగిన వాలీబాల్ ఛాంపియన్స్ లీగ్ (విసిఎల్) మ్యాచ్‌లో పంజాబ్ ఏరోస్ట్రైకర్స్ అద్భుతంగా పుంజుకుని అయోధ్య గర్జన్‌ను 2-1 తేడాతో ఓడించగా, తమిళ టైటాన్స్ హూగ్లీ హిట్టర్స్‌పై అదే స్థాయిలో విజయం సాధించి సూపర్ 6 లో తమ స్థానాన్ని సురక్షితం చేసుకుంది. హోరాహోరీగా సాగిన మొదటి సెట్‌లో అయోధ్య గర్జన్‌ను 21-18 తేడాతో ఓడించి, పంజాబ్ ఏరోస్ట్రైకర్స్ తమ మ్యాచ్‌ను సానుకూలంగా ప్రారంభించింది. రెండవ సెట్‌లో అయోధ్య బలంగా పుంజుకుని 21-16 తేడాతో కైవసం చేసుకుని, స్కోరును 1-1తో సమం చేసింది. మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగిన నిర్ణయాత్మక సెట్‌లో, పంజాబ్ ప్రత్యర్థులపై ఒత్తిడి కొనసాగిస్తూ పట్టు సాధించింది. ఏరోస్ట్రైకర్స్ మూడవ సెట్‌ను 21-11 తేడాతో కైవసం చేసుకుని, 2-1తో అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుంది. మరో మ్యాచ్‌లో, తమిళ టైటాన్స్ తొలి రెండు సెట్లు గెలిచి, హూగ్లీ హిట్టర్స్‌ను 2-1 తేడాతో ఓడించి సూపర్ 6కు అర్హత సాధించింది. తొలి సెట్‌ను 21-19 తేడాతో అతి కష్టం మీద గెలుచుకున్న టైటాన్స్, ఆ తర్వాత ఉత్కంఠభరితమైన రెండో సెట్ పోరాటంలో నెగ్గింది. స్కోరు 20-20తో సమంగా ఉన్నప్పుడు, వారు కీలకమైన పాయింట్‌ను గెలుచుకుని సెట్‌ను 21-20తో కైవసం చేసుకున్నారు, తద్వారా విజయానికి ఒక సెట్ దూరంలో నిలిచారు. మూడవ సెట్‌లో హూగ్లీ హిట్టర్స్ పుంజుకుని 21-10 తేడాతో విజయం నమోదు చేశారు. అయితే, అప్పటికే టైటాన్స్ మొదటి రెండు సెట్లను కైవసం చేసుకుని మ్యాచ్‌ను తమ వశం చేసుకుని సూపర్ 6లో తమ స్థానాన్ని ఖరారు చేసుకున్నారు.



# ఆస్ట్రేలియా గెలుపు
### 214 రన్స్ తేడాతో సౌతాఫ్రికా ఓటమి

**డర్బన్:** సౌతాఫ్రికాతో మూడు టెస్ట్‌ల సిరీస్‌లో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. డర్బన్ వేదికగా మంగళవారం జరిగిన తొలి టెస్ట్‌లో సమష్టిగా రాణించిన ఆస్ట్రేలియా 214 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. మ్యాట్ రెన్‌షా(190, 82,2/30) అద్భుతమైన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆసీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. 421 పరుగుల లక్ష్యఛేదనలో భాగంగా 102/4 ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 86.5 ఓవర్లలో 206 పరుగులకు ఆలౌటైంది. ఎయిడెన్ మార్క్‌రమ్(75) ఒంటరి పోరాటం చేయగా, డేవిడ్ బెడింగ్‌హామ్(46), మార్కో జాన్సెన్(35), వియాన్ మల్డర్(29) రాణించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో జోష్ హేజిల్‌వుడ్(6/49) 6 వికెట్లతో సౌతాఫ్రికా పతనాన్ని శాసించాడు. మ్యాట్ రేన్‌షా(2/30) 2 వికెట్లు, మిచెల్ స్టార్క్, ప్యాట్ కమిన్స్ తలో వికెట్ తీసారు. ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా మ్యాట్ రేన్‌షా(190) అసాధారణ శతకంతో తొలి ఇన్నింగ్స్‌లో 390 పరుగులకు ఆలౌటైంది. సౌతాఫ్రికా బౌలర్లలో వియాన్ మల్డర్(4/68) 4 వికెట్లు, మార్కో జాన్సెన్(3/68), అన్రిచ్ నోర్జ్(2/88) 2 వికెట్లు, సిమన్ హార్మర్ ఒక వికెట్ తీసాడు. అనంతరం సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగులకు ఆలౌటైంది. డేవిడ్ బెడింగ్‌హామ్(49) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్ వుడ్, నాథన్ లయన్ రెండేసి వికెట్లు, ప్యాట్ కమిన్స్ 3 వికెట్లు, బ్యూ వెబ్‌స్టర్‌కు ఒక వికెట్ దక్కింది. 106 పరుగుల భారీ ఆధిక్యంతో ఆస్ట్రేలియా 58 ఓవర్లలో 6 వికెట్లకు 314 పరుగుల వద్ద డిక్లేర్డ్ చేసింది. మ్యాట్ రేన్‌షా(82) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. సౌతాఫ్రికా బౌలర్లలో అన్రిచ్ నోర్జ్, కేశవ్ మహరాజ్ రెండేసి వికెట్లు, మార్కో జాన్సెన్, సిమన్ హార్మర్ తలో వికెట్ పడగొట్టారు.

# సిరాజ్ సారథ్యంలోని హైదరాబాద్ గెలుపు
### 40 పరుగుల తేడాతో త్రిపుర చిత్తు



**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక దేశవాళీ టోర్నీ రంజీ ట్రోఫీ 2026-27 సీజన్‌లో హైదరాబాద్ శుభారంభం చేసింది. జింఖానాలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో త్రిపురపై ఇన్నింగ్స్, 40 పరుగుల తేడాతో విజయం సాధించి, హైదరాబాద్ తన రంజీ ట్రోఫీ ప్రచారాన్ని ఘనంగా ప్రారంభించింది. ఎలైట్ గ్రూప్‌బీలో భాగంగా త్రిపురతో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ ఇన్నింగ్స్ 40 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. హైదరాబాద్ బౌలర్లు అనికేత్(5/21), తనయ్ త్యాగరాజన్(3/37, 6/52) ఒక మోస్తరు స్కోరు చేయడంతో మూడు రోజుల్లోనే విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన త్రిపుర తొలి ఇన్నింగ్స్‌లో 44 ఓవర్లలోనే 134 పరుగులకు కుప్పకూలింది. అనంతరం హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ 103.2 ఓవర్లలో 294 పరుగుల భారీ స్కోర్ చేసింది. తన్మయ్ అగర్వాల్(122 బంతుల్లో 2 ఫోర్లతో 54), రుతిక్ మెండే(150 బంతుల్లో 5 ఫోర్లతో 61) హాఫ్ సెంచరీలతో రాణించగా, రాహుల్ రాదేశ్(119 బంతుల్లో ఫోర్‌తో 40), చామ మిలింద్(55 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 40) పర్వాలేదనిపించారు. 164 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన త్రిపుర 120 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. హైదరాబాద్ కెప్టెన్, టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ ఈ మ్యాచ్‌లో రెండు వికెట్లు మాత్రమే పడగొట్టాడు.





# నేడే హైదరాబాద్‌లో టి20
### సిరీస్ కైవసానికి పట్టుదలతో భారత్
### సమం చేయాలని వెస్టిండీస్ వ్యూహం

**న్యూఢిల్లీ:** ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 21 ఆధిక్యంలో ఉన్న టీమిండియా నాలుగో టీ20 మ్యాచ్ కోసం హైదరాబాద్ చేరుకుంది. ఇండోర్‌లో జరిగిన మూడో టీ20లో 14 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించిన శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత్ ఈ నెల 14న హైదరబాద్‌లో వెస్టిండీస్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని భారత్ పట్టుదలతో ఉండగా, వెస్టిండీస్ జట్టు సిరీస్‌ను సమం చేయాలని వ్యూహాత్మకంగా బరిలోకి దిగనుంది. హైదరాబాద్ పిచ్ పరిస్థితులకు అనుగుణంగా భారత తుది జట్టులో మార్పులు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే బ్యాటింగ్ ఆర్డర్‌లో ఎటువంటి మార్పులు ఉండబోవనేది తెలుస్తోంది. భారత ఓపెనర్లుగా అభిషేక్ శర్మ, సంజు శాంసన్ స్థానాలు దాదాపు ఖాయమయ్యాయి. హైదరాబాద్ స్టేడియంలో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్లలో సంజు మూడో స్థానంలో ఉన్నాడు. ఒక సెంచరీ కూడా సాధించాడు. మూడో నంబర్‌లో ఇషాన్ కిషన్, నాలుగో స్థానంలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఐదో స్థానంలో తిలక్ వర్మ బ్యాటింగ్‌కు రానున్నారు. జట్టు యాజమాన్యం గత మ్యాచ్‌ల్లో లాగే ఈ మ్యాచ్‌లోనూ ముగ్గురు ఆల్‌రౌండర్లను కొనసాగించే అవకాశం ఉంది. నమన్ ధీర్, నితీష్ కుమార్, అక్షర్ పటేల్ ఈ స్థానాల్లో రాణించనున్నారు. గత మ్యాచ్‌లో ఈ ముగ్గురు కలిసి బ్యాటింగ్‌లో 52 పరుగులు చేయడంతో పాటు బౌలింగ్‌లో కీలకమైన నాలుగు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. ఇక హైదరాబాద్ రాజీవ్ గాంధీ స్టేడియం పెద్దది కావడం వల్ల అదనపు పేసర్ కంటే స్పెషలిస్ట్ స్పిన్నర్‌ను ఆడించడం జట్టుకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో పేసర్ ప్రిన్స్ యాదవ్‌ను పక్కన పెట్టి, స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. దీంతో భారత్ ఓ స్పెషలిస్ట్ స్పిన్నర్ కుల్దీప్, ఆల్‌రౌండ్ స్పిన్నర్ అక్షర్ పటేల్‌తో పాటు పేసర్లుగా అర్ష్‌దీప్ సింగ్, మయాంక్ యాదవ్‌లతో బరిలోకి దిగే అవకాశం ఉంది. హైదరాబాద్ టీ20 కోసం భారత అంచనా తుది జట్టు చూస్తే సంజూ శాంసన్ (వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, నమన్ ధీర్, నితీష్ కుమార్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, మయాంక్ యాదవ్ ఉన్నారు.

# బడ్జెట్ ప్రతిపాదనల్లోనే ఎల్‌టిసిజిపై అభిప్రాయసేకరణ
### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ, అక్టోబరు 13:** దీర్ఘకాలిక మూలధన లబ్ది అంటే ఎల్‌టిసిజిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. బడ్జెట్ సంప్రదింపుల సమయంలో దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను తొలగింపుపై అభిప్రాయాలను వినడానికి ప్రభుత్వం ఆసక్తితో ఉందని పేర్కొన్నారు. ఆమె ఢిల్లీలో జరిగిన బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో మాట్లాడారు. ఈ చర్చలో సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను ఎస్టీటీ, వివిధ ఆస్తి తరగతులను ఒకే విధంగా పరిగణించాలా వద్దా అనే విషయం కూడా ఉందని సీతారామన్ అన్నారు. రాబోయే కేంద్ర బడ్జెట్ సన్నాహాలు ప్రారంభమైనందున, దీనిపై వ్యాఖ్యానించడానికి ఇది చాలా తొందర పాటు అవుతుందన్నారు. భారతదేశం, విదేశాలలో ఉన్న పెట్టుబడిదారులు మూలధన లాభాలు, వివిధ ఆస్తి వర్గాలపై పన్నుల గురించి చర్చిస్తున్నారని, వారి అభిప్రాయాలను వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీతారామన్ అన్నారు. దీర్ఘకాలిక పెట్టుబడులను ప్రోత్సహించడానికి, విదేశీ మూలధన ప్రవాహాలను స్థిరీకరించడంలో సహాయ పడటానికి ఈక్విటీపెట్టుబడులపై ఎల్టీసీజీ పన్నును రద్దు చేయాలని ఎస్‌బిఐ రీసెర్చ్ నివేదిక ప్రతిపాదించిన ఒక రోజుతర్వాత ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈక్విటీలపై దీర్ఘకాలిక మూలధన లాభాల ఎల్‌టి సిజి పన్నును రద్దు చేస్తూ, ఈక్విటీ పెట్టుబడులను కొనసాగించే కాలాన్ని రెండు లేదా మూడు సంవత్సరాలకు పొడిగించడాన్ని పరిశీలించాలని ఎస్‌బిఐ రీసెర్చ్ తెలిపింది. పెట్టుబడులను కొనసాగించే కాలాన్ని 23 సంవత్సరాలకు పొడిగించి ఈక్విటీపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్నును రద్దు చేయడం ద్వారా ఈక్విటీ రంగంలోకి వస్తున్న హాట్ మనీప్రవాహాలను అరికట్టేఅంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిశీలించాలని నివేదికలో పేర్కొంది. భారతీయ ఈక్విటీలలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు నిరంతరంగా అమ్మకాలు జరుపుతున్న నేపథ్యంలో ఈ ప్రతిపాదన వచ్చింది. అక్టోబర్‌లో విదేశీ ఇన్వెస్టర్లు రూ. 44,166 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. దీంతో 2026 నాటికి వారి మొత్తం ఈక్విటీ పెట్టుబడుల విత్‌డ్రాలు రూ. 3.04 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఈక్విటీ పెట్టుబడులపై విదేశీ ఇన్వెస్టర్లకు ప్రస్తుతం ఎల్టీసీజీ పన్ను రేటు 12.5 శాతంగా ఉంది. కేంద్ర బడ్జెట్ 2026, 2024లో ప్రవేశపెట్టిన విధానాన్ని కొనసాగిస్తూ, లిస్టెడ్‌షేర్లు, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లకు ఈరేటును యథాతథంగా ఉంచింది. ఎగుమతి ఆదాయాల స్వదేశీకరణను సరళీకృతం చేయాలని, దాదాపు ఆరు నెలల సహేతుకమైన కాలపరిమితిని విధించాలని ఎస్‌బిఐ రీసెర్చ్ తెలిపింది. కాగా రూపాయి అస్థిరతను అరికట్టడంపై ఆర్‌బిఐ దృష్టి సారించిందని సీతారామన్ అన్నారు.

## డాలర్‌తో పటిష్టం అవుతున్న భారత్ రూపాయి



**ముంబయి, అక్టోబరు 13:** అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ వరుసగా రెండో రోజూ భారీగా బలపడింది. మంగళవారం ఫారెక్స్ మార్కెట్లో రూపాయి ఏకంగా 77 పైసలు లాభపడి 95.05 వద్ద ట్రేడ్ అయింది. డాలర్ డిమాండ్‌ను తగ్గించడం, స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌ను అరికట్టడం లక్ష్యంగా ఆర్బీఐ తీసుకున్న కఠిన చర్యలు రూపాయికి అండగా నిలిచాయి.ముందురోజు కూడా రూపాయి 93 పైసలు లాభపడి 95.78 వద్ద ముగిసిన విషయం తెలిసిందే. ఆరునెలల్లో ఒక్కరోజులో ఇంతటి వృద్ధిని నమోదు చేయడం ఇదే తొలి సారి. ఆర్బీఐ తాజాగా తీసుకున్న చర్యల్లో భాగంగా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల కోసం ప్రత్యేక డాలర్ విండోను ఏర్పాటు చేసింది. దీంతో స్పాట్ మార్కెట్లో డాలర్లకు డిమాండ్ తగ్గుతుందని భావిస్తున్నారు. ఇటీవల రద్దు చేసిన ఫారెక్స్ డెరివేటివ్ కాంట్రాక్టులను మళ్లీ రీబుక్ చేయడానికి వీల్లేదని కూడా ఆర్బీఐ స్పష్టం చేసింది. మరోవైపు అంతర్జాతీయంగా ఆరు ప్రధాన కరెన్సీలతో డాలర్ బలాన్ని సూచించే డాలర్ ఇండెక్స్ 0.15 తగ్గి 102.43 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ ముడిచమురు ధరలు కూడా తగ్గడం రూపాయికి సానుకూలంగా మారింది. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 1 పైగా తగ్గి 105.47 డాలర్ల వద్ద ఉంది. 2026 చివరి నాటికి డాలర్‌తో రూపాయి మారకం విలువ 95.60 నుంచి 97.50 మధ్య కదలాడవచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# భారీ లాభాల దిశగా సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి, అక్టోబరు 13:** స్టాక్ మార్కెట్ నష్టాలకు బిగ్ బ్రేక్‌పడింది. మంగళవారం సెషన్‌లో సూచీలు రికార్డు స్థాయిలో పుంజుకున్నాయి. గత సెషన్లో భారీ లాభాల నుంచి నష్టాల్లోకి వెళ్లిన సూచీలు ఇవాళ ఒక్కసారిగా పుంజుకోవడంతో ఇన్వెస్టర్లలో సరికొత్త ఉత్సాహం వచ్చింది. బిఎస్‌ఇ సెన్సెక్స్ 1109 పాయింట్లు పెరిగి 73,034 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 359 పాయింట్లు ఎగబాకి 227.22 వద్ద సెషన్ ముగించింది. ఈ క్రమంలోనే ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బిఎస్‌ఇ లిస్టెడ్ కంపెనీల మార్కెట్‌విలువ రూ. 5లక్షల కోట్ల వరకు పెరిగి రూ. 470 లక్షల కోట్లకు చేరుకుంది. గత కొంత కాలంగా అమ్మకాల ఒత్తిడితో అనిశ్చితిలో కూరుకుపోయిన ఐటీ స్టాక్స్ రాణించడం కలిసొచ్చింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎల్టీసీజీ పై కామెంట్స్ చేయడం కూడా కొనుగోళ్లకు మద్దతు ఇచ్చింది. స్టాక్ మార్కెట్ రాణించగా బిఎస్‌ఇ 30 ప్యాక్ ఇండెక్స్‌లో చూస్తే టాప్ గెయినర్స్ అన్నీ ఐటీ స్టాక్స్ ఉండటం విశేషం. అత్యధికంగా హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ 8.28 శాతం పెరిగి రూ. 1321 వద్ద స్థిరపడింది. టిసిఎస్ 6.59 దూసుకెళ్లి రూ. 2267 వద్ద ముగిసింది. టెక్ మహీంద్రా స్టాక్ 4.90 శాతం పెరిగి రూ. 1542 వద్ద ముగిసింది. ఇన్ఫోసిస్ కూడా 4.44 శాతం పెరిగి రూ. 1062.20 వద్ద స్థిరపడింది. కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎటర్నల్, మారుతీ సుజుకీ స్వల్పంగా నష్టపోగా 30 ప్యాక్ ఇండెక్‌లో మిగతావన్నీ లాభాలు నమోదు చేశాయి.మార్కెట్‌కు మద్దతు ఇచ్చిన ప్రధాన అంశాల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యల గురించి ప్రధానంగా చెప్పుకోవాలి. ఎల్‌టిసిజి అంటే దీర్ఘకాలిక మూలధనలబ్ధిపై పన్ను. ఎస్టీటీ అనేది షేర్ల లావాదేవీలపై విధించే సెక్యూరిటీస్ అండ్ ట్రాన్సాక్షన్ టాక్స్. ఇందులో ప్రధానంగా విదేశీ పెట్టుబడిదారులు భారత మార్కెట్ల నుంచి తమ పెట్టుబడుల్ని ఉపసంహరించుకుంటుండటంతో ఈక్విటీలపై ఎల్‌టీసీజీ టాక్స్ రద్దు చేయాలని ఎస్బీఐ రీసెర్చ్ ఒక రిపోర్టులో పేర్కొంది. దీనికి తగ్గట్లుగా ఇవాళ నిర్మలమ్మ టాక్స్ రేట్లను సవరించడం లేదా రద్దు చేయడానికి సంబంధించి దేశీయ, అంతర్జాతీయ ఇన్వెస్టర్ల నుంచి దీనిపై వస్తున్న అభిప్రాయాల్ని వినడానికి ప్రభుత్వం సిద్ధంగానే ఉందని ఆమె వ్యాఖ్యానించడం సానుకూల పరిణామంగా నిలిచింది. పన్నులపై చర్చలు జరుగుతున్నాయన్న సంకేతాలే మార్కెట్ సెంటిమెంట్‌కు మద్దతిచ్చాయి. దేశీయ ఐటీ సంస్థలు క్యూ2 ఫలితాల్ని ప్రకటిస్తున్నాయి. తొలుత టిసిఎస్ ఫలితాల్లో లాభం, ఆదాయం పెరిగాయి. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ ఫలితాలు ప్రకటించగా ఇది మరింత ఎక్కువగా లాభాలు నమోదు చేసింది. ఇవాళ మార్కెట్లో ఐటీ స్టాక్స్ ర్యాలీకి హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ బలమైన ఫలితాలు దోహదపడ్డాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 5 శాతానికిపైగా పెరగడం విశేషం. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ 8 శాతానికిపైగా పెరగ్గా, టిసిఎస్ 7 శాతానికిపైగా దూసుకెళ్లింది. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్ 5 శాతం వరకు పెరిగాయి.

అమెరికన్ డాలరుతో పోలిస్తే రూపాయి విలువ వరుస సెషన్లలో భారీగా పుంజుకోవడం కలిసొచ్చింది. మంగళవారం ఉదయం 82 పైసలు లాభపడి డాలరుతో పోలిస్తే రూ. 94.96 స్థాయికి చేరింది. కిందటి రోజు ఆరంభంలో నేరుగా 97 పైసలు పెరిగిన సంగతి తెలిసిందే. మంగళవారం రోజు బాండ్ ఈల్డ్స్ రాబడి తగ్గగా, స్టాక్ మార్కెట్లు దూసుకెళ్లాయి.

ఇదే సమయంలో ఇంటర్నేషనల్ మార్కెట్లో మంగళవారం సెషన్‌లో క్రూడాయిల్ ధరలు పడిపోవడం కూడా స్టాక్ మార్కెట్ ర్యాలీకి మరో కారణంగా ఉంది. అక్టోబర్ 13 బ్రెంట్ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు ఒక శాతానికిపైగా తగ్గి 105 డాలర్ల స్థాయికి చేరింది. అమెరికా కూడా రష్యా నుంచి డీజిల్ కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం సెషన్‌లో భారీ ర్యాలీ కనిపించినా మార్కెట్లో అనిశ్చితి పూర్తిగా తొలగిపోలేదని నిపుణులు చెబుతున్నారు. జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు చెందిన వీకే విజయ్ కుమార్ విదేశీ పెట్టుబడిదారులు ఇంకా అమ్మకాలు కొనసాగిస్తున్నారు. దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు కొనుగోళ్లు జరుపుతున్నారు. ఆర్బీఐ చర్యలతో రూపాయికి కాస్త మద్దతు లభించినా, అమెరికా బాండ్ ఈల్డ్స్ అధికంగానే ఉంటే విదేశీ పెట్టుబడిదారుల అమ్మకాలు మున్ముందు కూడా కొనసాగవచ్చని అభిప్రాయపడ్డారు.

# ఒక్క వారంలోనే మనీవ్యూ అదిరిపోయే రిటర్నులు




**ముంబయి, అక్టోబరు 13:** స్టాక్ ఎక్స్ఛేంజిలో ఈ వారంలోనే లిస్ట్ అయిన మనీవ్యూ లిమిటెడ్ అంచనాలకు మించి లాభాలు అందించింది. ఇక్కడ ఐపిఒ కింద షేర్లు అలాట్ అయిన వారికి మంచి లాభాలు వచ్చాయని చెప్పొచ్చు. ఈనెల ఒకటిన ఎక్స్ఛేంజీల్లో లిస్టవగా అక్కడి నుంచి కూడా పెరుగుతూనే వెళ్లింది. మనీ వ్యూ ఐపిఒ ఇష్యూధర రూ. 32-34గా నిర్ణయించింది. ఇక్కడ ఒక్కో లాట్ కింద 441 షేర్లను కొనుగోలు చేయాలని స్పష్టం చేసింది. ఈ లెక్కన రూ. 34 ఇష్యూ ప్రైస్ దగ్గర పెట్టుబడి రూ. 14994గా ఉంది. ఐపిఒ సబ్‌స్క్రిప్షన్ సెప్టెంబర్ 24 నుంచి 28 వరకు జరగ్గా, సెప్టెంబర్ 29న షేర్ల అలాట్‌మెంట్ జరిగింది. అక్టోబర్ 1న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయింది.ఇక్కడ ఐపిఒ ఇష్యూ ప్రైస్ రూ. 34 గా ఉండగా, నేరుగా ఎన్ఎస్ఇ లో 61.76 శాతం ప్రీమియంతో రూ. 55 వద్ద ఎంట్రీ ఇచ్చి దూసుకెళ్లింది. ఈ క్రమంలోనే ఒక దశలో ఇష్యూ ప్రైస్ నుంచి 93 శాతం వరకు పెరిగి రూ. 65.47 వద్ద 52 వారాల గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. 12వతేదీ రూ. 62.12 వద్ద ముగిసింది. ఈ ధరతో చూసినట్లయితే ఐపిఒ ఇష్యూ ధర నుంచి ఏకంగా 83 శాతం రిటర్న్స్ అందించింది. సక్సెస్‌ఫుల్‌గా రూ. 14994 పెట్టుబడి పెట్టిన వారికి లాట్ వస్తే ఇప్పుడు వారి పోర్ట్‌ఫోలియో విలువ రూ. 27395గా ఉంది. అంటే ఒక్క లాట్‌పై రూ. 12400 వరకు ప్రాఫిట్ వచ్చింది. ఇక్కడ అక్టోబర్ 1న ఎక్స్ఛేంజీల్లో లిస్టవగా, అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా మార్కెట్లకు సెలవు. అక్టోబరు 3, 4 శని, ఆదివారాలు పోగా అక్టోబరు 5, 6 తేదీల్లో స్టాక్ పతనమైంది. మళ్లీ అక్టోబరు 7న ఏకంగా 20 శాతం అప్పర్ సర్క్యూట్ కొట్టింది. కేవలం వారంలోనే అదిరిపోయే రిటర్న్స్ ఇచ్చింది. ముందుగా మంచి సబ్‌స్క్రిప్షన్ లభించడం కూడా ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరచగా మంచి కొనుగోళ్ల మద్దతు లభిస్తోంది.

## టివిఎస్ ఫ్యామిలీలో పెరిగిన ఆస్తుల చిచ్చు




**ముంబయి, అక్టోబరు 13:** భారత ఆటోమొబైల్ రంగంలో దిగ్గజ సంస్థల్లో ఒకటైన టివిఎస్ కుటుంబంలో ఆస్తుల పంపకాలపై విభేదాలు చర్చనీయాంశంగా మారాయి. టివిఎస్ మోటార్ కంపెనీ ఛైర్మన్ వేణు శ్రీనివాసన్ కుటుంబంలో ఆర్థిక ప్రయోజనాలు, కుటుంబ సంపద పంపకాలపై ఏకాభిప్రాయం కుదరలేదని ఆయన భార్య మల్లిక శ్రీనివాసన్, కుమార్తె లక్ష్మి వేణు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఈ వివాదం కంపెనీలో రోజువారీ నిర్వహణ బాధ్యతల కంటే కూడా కుటుంబ సంపదలో ఎవరికి ఎంత వాటా ఉండాలి, ఆస్తులను ఎలా పంచుకోవాలనే అంశాల చుట్టూనే తిరుగుతోంది. వేణు శ్రీనివాసన్ కుమార్తె అయిన లక్ష్మి వేణు టివిఎస్ కుటుంబానికి చెందిన పారిశ్రామిక వేత్త. ఆమె యేల్ యూనివర్సిటీలో ఎకనామిక్స్ చదివారు. యూనివర్సిటీ ఆఫ్ వార్విక్ నుంచి ఇంజినీరింగ్ మేనేజ్మెంట్‌లో డాక్టరేట్ అందుకున్నారు. ఆమె టాఫే (ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్) వైస్ ఛైర్మన్‌గా, టాఫే మోటార్స్ అండ్ ట్రాక్టర్స్ లిమిటెడ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంకా సుందరం క్లేటాన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కూడా ఉన్నారు. ఆమె సోదరుడు సుదర్శన్ వేణు ప్రస్తుతం టివిఎస్ మోటార్ కంపెనీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. టివిఎస్ గ్రూప్‌ను దశాబ్దాల కిందట టివి సుందరమ్ అయ్యంగార్ స్థాపించారు. తర్వాతి తరాల్లో కుటుంబ వ్యాపారాలు వేర్వేరు విభాగాలుగా విస్తరించాయి. 2020లో టివిఎస్ కుటుంబ వ్యాపారాల విభజన ప్రక్రియ కూడా జరిగింది. ఆ సమయంలో సంబంధిత కుటుంబ సభ్యులు, వాటాదారుల భాగస్వామ్యంతో ఆస్తుల విలువను నిర్ణయించి విభజించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా వేణు శ్రీనివాసన్ కుటుంబానికి టివిఎస్ మోటార్ కంపెనీ, టివిఎస్ హోల్డింగ్స్ వంటి కీలక సంస్థలపై నియంత్రణ లభించింది. అయితే వేణు శ్రీనివాసన్ కుటుంబంలోని ఆస్తుల విభజనపై అలాంటి పారదర్శకమైన, పరస్పర అంగీకారంతో ఎలాంటి ప్రక్రియ జరగలేదని మల్లిక లక్ష్మి వేణు చెబుతున్నారు. టివిఎస్ మోటార్ కంపెనీ ఛైర్మన్ అండ్ ఎండీగా ఉన్న సుదర్శన్ వేణు ట్రస్ట్ వ్యవస్థల ద్వారా కంపెనీలో ముఖ్యమైన ప్రయోజనం పొందనున్నట్లు టివిఎస్ హోల్డింగ్స్ వెల్లడించడంతో కుటుంబంలో విభేదాలు బయటపడ్డాయి. మరోవైపు లక్ష్మి వేణు, మల్లిక శ్రీనివాసన్ కుటుంబ సంపదకు సంబంధించి న్యాయమైన పరిష్కారం కోసం చర్చలు జరగాలని కోరుతున్నారు. కుటుంబ ఆస్తులపై హక్కులు, వాటాల విభజన కూడా కీలక అంశాలుగా ఉన్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.